




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


నింగికేగిన ఉద్యమ కెరటం.. సురవరం

కష్టజీవుల పోరాట యోధుడు **06**


సంపుటి 08, సంచిక: 269 | శనివారం | 30-08-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## జిఎస్‌టి సంస్కరణలతో రాష్ట్రాలకు నష్టం..

# పరిహారం చెల్లించండి

- ఐదు సంవత్సరాల పాటు ఇవ్వాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు డిమాండ్
- ఏటా రూ. 2 లక్షల కోట్ల ఆదాయం నష్టపోయే ప్రమాదముందని ఆర్థికమంత్రుల తీవ్ర ఆవేదన

**న్యూఢిల్లీ :** కేంద్రం ప్రవేశపెట్టిన జిఎస్‌టి సంస్కరణల ప్రతిపాదన వల్ల సంవత్సరానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం నష్టపోయే ప్రమాదముందని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. దీనికి ఐదు సంవత్సరాల పాటు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాయి. హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ ఎనిమిది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మంత్రులు పన్ను రేటు తగ్గింపు తర్వాత వ్యాపారాలు లాభదాయకంగా మారకుండా నిరోధించడానికి, ప్రయోజనాలు సామాన్యులకు చేరేలా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత పన్ను రేటును కొనసాగించడానికి ప్రతిపాదిత 40 శాతం రేటుతో పాటు విలాసవంతమైన వస్తువులపై అదనపు సుంకం విధించాలని రాష్ట్రాలు సూచించాయి. ఈ లెవీ నుండి వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని తెలిపాయి. ఈ 8 రాష్ట్రాలు సెప్టెంబర్ 3, 4 తేదీలలో జరిగే సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన మరియు అన్ని రాష్ట్ర మంత్రులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ ముందు తమ ప్రతిపాదనలను సమర్పించనున్నాయి. ప్రస్తుత 5, 12, 18, 28 శాతం 4 స్లాబ్ నిర్మాణం కాకుండా, జిఎస్‌టిని 5, 18 శాతం 2టైర్ పన్ను నిర్మాణంగా మార్చాలని కేంద్రం ప్రతిపాదించింది. అంతేకాకుండా పరిహార సెస్సు కూడా ఉంటుంది. కేంద్రం ప్రతిపాదన ప్రకారం... వస్తువులు, సేవలను మెరిట్, స్టాండర్డ్‌గా వర్గీకరిస్తారు. 5, 18 శాతం పన్ను విధిస్తారు. అల్ట్రాలగ్జరీ వస్తువులు వంటి కొన్ని ఎంపిక చేసిన వస్తువులకు 40 శాతం స్లాబ్ ప్రతిపాదించబడింది. రేటు హేతుబద్ధీకరణ కారణంగా ఆదాయ నష్టం అంచనాను కేంద్రం ఇవ్వలేదు. ఎనిమిది రాష్ట్రాల మంత్రుల సమావేశం తర్వాత వారు విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఆర్థిక మంత్రి కృష్ణ బైరే గౌడ మాట్లాడుతూ ప్రతి రాష్ట్రం దాని ప్రస్తుత వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) ఆదాయంలో 15–20 శాతం కోల్పోతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రేటు తగ్గింపు తర్వాత పన్ను ఆదాయ వృద్ధి పెరుగుతుందనే వాదనను తోసిపుచ్చారు. '20 శాతం జిఎస్‌టి ఆదాయ నష్టం దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిర్మాణాన్ని తీవ్రంగా అస్థిరపరుస్తుంది' అని బైరే గౌడ తరువాయి 2లో

### జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.7వేల కోట్లు నష్టం

**జిఎస్‌టి ఆదాయంలో దాదాపు 15శాతం : డిప్యూటీ సిఎం భట్టి**

ప్రజాపక్షం/హైదరాబాద్

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతి రాష్ట్రం ముఖ్యమైనదేనని, సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో కేంద్రం నేరుగా, లేదా కౌన్సిల్ ద్వారానైనా రాష్ట్రాలను సంప్రదించి ఉండాల్సిందని కానీ, అందుకు భిన్నంగా దురదృష్టవశాత్తు 'రేటు హేతుబద్ధీకరణ' ప్రకటన ఏకపక్షంగా జరిగిందని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రతిపాదిత 'రేటు హేతుబద్ధీకరణ' కారణంగా తెలంగాణ రాష్ట్రం కనీసం రూ.5,100 కోట్లు నష్టపోతుందనే అంచనా అని, విభజనతో పాటు, నష్టం దాదాపు రూ.7,000 కోట్లుగా ఉంటుందని, ఇది జిఎస్‌టి ఆదాయంలో దాదాపు 15 శాతమని, తద్వారా రాష్ట్ర ఆర్థిక తరువాయి 2లో

# నేటినుంచి అసెంబ్లీ



- వర్షాకాల సమావేశాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్, చైర్మన్ సమీక్ష
- సభలు సజావుగా జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలని గడ్డం ప్రసాద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉభయ సభల సమావేశాల నిర్వాహణ, భద్రతా ఏర్పాట్లపై తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. శాసన సభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, జిఎడి సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్) రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్) శివలింగయ్య, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, తరువాయి 2లో

## విద్యార్థులు, బోధనా సిబ్బందికి

# ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి

- విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి
- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ నిర్మాణాలు
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- విద్యా శాఖ సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని సిఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసిసిసిలో సిఎం ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణాలను వివిధ విభాగాలు చేపట్టడం సరైంది కాదని, ఈ నిర్మాణాల నాణ్యతప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, తరువాయి 2లో

## రెండురోజుల్లో రాష్ట్రానికి

# 21,325 మెట్రిక్ టన్నులు

- సెప్టెంబర్ మొదటివారంలో మరో 27,950 మెట్రిక్ టన్నుల యూరియా రాక
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- అదనపు యూరియా కేటాయించాలని కేంద్రమంత్రి నడ్డాకు లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న రెండు రోజులలో రాష్ట్రానికి ఐఎఫ్ఎఫ్‌సి ఒఫుల్‌పూర్, ఎన్ఎఫ్ఎల్, ఎంసిఎఫ్ఎల్, క్రిబ్‌కో, సిఐఎల్, పిపిఎల్ కంపెనీల నుండి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ యూరియా రాష్ట్రంలోని గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, వరంగల్, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డి పల్లి ప్రాంతాలకు చేరుకుంటుందని, అక్కడి నుండి డిమాండ్ మేరకు జిల్లాలకు సరఫరా చేస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోపు ఐపిఎల్, సిఐఎల్ కంపెనీల నుండి ధామ్ర, గంగవరం, కరాయికల్ పోర్టుల ద్వారా మరో తరువాయి 2లో



# రాజ్యాంగ రక్షణకు పోరాటం

- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేందుకు యత్నిస్తున్న నిరంకుశ శక్తులను ప్రతిఘటించాలి
- రాహుల్ 'ఓట్ అధికార్ యాత్ర'లో సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీరాజా

**బెట్టియా :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బీహార్‌లో 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' అనే నినాదంతో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'కు అడుగడుగునా ప్రజలనుంచి ఆదరణ లభిస్తోంది. ఈ యాత్ర శుక్రవారం వెస్ట్ చంపారన్ జిల్లా కేంద్రం బెట్టియాకు చేరుకుంది. సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా... తరువాయి 2లో

## భద్రాచలం వద్ద

# మొదటి ప్రమాద హెచ్చరిక

- 43 అడుగులకు చేరిన వరద
- మరింత పెరిగే అవకాశం

ప్రజాపక్షం/భద్రాచలం

భద్రాచలం వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. శుక్రవారం 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాదహెచ్చరికను జారీ చేశారు. దీంతో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణ, తరువాయి 12లో

# ఎసిబి వలలో 'రెవెన్యూ' తిమింగలాలు

- ఖిలావరంగల్ తహసీల్దార్‌కు రూ.5కోట్ల ఆస్తులున్నట్లు గుర్తింపు
- చల్లూరు పంచాయతీ కార్యదర్శి పట్టుబడటంతో టపాసులు పేల్చి గ్రామస్తులు సంబరాలు



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ /వీణవంక

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు దాడులు ఉధృతం చేస్తున్నా కొందరు ప్రభుత్వ అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్న చందంగా తమ పనులకోసం సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లిన వారిని డబ్బు డిమాండ్‌చేస్తున్నారు. తాజాగా శుక్రవారం తరువాయి 12లో

## ప్రభుత్వ కార్యాలయాలు

# పైరవీకారుల అడ్డాలు



- సామాన్యుడికి దొరకని పరిష్కారం
- కాసులిస్తేనే పనులు
- ఆరు బయటే సెటిల్‌మెంట్లు
- ఎసిబికి చిక్కినా మారని తీరు

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రభుత్వ కార్యాలయాల్లో చేయి చాపడం ఈనాటిది కాకపోయినా నిరభ్యంతరమైన పనులను చేసేందుకు మాత్రం అప్పటి అధికార యంత్రాంగం వెనకడుగు వేసేది కాదు. సామాన్యుల బాధలను అడిగి తెలుసుకుని పరిష్కారం చూపేవారు. ఇక రాజకీయ నేతలు సైతం సామాన్యులకే దన్నుగా నిలిచే వారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు సంబంధించిన పనుల పరిష్కారానికి జాప్యం జరుగుతుంటే ప్రజల పక్షాన అప్పటి నాయకులు వకాల్తా పుచ్చుకునే వారు. ఏదో ఒక రకంగా సామాన్యులకు న్యాయం చేసే వారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అవినీతి అధికారులు, రాజకీయ పైరవీకారులు కలగలిసి పోయారు. ప్రజల దగ్గర పీల్చిపిప్పి చేసి అధికారులకు ముట్టజెప్పే ఓ తరం ఇప్పుడు రాజకీయాల్లో చెలామణి అవుతుంది. ప్రతి పనికి ఓ రేటు కట్టి దానిని బజాప్తగా అప్పగించడమే కొందరి రాజకీయ నాయకులకు పనిగా మారింది. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులైతే ఇక కార్యాలయమే సాగిలపడుతుంది. ఈ నేపథ్యంలో తరువాయి 12లో


## భారత్‌లో జపాన్

# భారీ పెట్టుబడులు



- షిగెరు ఇషిబాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
- వచ్చే పదేళ్లలో 10 ట్రిలియన్ యన్‌లు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని జపాన్ వెల్లడి

**టోక్యో:** భారత్‌లో భారీ పెట్టుబడులకు జపాన్ అంగీకారం తెలిపింది. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో శుక్రవారం భేటీ అయిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం అధికారికంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో భారత్‌లో పెట్టుబడుల అంశాన్ని జపాన్ ప్రస్తావించిది. వచ్చే పదేళ్ల కాలంలో 10 ట్రిలియన్ యన్‌లు (సుమారు రూ. 5,98,841 కోట్లు) పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు తెలిపింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా 50 శాతం పన్నులు విధించిన నేపథ్యంలో, ఇషిబాతో మోదీ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. స్వేచ్ఛాయుతమైన, శాంతియుతమైన, గుణాత్మకమైన, నిబంధనలతో కూడిన ఇండో–పసిఫిక్‌ను ఇరు దేశాలు కోరుకుంటున్నాయని మోదీ పేర్కొన్నారు. చర్చలు అర్థవంతంగా జరిగాయని ఇషిబాతో సమావేశమైన తర్వాత విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. పది సంవత్సరాల రోడ్‌మ్యాప్ తయారైందని ఆయన అన్నారు. అత్యంత కీలకమైన ఖనిజాలు, రక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి వివిధ రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయని తెలిపారు. అనేక రంగాల్లో, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు భారత్, జపాన్ దేశాల మధ్య జరిగే ఒప్పందాల్లో అత్యంత కీలకమని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సుమారు 7,000 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టు తర్వాత, దేశంలో హైస్పీడ్ ప్యాసింజర్ రైలు సేవలు ఊపందుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రపంచం
WORLD NEWS

## 18 మంది బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమకారులకు జైలు

**ఢాకా:** బంగ్లాదేశ్ కోర్టు మొత్తం 18 మంది బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమకారులకు జైలు శిక్ష విధించింది. 1971 పాకిస్తాన్ నుంచి విడిపోవడానికి అప్పటి తూర్పు పాకిస్తాన్‌లో ముజిబుర్ రెహమాన్ నేతృత్వంలో ఉద్యమం కొనసాగింది. బంగ్లాదేశ్ అవతరించిన తర్వాత ముజిబుర్ రెహమాన్ కుటుంబీకులే ఎక్కువ కాలం అధికారం చెలాయించారు. ఆయన కుమార్తె, ప్రధాని షేక్ హసీనా ఇటీవల ప్రజల తిరుగుబాటు కారణంగా పదవిని విడిచిపెట్టి, దేశం వదలి పరారైన విషయం తెలిసిందే. ఆమెతోపాటు, ఆమె సార్థ్యంలోని అవామీ లీగ్‌కు సంబంధించిన పలువురు నాయకులు, కార్యకర్తలను ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం అరెస్టు చేసి, వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. కాగా, నాటి ఉద్యమంలో పాల్గొన్న 16 మందికి జైలు శిక్ష విధించిన కోర్టు, ఆ తర్వాత మరో ఇద్దరిని కూడా జైలుకు పంపింది. వీరందరిపైనా దేశద్రోహం, అరాచకవాదం వంటి సెక్షన్ల కింద కేసులు ఉన్నాయి. ఇప్పుడు జైలు శిక్ష పడిన వారిలో కనీసం ఆరుగురి వయసు 70 సంవత్సరాల కంటే ఎక్కువే.

# అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదు

### అమెరికా సెనెటర్ల తైవాన్ పర్యటనపై చైనా ఆగ్రహం



**తైపీ:** అమెరికాకు చెందిన ఇద్దరు సెనెటర్లు తైవాన్ పర్యటనకు వెళ్లడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. తైవాన్ ద్వీపం తమదేనని, దీనిపై సర్వాధికారాలు తమవేనని పునరుద్ఘాటించింది. తమ ప్రమేయం లేకుండా తైపీతో అమెరికా చేసుకునే ఎలాంటి ఒప్పందాలకైనా విలువ ఉండదని స్పష్టం చేసింది. మిసిసిపి రిపబ్లికన్ సేనెట్ ఆర్మ్డ్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ రొజర్ వికర్, నెబ్రాస్కా రిపబ్లికన్ డెబ్ ఫిషర్ శుక్రవారం తైపీ చేరుకున్నారు. ప్రాంతీయ భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు వంటి పలు అంశాలపై తైవాన్ ఉన్నతస్థాయి నాయకులు, అధికారులతో సమావేశమై, పలు రంగాల్లో పరస్పర సహకారంపై ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. అయితే, ఈ పర్యటన తమ సార్వభౌమత్వానికి భంగం వాటిల్లేదిగా ఉందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గుఓ జియాకున్ వ్యాఖ్యానించారు.

తమ దేశ సమగ్రతకు, భూభాగ సంబంధిత హక్కులకు హాని కలిగించే ప్రయత్నమేనని అన్నారు. వేర్పాటు వాదులను రెచ్చగొట్టి, వారిని తప్పుతోవ పట్టించడమే అవుతుందని పేర్కొన్నారు. తైవాన్‌కు అస్త్రాలు సరఫరా చేసే అతిపెద్ద దేశం అమెరికా కావడం గమనార్హం. తైవాన్‌కు అత్యాధునిక ట్యాంకులు, వాయుసేన సంరక్షణ రాకెట్లు, ఆధునిక ఎఫ్ 16 జెట్ యుద్ధ విమానాలను అమెరికా సమకూర్చింది. ఇప్పుడు మరిన్ని రంగాల్లో తైవాన్‌తో ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్టు వికర్, డెబ్‌ఫిషర్ తైపీ చేరుకోవడం చైనా ఆగ్రహానికి ప్రధాన కారణం.

# ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి భారత్ – చైనా కలిసి పనిచేయాలి

### భారత ప్రధాని నరేంద్ర మోదీ



**టోక్యో:** ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి భారత్, చైనా కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జపాన్ పర్యటనకలో భాగంగా 'ది యొమిరి షింబన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పరస్పర గౌరవం, నమ్మకం, సహకారం, సున్నితత్వం ఆధారంగా వ్యూహాత్మక, దీర్ఘకాలిక ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇరుగుపొరుగు దేశాలైన భారత్, చైనా ప్రపంచంలోనే అతిపెద్ద దేశాల జాబితాలో ఉన్నాయని, వీటి మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతమైతే, ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, అభివృద్ధిపై సానుకూల ప్రభావం పడుతుందని మోదీ పేర్కొన్నారు. చైనాతో సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఇప్పుడే ఎందుకు సానుకూల వైఖరి ప్రదర్శిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు, తాను ఇక్కడినుంచి తియాన్జిన్‌కు వెళ్లి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నానని అన్నారు. ఇరు దేశాల మధ్య మైత్రీ సంబంధాలను పటిష్టం కావాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలపై స్థిరమైన, సానుకూల పురోగతి చోటు చేసుకుందని తెలిపారు. ప్రపంచ ఆర్థిక శ్రేణిలో ప్రస్తుత అస్థిరత దృష్ట్యా, రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా భారత్, చైనా కలిసి పనిచేయడం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకి స్థిరత్వానికి అత్యంత కీలకమని మోదీ అన్నారు. భారత్ తన అభివృద్ధి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వ్యూహాత్మక విషయాల్లో వివిధ దేశాలతో చర్చలు జరుపుతున్నదని తెలిపారు. చైనా వంటి దేశాలతో సంబంధాలు ఆర్థిక పరిపుష్టికి తోడ్పడతాయని పేర్కొన్నారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ, భారత్, జపాన్ దేశాలు శాంతిని, అభివృద్ధిని, స్థిరత్వాన్ని, జాతీయ, ప్రాంతీయ సమగ్రతను గౌరవించే ఇండోపసిఫిక్ ఒప్పందాలకు కట్టుబడ్డాయని ప్రధాని అన్నారు. రష్యా, ఉక్రేన్ నాయకులతో ఇటీవల జరిపిన సంభాషణలపై అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ, భారత సైద్ధాంతిక, మానవత్వ దృష్టిని ఇరు దేశాలు అభినందిస్తుంటాయని వ్యాఖ్యానించారు. పెరుగుతున్న ప్రపంచ దక్షిణభాగం ప్రాధాన్యతను గమనిస్తూ, 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడం ద్వారా సమానత్వంతో కూడిన అంతర్జాతీయ సమాజాన్ని నిర్మించడానికి మార్గం ఏర్పడుతుందని మోదీ తెలిపారు.

గ్లోబల్ సౌత్ సభ్యులుగా, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను బాగా అర్థం చేసుకుంటామని అన్నారు. బ్రిక్స్, క్వాడ్ వంటి వేదికలపై గ్లోబల్ సౌత్ ప్రయోజనాల కోసం భారత్ ప్రయత్నాలు చేసిందని మోదీ అన్నారు.

# జిన్‌పింగ్‌తో రెండు పర్యాయాలు భేటీ కానున్న భారత ప్రధాని!



**బీజింగ్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు పర్యాయాలు సమావేశమై, ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు. పిటిఐ కథనం ప్రకారం, షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశానికి హాజరుకానున్న మోదీ, ఆ క్రమంలోనే జిన్‌పింగ్‌తో భేటీ అవుతారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న భారీ సుంకాలు, మొదలుపెట్టిన వాణిజ్య సుంకాలు అంతర్జాతీయంగా గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న నేపథ్యంలో, మోదీ, జిన్‌పింగ్ భేటీ ఆసక్తి రేపుతున్నది.

రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలను మెరుగుపరచుకోవడం కోసం జరిగే వీరి చర్చలు ఫలవంతమైతే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊతం దొరుకుతుందని అంటున్నారు. కాగా, ప్రస్తుతం జపాన్‌లో ఉన్న మోదీ, అక్కడి నుంచి శనివారం సాయంత్రానికి తియాంజిన్ (చైనా) చేరుకుంటారు. ఆదివారం మధ్యాహ్నం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యే అవకాశం ఉంది. అదే విధంగా, ఎస్‌సిఒ సమావేశం అధికారిక భోజనానికి ముందు మరోసారి వీరిద్దరు భేటీ ఉండవచ్చు. మోదీ సోమవారం ఎస్‌సిఒ సదస్సులో పాల్గొంటారు. ఆ క్రమంలోనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ద్వైపాక్షిక సమావేశం జరుగుతుంది. పది సభ్యదేశాలు ఉన్న ఎస్‌సిఒ ఒక రకంగా భారత్, చైనా సంబంధాలను బలోపేతం చేయడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. ప్రత్యేకించి భారత్ ఉత్పత్తులపై అమెరికా 50 శాతం పన్నులు విధించిన నేపథ్యంలో, ఈ మోదీ, జిన్‌పింగ్ సమావేశం అత్యవసరంగా మారింది. కాగా, చైనాకు ప్రధాని మోదీ వెళ్లడం ఏడు సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి. ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. అదే సమయంలో పుతిన్‌తోనూ మోదీ భేటీ కావడం ఆశాజనక పరిణామాలను ఊహించడానికి కారణమవుతున్నది. లడాఖ్‌లో పరస్పర దాడుల తర్వాత, మోదీ, జిన్‌పింగ్ పలు సందర్భాల్లో కలుసుకోవడంతో ఉద్రిక్తతలు తగ్గుతున్నాయి. గత ఏడాది బ్రిక్స్ సమావేశ సమద్బేటీ అయిన వీరిద్దరి చర్చలు సరిహద్దు వద్ద శాంతి స్థాపనకు మార్గాలను సుగమం చేసింది. ఇలావుంటే, ఎస్‌ఒసి సదస్సుకు 20 ఇతర దేశాల నేతలను కూడా ఆహ్వానించడంపైన కూడా చర్చ జరుగుతున్నది. అమెరికా విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో, బాధిత దేశాల మధ్య సయోధ్య అత్యవసరంగా మారిన తరుణంలో, ఇలాంటి సదస్సుల అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు. మొత్తం మీద భారత్, చైనా మధ్య ద్వైపక్షిక సంబంధాల మెరుగుకు ఎస్‌సిఒ సదస్సు వేదిక కానుంది.

# పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో వరద బీభత్సం

### 22 మంది మృతి.. మునిగిపోయిన జనావాసాలు



**లాహోర్:** పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో వరద బీభత్సం కొనసాగుతున్నది. వరదనీటి కారణంగా లాహోర్ నగరంలో కనీసం 22 మంది మృతి చెందారని, తొమ్మిది నివాస ప్రాంతాలు నీట మునిగాయని అధికారులు శుక్రవారం ప్రకటించారు. కాగా, పంజాబ్ లో కనీసం 1,700 గ్రామాలు నీటి మునిగిపోయాయని, వేల ఎకరాల్లో ధాన్యం పంటలు ముంచిపోయాయని ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది. విభిన్న సంస్థలకు చెందిన రెస్క్యూ బృందాలతోపాటు, సైన్యం కూడా రంగంలోకి దిగి, లక్షలాది మందిని రక్షించి, సురక్షిత ప్రాంతాలకు తీసుకువచ్చినట్టు ఆ ప్రకటనలో వివరించింది. అధికారిక ప్రకటనలను అనుసరించి, సట్లేజ్, రావి, చినాబ్ వంటి తూర్పు నదుల్లో తీవ్ర వరదలు చోటుచేసుకున్నాయి. రావి నది వరద నీరు లాహోర్‌లోని పలు ప్రాంతాల్లోకి ప్రవహించాయి. దీనితో రహదారులు మునిగిపోయాయి. వందలాది ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం రావి నదిలో వరదనీటి ప్రవాహం 220,000 క్యూసెక్స్‌గా ఉంది. కానీ ఈ నది డిజైన్ చేసిన సామర్థ్యం 2,50,000 క్యూసెక్స్ మాత్రమే. దీనితో లోతట్టు ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు పెరుగుతున్నాయి. భారత్‌లో రుతుపవనాలు, అల్పపీడనం వంటి కారణాలతో కురుస్తున్న భారీ వర్షాలకు నదులు పొంగిపొర్లుతున్నాయి. వీటిలో కొన్ని పాకిస్తాన్ మీదుగా ప్రవహిస్తాయి కాబట్టి, అక్కడి పలు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి.

## రూ.7వేల కోట్లు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలోని కర్నాటక భవన్‌లో శుక్రవారం వివిధ రాష్ట్రాల సంప్రదింపుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క 15 కీలక అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రేట్ల హేతుబద్ధీకరణకు మద్దతు ఇవ్వడానికి అందరూ సిద్ధంగా ఉన్నప్పటికీ,సంక్షేమ పథకాలపై ప్రతికూల ప్రభావం చూపే నష్టం విషయంలో తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయన్నారు. రాష్ట్రాలకు పన్ను విధించడంలో స్వేచ్ఛ లేనప్పుడు, అంతరాన్ని తగ్గించడానికి అదనపు ఆదాయానికి తగిన విధానాన్ని ప్రవేశపెట్టకపోతే ఆర్థిక భారం భారీగా ఉంటుందన్నారు. రాష్ట్రాల ఆదాయాలను రక్షించడం, సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కొనసాగించేలా తగిన పరిహార విధానాన్ని రూపొందించాలని సూచించారు. పన్ను తగ్గింపు / మినహాయింపు నిజంగా సమాజంలోని పేద, మధ్యతరగతి వర్గాల సమూహాలకు చేరేలా ఉండాలని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుందని, దానికి పరిహారం చెల్లిస్తామని జిఎస్‌టి విధానాన్ని ప్రవేశపెట్టారని, ఐదు సంవత్సరాల కాలంలో జిఎస్‌టి ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారని, తద్వారా పరిహార సెస్సును నిలిపివేయవచ్చు అని అన్నారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, తెలంగాణకు చాలా నిధులు అవసరం. చాలా ఆకాంక్షలు ఉన్నాయని, తాము దశాబ్దాలుగా ఆందోళనకు దిగి, చివరకు ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని పొందామని భట్టి వివరించారు. రాష్ట్రాన్ని బాగు చేయడానికి నిధులు అవసరమని, సరైన పన్ను విధించడం తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి సహాయపడుతుందన్నారు. తెలంగాణ జిఎస్‌టి ఆదాయం 2024 25 వరకు 10 శాతం మాత్రమే సిఎజిఆర్‌ను సాధించినట్టు గుర్తించామని, కానీ ఇది వ్యాట్‌లో 18 శాతం సిఎజిఆర్‌గా ఉన్నదని భట్టి వివరించారు.ఈ సమావేశంలో భట్టి విక్రమార్కతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి కర్నాటక కృష్ణ బైరేగౌడ (రెవెన్యూ మంత్రి), పంజాబ్ హర్‌పాల్‌సింగ్ చీమా (ఆర్థిక మంత్రి), కేరళ కె.ఎన్. బాలగోపాల్ (ఆర్థిక మంత్రి), జార్ఖండ్ రాధాకృష్ణ కిషోర్ (ఆర్థిక మంత్రి), తమిళనాడు తంగం తెన్నరసు (ఆర్థిక మంత్రి), హిమాచల్‌ప్రదేశ్ రాజేష్ ధర్మాని (సాంకేతిక విద్యామంత్రి), పశ్చిమబెంగాల్ ఉజ్జయిని దత్తా (రెసిడెంట్ కమిషనర్) పాల్గొన్నారు.

**జిఎస్‌టి అమలుతో తెలంగాణకు తగ్గిన ఆదాయం**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక చర్యల స్వేచ్ఛతో వ్యాట్‌ను కొనసాగించి ఉంటే 2024–25 సంవత్సరానికి ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేదని, కానీ జిఎస్‌టి ద్వారా ఆదాయం రూ.42,443 కోట్లు మాత్రమే వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో జిఎస్‌టి వసూళ్లు 39 శాతమేనని, అందుకే జిఎస్‌టి రేట్లలో ఏవైనా తగ్గింపులు ఉంటే, కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 80 శాతం కంటే ఎక్కువగా సంక్షేమ వ్యయం కోసమే ఉద్దేశించిందన్నారు. తెలంగాణలో విలాసవంతమైన వస్తువులపై సెస్ వాటా రాష్ట్రానికి వచ్చే జిఎస్‌టిలో 15 శాతం మాత్రమేనన్నారు. తెలంగాణ జిఎస్‌టి ,జిఎస్‌డిపి నిష్పత్తి 2022–23ఆర్థిక సంవత్సరంలో 3.07 శాతం నుండి 2024–25లో 2.58 శాతానికి క్రమంగా తగ్గుతోందని, 'రేటు హేతుబద్ధీకరణ' దీనిని మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**సెప్టెంబర్ 3న 'బ్రేక్‌ఫాస్ట్ సమావేశం' : భట్టి**

'జిఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణ' అంశంపైన సెప్టెంబర్ 3వ తేదీన న్యూఢిల్లీలోని తమిళనాడు భవన్‌లో బ్రేక్‌ఫాస్ట్ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమావేశనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై చర్చించి, కేంద్రానికి నివేదిస్తామని, త్వరలోనే జరగబోయే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను ప్రస్తావిస్తామని చెప్పారు. చాలా రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నదని, అందుకే కేంద్రం జిఎస్‌టి హేతుబద్ధీకరణ అంశంపై ఆలోచన చేసి, సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని వరదలకు సంబంధించి అంశంపైన త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించి, తగిన ఆర్థిక సాయాన్ని కోరుతామని భట్టి విక్రమార్క తెలిపారు.

## నేటినుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్, ఎడిజి (శాంతిభద్రతలు) మహేష్ భగవత్, అడిషనల్ సిపి విక్రమ్ సింగ్‌మాన్, సైబరాబాద్,రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ్‌రెడ్డితో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సజావుగా జరగడానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించలన్నారు. ఉభయ సభల సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలన్నారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలన్నారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని రూట్లలో రోడ్లు దెబ్బతిన్నాయని, ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విధంగా సహకరించాలి. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలని, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసనమండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలి. అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలన్నారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు మాట్లాడుతూ సభ సజావుగా జరగడానికి, ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని, అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా పదవీకాలం పొడగింపు పొందిన చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావుకు స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యుడిసి) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సిఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని, ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సిఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సిఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని, కంటైనర్లపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సిఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సిఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సిఎం ఆదేశించారు. సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ పాల్గొన్నారు.

## పరిహారం చెల్లించండి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్రాలకు 5 సంవత్సరాలు పరిహారం చెల్లించాలని, ఆదాయాలు స్థిరీకరించే వరకు దీనిని మరింత పొడిగించవచ్చని అన్నారు. జిఎస్‌టి అమలు చేసినప్పుడు ఆదాయతటస్థ రేటు (ఆర్ఎన్ఆర్) 14.4 శాతంగా ఉంది. కానీ తదుపరి పన్ను రేటు హేతుబద్ధీకరణ నికర పన్ను రేటును 11 శాతానికి తగ్గించిందని, జిఎస్‌టి రేట్లను, స్లాబ్‌లను తగ్గించాలనే కేంద్రం ప్రస్తుత ప్రతిపాదన నికర పన్ను రేటును 10 శాతానికి తగ్గిస్తుంది అని గౌడ చెప్పారు. జిఎస్‌టి ప్రవేశపెట్టిన సమయంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, పెరిగిన ఆర్థిక కార్యకలాపాలు ఆదాయంలో పెరుగుదలకు దారితీస్తాయని ప్రస్తావించారని, కానీ గత 7–8 సంవత్సరాల జిఎస్‌టి థియరీ సిద్ధాంతాన్ని పూర్తిగా తప్పుగా నిరూపించిందన్నారు. ప్రతి రౌండ్‌లో రేటు తగ్గింపు ఫలితంగా అన్ని రాష్ట్రాలకు నికర ఆదాయ నష్టం జరిగిందన్నారు. సహేతుకమైన అంచనాలు ప్రతిపాదిత రేటు హేతుబద్ధీకరణ నుండి రూ. 1.52 లక్షల కోట్ల ఆదాయ నష్టాన్ని సూచిస్తాయని చెప్పారు. ఈ నష్టంలో 71 శాతం రాష్ట్రాలు భరిస్తాయని గౌడ పేర్కొన్నారు. రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను కాపాడుకోవాలని సూచించారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలకు తీవ్రమైన నష్టం జరిగితే, ప్రజలు ప్రభావితమవుతారు. అభివృద్ధి పనులు ప్రభావితమవుతాయి. తగినంత ఆదాయం రాష్ట్ర స్వయంప్రతిపత్తిని కూడా దెబ్బతీస్తుంది' అని బైరే గౌడ అన్నారు. ప్రతిపాదిత జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణతో, తెలంగాణ ఏటా రూ. 7,000 కోట్లు కోల్పోతుందని అంచనా వేయబడిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. కొత్త పన్ను చర్య వల్ల రాష్ట్రాలకు కలిగే నష్టాలకు తగిన పరిహారం చెల్లించాలని కేంద్రాన్ని కోరారు. హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్య మంత్రి రాజేష్ ధర్మాని మాట్లాడుతూ 'రేటు హేతుబద్ధీకరణ ప్రతిపాదనకు మేము అంగీకరిస్తున్నాము. కానీ మాకు కూడా పరిహారం చెల్లించాలి. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపే రెడ్ కేటగిరీ తయారీ కంపెనీలకు ప్రత్యేక స్లాబ్ ఉండాలి' అని ధర్మాని అన్నారు. కేరళ ఆర్థిక మంత్రి కె ఎన్ బాలగోపాల్ మాట్లాడుతూ రేటు హేతుబద్ధీకరణ జరగాలి కానీ రాష్ట్రాల ఆదాయం కాపాడలని, ప్రయోజనాలు సామాన్యులకు చేరాలన్నారు. పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా కూడా లాభాపేక్షను గుర్తించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా రేటు హేతుబద్ధీకరణ ప్రయోజనాలు సామాన్యులకు చేరుతాయని చెప్పారు. '2017లో జిఎస్‌టి అమలులోకి వచ్చినప్పటి నుండి పన్ను రేట్లను 15 సార్లు సవరించారు. కానీ అన్ని రాష్ట్రాలు ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి' అని చీమా అన్నారు. తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు హేతుబద్ధీకరణ ప్రక్రియ వల్ల కలిగే నష్టాలకు అన్ని రాష్ట్రాలకు పరిహారం ఇవ్వాలన్నారు. రాష్ట్రాల ఆదాయ వద్ధిని కాపాడుకోవాలన్నారు. సెప్టెంబర్ 2న మళ్లీ సమావేశమయ్యే ఎనిమిది రాష్ట్రాలు, ఆదాయ రక్షణను లెక్కించడానికి బేస్ సంవత్సరాన్ని 2024–25గా నిర్ణయించాలనిష రాష్ట్రాల ఆదాయాలను ఏటా 14 శాతంగా రక్షించాలని డిమాండ్ చేశాయి. ఇది గత 3 సంవత్సరాల సగటు వృద్ధి రేటు. 'ప్రతిపాదిత అదనపు లెవీ విధించిన తర్వాత కూడా లోటు ఉంటే, కేంద్ర ప్రభుత్వం అదనపు లెవీ భవిష్యత్తు రసీదులకు వ్యతిరేకంగా సెక్యూర్ చేయబడిన రుణాలను సేకరించాలి' అని రాష్ట్రాల ప్రతిపాదన పేర్కొంది.

## 21,325 మెట్రిక్ టన్నులు

(మొదటి పేజీ తరువాయి)

27,950 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, ఈ యూరియాను ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్‌నగర్, గజ్వేల్, జగిత్యాల, నాగిరెడ్డిపల్లి ప్రాంతాలకు చేరుకోనుందని మంత్రి వివరించారు.

**అదనంగా 2.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించండి: కేంద్ర మంత్రి నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ...**

రైతుల అవసరాలను తీర్చే విధంగా సెప్టెంబర్‌లో అదనపు యూరియాను తక్షణమే కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి తుమ్మల కేంద్రమంత్రి నడ్డాకు శుక్రవారం లేఖ రాశారు. వరి పంటకు మొదటి, రెండవ విడతల యూరియా వేస్తున్నారని, త్వరలో మూడవ విడతతో పాటు ఎం.ఒపి వాడకం కూడా ప్రారంభమవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కేవలం వరి పంటకే సెప్టెంబర్ నెలలో 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందన్నారు. ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు రాష్ట్రానికి 2.38 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడిందని వివరించారు. ఈ లోటు రైతులపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న యూరియా స్టాక్ కేవలం 30,000 మెట్రిక్ టన్నులు మాత్రమేనని, రోజుకు 9,000 నుండి 11,000 మెట్రిక్ టన్నుల వరకు అమ్ముతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. కేంద్ర ఎరువుల శాఖ రాష్ట్రానికి అదనంగా 2.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని, అలాగే సెప్టెంబర్ నెలకు ఇప్పటికే ఆమోదించిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరాకు తోడుగా అదనపు కేటాయింపును మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. కాకినాడ పోర్టుకు చేరనున్న ఒబిఇ లోటస్, నౌకలోని 47,500 మెట్రిక్ టన్నులు, గంగవరం పోర్టుకు చేరనున్న రెండు నౌకల (ఎంవిఎఎం ఒషియన్ ఫ్రైట్ 45,000 మెట్రిక్ టన్నులు, మెగ్డా 44,000 ఎం.టి) నుండి 20,000 మెట్రిక్ టన్నుల యూరియా చొప్పున రాష్ట్రానికి మంజూరు చేయాలని కోరారు.


## రాజ్యాంగ రక్షణకు పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ, బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్షనేత తేజస్వీ యాదవ్, వీఐపీ నాయకుడు ముకేశ్ సహాని, కాంగ్రెస్ బీహార్ అధ్యక్షుడు రాజేష్ రామ్‌లతో కలిసి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనీరాజా మాట్లాడుతూ... ఈ యాత్ర రాజ్యాంగాన్ని రక్షించడానికి, ఓటు హక్కును కాపాడుకోవడానికి, మన ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడానికి ప్రయత్నిస్తున్న నిరంకుశ శక్తులను ప్రతిఘటించడానికి ఒక పోరాటమని పేర్కొన్నారు. ఈ యాత్ర ద్వారా ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులను కాపాడాలనే పిలుపును ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్నికల సంఘం తీరును తప్పుబడుతూ రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈనెల 17న ప్రారంభమైన యాత్ర.. 16 రోజుల పాటు 1,300కి.మీ మేర సాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది.

## శభాష్ అగ్నిమాపక శాఖ..

### మూడు రోజుల నుంచి నీళ్లలోనే విధులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల మూడు రోజుల నుంచి అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. వీరి సేవలను ప్రత్యక్షంగా చూసిన ప్రజలు శభాష్ అంటూ కొనియాడారు. రాత్రిబవళ్లు అధికారులు, సిబ్బంది నీళ్లలోనే ఉండి విధులు నిర్వహిస్తున్నారని తెలంగాణ అగ్నిమాపక శాఖ డిజి వై.నాగిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోని ఆరు జిల్లాలు కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేటలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు, నీటిపారుదల చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టుల నుండి బ్యాక్ వాటర్స్ రావడం, కొన్ని చెరువులు తెగిపోవడం వల్ల ఈ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్ర ఇసుక నివాస కాలనీలు ముంపునకు గురయ్యాయి. వరదల కారణంగా వంతెనలు మరియు రోడ్లు తెగిపోయాయి, ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కష్టమైంది. ఈ ప్రాంతాల్లోని ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించడానికి, తెలంగాణ అగ్నిమాప, విపత్తు ప్రతిస్పందన విభాగం పరిస్థితిని పరిష్కరించడానికి గరిష్టంగా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించిందని నాగిరెడ్డి తెలిపారు. రైతులు, గొర్రెల కాపరులు, విద్యార్థులు, నివాసితులు, అధికారులు, పిల్లలు, వృద్ధులు మరియు గర్భిణులు, పశువులు వంటి వివిధ రంగాలకు చెందిన 1,646 మంది వరద బాధితులను వివిధ జిల్లాల్లో 31 వేర్వేరు సహాయ చర్యలలో ఈ వరదల నుండి రక్షించామని తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని జిఆర్ కాలనీ, పరిసర ప్రాంతాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ చేరుకోవడానికి అగ్నిమాపక శాఖ సిబ్బంది అన్ని అవకాశాలను ధైర్యంగా ఎదుర్కొన్నామన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని సిఎం ఎ.రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసి, మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు కలిసి విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని కోరిన కమిటీ సభ్యులు.

## తెలంగాణ క్రీడా కార్యక్రమాలు
# దేశానికే మార్గదర్శకం



### మంత్రి వాకిటి శ్రీహరి ఉద్బోధ క్రీడాకారులకు నగదు పురస్కారాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రీడా కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలవాలని.. భారత క్రీడలకు చిరస్థాయిగా ప్రేరణ నిచ్చిన మహానుభావుడు ధ్యాన్ చంద్ స్ఫూర్తితో క్రీడా సమాజం ముందుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం జరిగిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ఒలంపిక్స్ క్రీడలు నిర్వహించడమే కాదు ఒలంపిక్స్ పతకాలు సాధించడంలో కూడా తెలంగాణ క్రీడాకారులు ముందుండాలని మంత్రి అన్నారు. నూతన క్రీడా విధానం ఇస్తున్న ప్రోత్సాహంతో క్రీడాకారులు తమ ప్రతిభను చాటి తెలంగాణ రాష్ట్రానికి వన్నె తేవాలని ఆయన కోరారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది రోజులపాటు, అత్యంత ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించి క్రీడాస్ఫూర్తిని చాటుతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయని అన్నారు. ఒక ఏడాదికాలంలోనే అనేక క్రీడా కార్యక్రమాలు నిర్వహించి క్రీడా విధానం ప్రకటించి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణను క్రీడా ప్రముఖులు ప్రశంసిస్తున్నారని ఆయన తెలిపారు. మరిన్ని క్రీడా కార్యక్రమాలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోనే వినూత్నమైన విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, హైదరాబాద్ నగరంలోనే కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లో క్రీడా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయని 41 మంది క్రీడాకారులకు రూ.ఒక కోటి 29 లక్షల వరకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వరల్డ్ ఆర్చరీ అండర్ 21 బంగారు పతకం సాధించిన చికితా తానిపర్తికి రూ.5 లక్షల నగదు పురస్కారాన్ని, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిని శృతికి ఐదు లక్షల రూపాయల నగదు పురస్కారాన్ని షూటింగ్ క్రీడాకారిని ఇషా సింగ్‌కు రూ.4 లక్షల నగదు పురస్కారాన్ని పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిని తుడి శ్రీ చందనకు రూ.5 లక్షల నగదు పురస్కారాన్ని ఇండియన్ క్రికెట్ టీం ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్‌కు రూ.5 లక్షల నగదు పురస్కారాన్ని, జులై 2025 సౌత్ కొరియా జీ చైన్‌లో జరిగిన 20వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన తేజేష్, కాంతి శ్రీ, శ్రియా మురళి, ఎందూరు ఆకాంక్ష, చలంచర్ల జోహిత్, జియా జయేష్ పటేల్, రక్షిత్ మురళి ఎందూరు సంచిత చౌదరి, ప్రతీక్‌లకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల నగదు పురస్కారాలను అందజేశారు. జూనియర్ ఓల్డ్ కెన్యా లో జరిగిన జూనియర్ వరల్డ్ రోల్‌బాల్ పోటీలో నెగ్గిన ఎం. శ్రీశాంకు రూ.5 లక్షలు, రూరల్ స్కేటింగ్‌లో మాకన్ సౌరవ్ సింగ్, ఆర్. కావ్యశ్రీలకు రూ.4 లక్షల చొప్పున నగదు పురస్కారాలను, మోక్షిత్ రామ్‌రెడ్డికి రూ.2 లక్షల నగదు పురస్కారాన్ని, ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఆసియా కప్‌లో పాల్గొన్న ప్రవల్లికకు రూ.2లక్షలు, రోలర్ స్కేటింగ్ క్రీడాకారిని నయనశ్రీకి రూ.75 వేల పురస్కారం, షూటింగ్ క్రీడాకారుడు లీలా ప్రసాద్ రాజుకు రూ.75 వేలు నగదు పురస్కారం, షూటింగ్ క్రీడాకారిని కర్ణికకు రూ.50 వేల నగదు పురస్కారం, చెస్ క్రీడాకారులు శివంశికకు రూ.50 వేల నగదు పురస్కారం, చెస్ క్రీడాకారుడు ఆకాశకు రూ.75 వేల నగదు పురస్కారం అందజేశారు.

## పారదర్శక పాలన కోసమే
# సమాచార హక్కు చట్టం




### ఆర్‌టిఐ కమిషనర్‌లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పివి శ్రీనివాస్‌రావు

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పిఐఓ అప్పిలేట్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్‌లు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆర్‌టిఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఒకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నుండి 17వేల ఆర్‌టిఐ కేసులో పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల పర్యటనలు చేపట్టి కేసులను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఆర్‌టిఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు 41బి, సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయి అన్నారు. జిల్లాస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆర్‌టిఐ యాక్ట్‌లో 31 సెక్షన్లు 6 చాప్టర్లు ఉన్నాయని, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై పిఐఓ, జిల్లా అధికారుల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కరణ, పెండింగ్ గురించి తెలుసుకొని, పిఐఓ, అధికారులలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కమిషనర్లను వరంగల్ ప్రఖ్యాతి గాంచిన చేనేత దర్రి బహుకరించి శాలువ, మెమొంటోలతో సన్మానించారు. జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయి, డిసిపి షేక్ సలిమా, అంకిత్ కుమార్‌లు శాలువాలతో సత్కరించారు. సమావేశ అనంతరం పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిఐ దరఖాస్తులపై ఆర్‌టిఐ కమిషనర్లు విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డిఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు, వివిధ శాఖల పిఐఓలు, అప్పిలేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున సిఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని సినీ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, ప్రణయ్‌రెడ్డి వంగాలు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేశారు.






భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మధ్యప్రదేశ్ 21వ రాష్ట్ర మహాసభల ప్రారంభాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్వాలియర్ జిల్లాలోని డబ్రా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జాతీయ కార్యదర్శులు డా.కె.నారాయణ, గిరీష్ చంద్ర శర్మ, రాష్ట్ర కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు హరిద్వార్ సింగ్, శైలేంద్ర శైలి, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలోని కూడళ్లను పార్టీ జెండాలతో అలంకరించారు. సిపిఐ కార్యకర్తలు పార్టీ జెండాలను చేతబూని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

# బత్తాయి సాగు రైతులకు భారం

### రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్‌కు రైతుల మొర



**ప్రజాపక్షం/నిడమనూరు:** చీడ పీడలు అధిక పెట్టుబడులు అనుకూలించని వాతావరణం గిట్టుబాటు ధర లభించకపోవడం తదితర కారణాల మూలంగా బత్తాయి సాగు చేయడం భారంగా మారిందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి రైతులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మండల పరిధి ఎర్రబెల్లి గుంటుపల్లి తదితర గ్రామాలలో బత్తాయి తోటలను సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నర్సరీలలో నాణ్యమైన బత్తాయి మొక్కలు లభించడం లేదని, నాటి బత్తాయి మొక్కలు చీడపీడలను తట్టుకోలేకపోతున్నాయని క్రిమిసంహారక మందులు కూడా పనిచేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బత్తాయి తోటలో సాగుకు బిందు సేద్యానికి సబ్సిడీపై పరికరాలు అందజేయాలని, జిల్లాలో బత్తాయి మార్కెట్‌ని ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల విజ్ఞప్తి చేశారు. దళారుల మూలంగా రైతులు గిట్టుబాటు ధర లభించక తలడిల్లుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు, బత్తాయికి గిట్టుబాటు ధర రాకపోవడంతో అనేక మంది రైతులు పండ్ల తోటలు పీకి వేసి వరి సాగు వైపు మొగ్గుచూపుతున్నారని రైతులు వివరించారు. రైతు సమస్యల్ని సావధానంగా విన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్ష సమావేశంలో నివేదికను ప్రభుత్వానికి సమర్పించి బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికి మార్గాన్ని సూచించడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధర అందించే దిశలో ప్రయత్నాలు చేస్తామని ఆయన రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. అంతకుముందు ఆయన మల్లెపల్లి వద్దగల ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని సందర్శించి వచ్చారు. ఆయన వెంట రైతు కమిషన్ కమిటీ సభ్యులు జాయిన్ డైరెక్టర్ బాబు, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారిని సుభాషిని, నిడమనూరు తాసిల్దార్ కృష్ణయ్య, వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు సరిత, వ్యవసాయ అధికారి ముని కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అంకతి సత్యం, బుసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారులు అనంతరెడ్డి, మురళి, రిషిత, శ్వేత, విద్యాసాగర్, నసీమా, ఏఈఓ మహేష్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వైస్ చైర్మన్ సిరిగిరి శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నూకల వెంకటరెడ్డి, రైతులు మోసాల శ్రీనివాస్, నరోత్తం రెడ్డి, మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అత్యవసర విభాగాల మధ్య సమన్వయం అవశ్యం

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఇతర ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ల మధ్య సమన్వయం ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆపరేషన్ల తర్వాత, చికిత్స మధ్యలో పేషెంట్లను డిశ్చార్జ్ చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఒక ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డులో పేషెంట్లు ఎక్కువగా ఉండి బెడ్స్ ఖాళీ లేకపోతే, ఆ పేషెంట్‌ను మరో ఆస్పత్రికి రిఫర్ చేసి, అక్కడ అడ్మిట్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, పేషెంట్‌ను రిఫర్ చేయడానికి ముందే అవసరమైన ప్రాథమిక చికిత్స అందించి, స్టేబుల్ చేయాలని సూచించారు. నిమ్స్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితర ఉన్నతాధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్స్‌లో చికిత్స, పేషెంట్లు, తదితర అంశాలను మంత్రి దామోదర రాజనర్సింహకు డాక్టర్ బీరప్ప వివరించారు. ఈ ఏడాది తొలి ఏడు నెల్లలో (జనవరి నుంచి జులై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని, ఇందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఇజెహెచ్‌ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందినట్టు వివరించారు. మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో నిమ్స్‌కు వచ్చే పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని బీరప్ప వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేశామన్నారు. ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీకి రోజుకు 80 నుంచి వంద మంది పేషెంట్లు వస్తున్నారని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తున్న పేషెంట్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వీలైనంత త్వరగా పేషెంట్లను అడ్మిట్ చేసుకుని, ట్రీట్‌మెంట్ అందించాలని సూచించారు. ఎమర్జెన్సీ వార్డులో అవసరమైన చికిత్స అందించి, సంబంధిత వార్డుకు పేషెంట్‌ను షిఫ్ట్ చేయాలన్నారు. ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి పేషెంట్‌ను తరలించే సమయంలో ఆ పేషెంట్‌తో పాటు అవసరమైతే అంబులెన్స్‌లో ఒక డాక్టర్‌ను కూడా పంపించాలని మంత్రి సూచించారు. పేషెంట్ల అడ్మిషన్, రిఫరల్ విషయంలో డ్యూటీ డాక్టర్లు, ఆర్‌ఎంఒలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చొంగ్తూ, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సంస్మరణ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సిపిఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి.రమణ, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల, వామపక్ష పార్టీల నాయకులు, మేధావులు హాజరు కానున్నారని సాంబశివరావు తెలిపారు. సభలో రాష్ట్ర వ్యాపితంగా ఉన్న పార్టీ శ్రేణులు, సురవరం సుధాకర్‌రెడ్డి అభిమానులు పాల్గొనాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కల్లుగీత వృత్తిలో నిమగ్నమై వృత్తి నిర్వహణలో భాగంగా చెట్ల పైనుంచి పడి మరణించిన గీత వృత్తిదారుల కుటుంబాలకు, గాయపడిన వారికి సుమారు 700 మంది కుటుంబాలకు సుమారు రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా మంజూరై ఏడాది గడిచినప్పటికీ నేటి వరకు ఎక్స్‌గ్రేషియా అందించకపోవడం గర్హనీయమని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరణించిన కల్లు గీతవృత్తిదారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచాలని ఆయన కోరారు. అర్హులైన వృత్తిదారులకు కాటమయ్య కిట్లను తక్షణమే అందించి గీత కార్మికులకు శిక్షణనిచ్చి ప్రమాదాల నుండి కాపాడానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పిల్లలపై డిజిటల్ మాధ్యమాల ప్రభావం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిసాట్ ద్వారా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వరంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. టిసాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డిని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా సీతాదయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల కోసం కూడా ప్రత్యేకమైన కార్యక్రమాలు భవిష్యత్‌లో కమిషన్ నుండి టిశాట్ ద్వారా చేయనున్నామని తెలిపారు. డిజిటల్ మాధ్యమాల ప్రభావం పిల్లలపై చాలా ఉందని తెలిపారు. బాలలపై జరుగుతున్నా అఘాయిత్యాలు, సామాజిక దురాచారాలు, డిజిటల్ మీడియా ప్రభావం, జేజే యాక్ట్, ఇతర చట్టాల అవగాహన కల్పించడం కోసం కమిషన్ టిసాట్ ద్వారా పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు చేరువయ్యే విధంగా కార్యక్రమాలు చేయనున్నట్లు చైల్డ్ రైట్స్ కమిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు వచన్ కుమార్, వందన గౌడ్, చందన, అపర్ణ, సరిత, ప్రేమలత అగర్వాల్ పాల్గొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**

**ఫారం-C**
**నోటిఫికేషన్**

(10ఎ మినహాయింపు ఇవ్వబడిన చట్టంలోని సెక్షన్ 11 క్రింద) (రూల్ 6/12 చూడండి)

గెజిట్ నెం. GHMC-13 తేది: 25-06-2025
నెం. సి/332/2025 తేది: 25-06-2025

రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలో మొత్తం 5430.75 చ.గజాల విస్తీర్ణం గల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా, హెచ్.సిటీ ప్రతిపాదిత 65.0 మీ మరియు 36.0 మీ. వెడల్పు రోడ్డు క్రింద IIIT జంక్షన్ వద్ద ప్రతిపాదిత మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం కొరకు రివైజ్డ్ జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్ కొరకు అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/స్పెషల్ కలెక్టర్ (భూ.సే.) మరియు కమిషనర్, GHMC వారు భావిస్తున్నారు.

అందువలన రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలోని కొంచెం హెచ్చుతగ్గులతో 5430.75 చ.గజాల ప్రామాణిక కొలతలుగల భూమి పై సదరు ప్రాజెక్టు కొరకు అవసరమై ఉన్నదని ప్రకటించడమైనది. సేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి యొక్క సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడినది.

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | పట్టా రకం | భూమి రకం | విస్తీర్ణం చ.గజాలలో | ప్రయోజనం గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు: రకము | సంఖ్య | కట్టడాలు: రకము | ఇతర వివరాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | ప్లాట్ నెం.2, సర్వే.నెం 124 &125 | - | - | 316.67 | శ్రీ చింతమనేని వెంకటశివ రామకృష్ణప్రసాద్ | స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | ప్లాట్ నెం.3, సర్వే.నెం 124 &125 | - | - | 316.67 | శ్రీమతి వెల్లంకి దేవకి దేవి భర్త: భరద్వాజ రావు | | | | | - | - | - | - |
| 3 | ప్లాట్ నెం.158, సర్వే.నెం 124 &125 | - | - | 316.66 | శ్రీమతి ఝాన్సీ | | | | | - | - | - | - |
| 4 | బిట్‌నెం.1 సర్వే.నెం 124 | - | - | 1124.44 | శ్రీ కె. శ్రీనివాస్ రావు తండ్రి: కె. పుల్లయ్య చౌదరి | | | | | - | - | - | - |
| 5 | ఖాళీస్థలం సర్వే.నెం 124/పార్ట్ | - | - | 440.33 | శ్రీ జి. రమణయ్య నాయుడు, తండ్రి: కీ.శే. వెంకటయ్య నాయుడు | | | | | - | - | - | - |
| 6 | బిట్‌నెం.4 సర్వే నెం. 124 | - | - | 446.88 | మెస్సర్స్ శ్రీ అగ్రి వెంచర్స్ ప్రై.లి. ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ | | | | | - | - | - | - |
| 7 | ఖాళీస్థలం సర్వే.నెం 93 | - | - | 2227.59 | 1.శ్రీమతి కె. లక్ష్మిదేవి 2. శ్రీ కె. అరవింద్ రెడ్డి 3. శ్రీ కె. యం. అఖిలేష్ రెడ్డి | | | | | - | - | - | - |
| 8 | ప్లాట్‌నెం.1/ HIG-A సర్వేనెం 181 | - | - | 89.44 | శ్రీ కె. కోమల వదన్ | | | | | - | - | - | - |
| 9 | ప్లాట్‌నెం.20/ HIG-A సర్వేనెం 181 | - | - | 152.07 | శ్రీ బుపలీ మహబూబ్ | | | | | - | - | - | - |
| | | | మొత్తం | 5430.75 | | | | | | | | | |

భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (యాక్ట్ నం.21 ఆఫ్ 2017) ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కుచట్టం, 2013లోని సెక్షన్ 11(1) (కేంద్ర చట్టం నం. 30/2013) నిబంధనల ప్రకారం సంబంధితులందరికీ తెలియజేయుటకు గాను ఈ ప్రకటన చేయడమైనది.

ఈ భూమి ప్లానును స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్ కార్యాలయం, GHMC, హైదరాబాద్లో ఏ పనిరోజునైనా కార్యాలయ పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్-12లో ఏర్పాటుచేసిన మరియు నిర్దిష్టపరిచిన విధంగా తమ పనిని తగువిధంగా నిర్వహించేందుకు భూమిలో ప్రవేశించి, సర్వేచేసి, ఏవేని భూమి స్థాయిలను తీసుకొనుటకు సబ్సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు మరియు అవసరమైన అన్ని ఇతర చర్యలు తీసుకొనుటకు అధీకృత అధికారి అంటే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, GHMC, హైదరాబాద్ వారికి మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం/స్పెషల్ కలెక్టర్(LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్-సహిత-సముచిత ప్రభుత్వం అధికారం ఇస్తోంది.

చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద, స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్ వారి ముందస్తు ఆమోదం లేకుండా అట్టి ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అట్టి భూమిపై ఎటువంటి వ్యవహారములు చేయరాదు లేదా వ్యవహారములకు కారణం కారాదు అంటే అమ్మకం/ కొనుగోలు మొ.నవి చేయరాదు లేదా అట్టి భూమిపై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు.

సేకరణకు అభ్యంతరాలు ఏవైనా ఉంటే మరియు నష్టపరిహారం కోసం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ప్రయోజనంగల/ ప్రభావిత వ్యక్తులందరు వారి క్లెయిములను చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటుచేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీనుండి 60 (అరవై రోజుల)లోగా భూమిలో ప్రయోజనం గలవారు స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్ / అధీకృత అధికారి సమక్షంలో వాటిని దాఖలు చేయవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA), GHMC, హైదరాబాద్
సం/- స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్

DIPR R.O.No. 336/LA/PP/ADVT/AGENCY/2025-26



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్.బి.నగర్ సర్కిల్-4**

NIT No. 21/EEC-4/LBNR/GHMC/2025-26 (షార్ట్ టెండర్ ప్రకటన) తేది: 29.08.2025

**పని పేరు:** నిర్వహణ పనులు - 1 నెం.లు, **అంచనా విలువ:** రూ.2.90లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/ ఆఖరి తేదీ & సమయం:** 30.08.2025న మ.03.00గం.ల నుండి 02.09.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి. మొబైల్: 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 7291-PP/CL/ADVT/1/2025-26, Date: 29-08-2025



**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం:: కల్వకుర్తి**
**నాగర్‌కర్నూల్ జిల్లా.**

టెండర్ నోటీసు నం. E1/W-2/UGD/Ganesh/GF/2025-26, ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు) తేదీ: 29.08.2025

కల్వకుర్తి మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ కింద (1) పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారమ్‌లో టెండర్లను ఆహ్వానించడమైనది.

| | |
|---|---|
| అంచనా విలువ | రూ.07.00 లక్షలు |
| పని పేరు | 2025-26 జనరల్ ఫండ్ కింద కల్వకుర్తి మున్సిపాలిటీలో గణేష్ విగ్రహ నిమజ్జనం కోసం ఎర్రకుంట ప్రాంగణంలో ఏర్పాటు |
| బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం | 30.08.2025. ఉదయం 11:30 గంటలకు |
| బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం | 02.09.2025 @ సాయంత్రం 04:30 గంటలకు |
| అంచనా విలువ | రూ.03.60 లక్షలు |
| పని పేరు | జనరల్ ఫండ్ 2025-26 కింద కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డు నెం: 01 వద్ద విజయ్ హౌస్ నుండి హైద్ పిడబ్ల్యుడి రోడ్డు వరకు అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నిర్మాణం |
| బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం | 30.08.2025. ఉదయం 11:30 గంటలకు |
| బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం | 06.09.2025 సాయంత్రం 04:30 గంటలకు |

మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా 'www.eprocurement.gov.in' లో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానిస్తున్న అధికారి కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నంబర్: 9110540243, 7331109838.

సం/- కమిషనర్ కల్వకుర్తి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7276-PP/CL/ADVT/1/2025-26, Date: 29-08-2025

## కుటుంబ ప్రయోజన పథకం గడువు పెంచాలి

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: జాతీయ కుటుంబ ప్రయోజన పథకం యొక్క ప్రయోజనాలపై ప్రజలలో అవగాహన లేకపోవడం వల్ల అర్హులైన కుటుంబ సభ్యులు ఇచ్చిన గడువులలో దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ప్రభుత్వం విధించిన గడువును పెంచాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కన్వీనర్ గిరి రమ కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం యొక్క ప్రయోజనాలపై ప్రజలలో అవగాహన లేకపోవడం వల్ల అర్హులైన కుటుంబ సభ్యులు ఇచ్చిన గడువులలో దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ప్రభుత్వం విధించిన గడువును పెంచాలని కోరారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన ప్రజలలో అవగాహన విస్తృతమైన ప్రచారం చేపట్టవలసి ఉండగా ఈ పథకంపై ఎలాంటి ప్రచారం చేయకపోవడంతో ప్రజలు ఈ పథకానికి దూరం అవుతున్నారని తెలిపారు .ఈ పథకం కింద నల్లగొండ జిల్లాలో 3500 మందికి లబ్ధి చేకూర్చవచ్చని ప్రభుత్వం వద్ద లెక్కలు ఉన్నప్పటికీ చనిపోయిన కుటుంబ పె ద్ద యొక్క డెత్ సర్టిఫికెట్ తీసుకోవడంలో కుటుంబ సభ్యులు పరిస్థితుల ప్రభావం వల చొరవ చూపు లేకపోయారని అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజాపక్షం/డిండి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రజా పాలన సాగుతుందని, అభివృద్ధి, సంక్షేమం దిశగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలో జనహిత ఎంఎల్ఏ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా వివిధ కాలనీలలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించి, గ్రామప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని అక్కడికక్కడే సంబందిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించారు. డిండి మండల కేంద్రంలోని దర్గా వీధిలో నూతనంగా 13లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల పనులకు శంకుస్థాపన చేశారు. మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, మండల సహాయ కార్యదర్శులు శైలేష్ పాల్గొన్నారు.



## యూరియా అందించే బాధ్యత కేంద్రానిదే

### సిపిఐ ఆధ్వర్యంలో పలుచోట్ల తహసీల్దార్‌కు వినతులు

ప్రజాపక్షం/మునుగోడు: రైతులకు యూరియా అందించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని సిపిఐ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజా రామచంద్రం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీరుపారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లో సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిపై అంబేద్కర్ చౌరస్తాలో భారీ ఎత్తున ధర్నా చేపట్టి కేంద్ర ప్రభుత్వం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లూరి నరసింహ, మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.లాలు, సురిగి చల పతి,రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బండమీది యాదయ్య, మందుల పాండు పాల్గొన్నారు.



### రైతులకు యూరియా సరఫరా చేయాలని ధర్నా

ప్రజాపక్షం/నార్కట్ పల్లి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందు చూపు లేకుండా యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగా యూరియా కొరత తీవ్రంగా నెలకొందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్, అగ్రికల్చర్ కార్యాలయల ముందు సిపిఐ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, వంగాల నాగయ్య, దశరథ,ఆలకుంట నరసింహ శ్రీపతి స్వామి,జిల్లా సత్యం,వెంకటాచారి ఎనుగుల యోగేంద్ర రెడ్డి బోడ మల్లేష్, దుబ్బ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి



ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచి సరైన సమయానికి యూరియా సరఫరా చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సూదన బోయిన రమేష్, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నేతల రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మండల కార్యదర్శి నేరెళ్ల సైదయ్య, కానుగుల మహేష్, కోరె సత్తయ్య, కోరే అంజయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా



ప్రజాపక్షం/మర్రిగూడ: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆదేశాలతో తహసిల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు.జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బుర్ర శేఖర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంజయ్య, జిట్టా బాలకృష్ణ,కృష్ణయ్య, అంజయ్య, యాదయ్య,నరసింహ,నజీర్‌లు పాల్గొన్నారు.

## రెండోసారి నేరం చేస్తే పిడియాక్ట్



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న రౌడి షీటర్లు, గంజాయి సేవించేవారు అమ్మకరవాణదారులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ప్రతి ఒక్కరు తమ పాత అలవాట్లను మానుకొని సత్ప్రవర్తనతో ఆదర్శంగా జీవించాలని జిల్లా ఎస్పి కె.నర్సింహా హితవు పలికారు. శుక్రవారం కోదాడ పబ్లిక్ ఆడిటోరియంలో కోదాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లు మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువతకు నిర్వహించిన కౌన్సిలింగ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాత్కలికంగా సుఖం కోసం చెడు అలవాట్లకు లోనై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. తెలిసి తెలియక చేసిన తప్పులను సరిదిద్దేందుకు తామిచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండోసారి నేరం చేస్తే అనివార్యంగా పిడియాక్టివ్ కేసును బనాయించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిఎస్పి శ్రీధర్‌రెడ్డి వారితో ఏలాంటి నేరాలు చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పి శ్రీధర్‌రెడ్డి, సిఐలు చరమందరాజు, ప్రతాపలింగం, శివశంకర్‌నాయక్, రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అర్హతలు లేకున్నా వైద్యం చేస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/కోదాడ : అర్హత లేకుండా నకిలీ వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ హెచ్చరించారు. గతంలో వైద్యాధికారులు చేసిన తనిఖీలలో భాగంగా అర్హత లేకుండా కోదాడ పట్టణంలో లక్ష్మి నవీన్ హాస్పటల్‌లో ఎండి పిజిషియన్ పి నవీన్ కుమార్ నకిలీ వైద్యం చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇట్టి విషయమై పలుమార్లు నోటీసు అందజేసిన ఎలాంటి స్పందన లేకపోవడంతో పాటు నేటికి అలాగే నకిలీ వైద్యం చేస్తున్నట్లు గుర్తించి శుక్రవారం అట్టి హాస్పటల్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా హాస్పటల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## భవన నిర్మాణ పనుల నాణ్యతపై దృష్టి

### జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణ పనులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ



ప్రజాపక్షం/నల్లగొండ : కొత్త జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌ను డిసెంబర్ లోగా,మొత్తం భవనాన్ని వచ్చే సంవత్సరం జూన్ 2 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం అయన పాత కలెక్టర్ కార్యాలయం వెనకవైపు నిర్మిస్తున్న నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనంలో పూర్తిగా రెవెన్యూ విభాగం, జిల్లా కలెక్టర్ ,అదనపు కలెక్టర్ల ఛాంబర్లు, మంత్రి ఛాంబర్, ఉండేలా ఏర్పాటు చేయాలని, పాత కలెక్టర్ కార్యాలయంలో పూర్తిగా జిల్లాలోని అన్ని శాఖల అధిపతుల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను పాత కలెక్టర్ కార్యాలయాన్ని పూర్తిగా ఆధునీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. కొత్త కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ హాల్ ను ఫాల్ సీలింగ్,ఎల్ఈడి స్క్రీన్లు, అన్ని సౌకర్యాలతో తో నిర్మించాలని చెప్పారు. కొత్త కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ అంచనాలను ఎట్టి పరిస్థితులలో మార్చకూడదని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ఇవ్వాలని, కార్యాలయ భవనం మొత్తాన్ని జూన్ 2 నాటికి పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. భవన నిర్మాణ పనులు, నాణ్యత పై ప్రత్యేక దృష్టి నిలపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కోరారు. ఈ కార్యాలయం మొత్తం పూర్తి అయితే బయట ఉన్న డిఈఓ ,డిఎంహెచ్ఓ కార్యాలయాలను ఇక్కడికి తీసుకురావడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ దర్గా గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్ల నిర్మాణ పనులపై ఆర్ అండ్ బి అధికారులతో సమీక్షించారు. రెండు గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు 5 కిలోమీటర్ల రోడ్డు పూర్తయిందని ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఘాట్ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్ అండ్ బి సూపరింటిండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,ఆర్ఓ వై.అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతి లాల్, కాంట్రాక్టర్ రామ్ ప్రసాద్ ఉన్నారు.



## ఎస్‌సి బాలికల వసతిగృహంలో ఎసిబి అధికారుల సోదాలు

ప్రజాపక్షం/ రామన్నపేట: స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహాల్లో నల్లగొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సోదా నిర్వహించారు. వసతిగృహంలో అవినీతి జరుగుతుందని సమాచారం మేరకు సోదాలు చేసినట్లు తెలిపారు. వసతిగృహంలో రికార్డుల ప్రకారం 40 మంది విద్యార్థినిలు ఉండగా 20 మంది మాత్రమే విద్యార్థులు ఉంటున్నారని తనిఖీలో తేలిందని తెలిపారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు భోజనశాలలోని వంట సామాగ్రి, నూనె, పప్పు తదితర వస్తువులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క రికార్డు సరిగా లేవని, వార్డెన్ రాజోల్‌భాయ్‌ను అడిగినా ఎలాంటి సమాధానం చెప్పడం లేదన్నారు. వసతిగృహంలో ఇంత అవినీతి జరుగుతున్నా ఏ నెలా ఆ నెలా ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదని అధికారి ఇన్‌చార్జి ఏఎస్‌డబ్లుఓ ఆర్.భిక్షంను ప్రశ్నించగా ఎలాంటి సమాధానం చెప్పలేదని ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి చేస్తున్నట్లు తెలిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందిస్తే వారి పేరు గోప్యంగా ఉంచుతామని, అంతేకాకుండా ఏసీబీ తెలంగాణ ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా తెలపాలని అన్నారు. ఆయన వెంట ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నిమ్మల శివశంకర్‌రెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజి అధికారి వల్లపు శ్రీనివాసులు, జూనియర్ ఆడిటర్ పెరిక ప్రసన్నకుమార్, శానిటరి ఇన్‌స్పెక్టర్ నంద్యాల ప్రదీప్‌రెడ్డిలు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలపై అవగాహన

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వైద్య సిబ్బందికి ఆదేశం



ప్రజాపక్షం/సూర్యాపేట : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేటలోని గిరినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓపి సేవలు ఎన్ని, మలేరియా, డెంగ్యూ ర్యాపిడె టెస్ట్ కిట్‌లు ఎన్ని ఉన్నాయి, సీజనల్ వ్యాధులకు సంబంధించి డెంగ్యూ, మలేరియా కేసులు ఏమైనా నమోదు అయినాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌సి రిజిష్టర్, ఫార్మసి స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. అక్కడే ఉన్న ఆశా వర్కర్లని జ్వరం సర్వే చేస్తున్నారా, డెలవరీలు చేసేటప్పుడు జిజిహెచ్ నందు ఏమైనా సమస్యలు ఏర్పడుతున్నాయా, ప్రభుత్వ హాస్పటల్‌లో ఎన్ని సాధారణ డెలవరీలు అయినాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా 7వ తరగతిని సందర్శించి వారి మ్యాథ్స్ నోట్ బుక్‌ను పరిశీలించారు. ఏ సబ్జెక్ట్ అయినా అర్థం కాకపోతే టీచర్లను అడగాలని అదేవిధంగా ఒకటికి పది సార్లు ప్రాక్టీస్ చేస్తే ఎక్కువ రోజులు గుర్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా, టీచర్లు మంచిగా అర్థం అయ్యేలా చెప్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం ఎక్కువ నమోదయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని హెడ్‌మాస్టర్‌ని ఆదేశించారు. తహశీల్దార్ కృష్ణయ్య, మెడికల్ అధికారి శ్యామ్, ప్రధాన ఉపాధ్యాయులు యతిపతిరావు, ఉపాధ్యాయులు నరసింహారావు, స్టాఫ్‌నర్సు నాగమణి, ల్యాబ్ టెక్నిషియన్ సుష్మ, ఏఎన్ఎం అరుణ, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో కర్ణాటక మంత్రి



ప్రజాపక్షం/ఉండవెల్లి: దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రివర్యులు ఎన్ఎస్ బోసురాజు దంపతులు ఆలయాలను దర్శించుకున్నారు. దేవాలయము కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి కార్యనిర్వాహణాధికారి దీప్తి, మంత్రివర్యులకు మాజీ ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాలలోను అభిషేకాలు చేపట్టి పూజా కార్యక్రమాలు ఘనగా నిర్వహించారు. కర్ణాటక మంత్రివర్యులు ఎన్ ఎస్‌బోసురాజు దంపతులను మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దంపతులను మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డి స్వామి, వైస్ చైర్మన్ కుమార్ కార్యకర్తలు పూల మాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయాల విశిష్టత ప్రత్యేక శిల్పాలను గూర్చి అర్చకులు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

### 25తులాల బంగారు ఆభరణాలు.. రూ.4,84,500 నగదు స్వాధీనం.. పశ్చిమబెంగాల్‌లో నిందితుడిని అరెస్టు జిల్లా ఎస్‌పి నరసింహ వెల్లడి



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని సాయి సంతోషి జ్యూలరీ షాపులో జరిగిన దొంగతనం కేసులో మరో నింధితుడిని పశ్చిమ బెంగాల్‌లో పోలీసులు అరెస్టు చేసి అతని నుండి 25తులాల బంగారు ఆభరణాలు, రూ.4,84,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె నరసింహ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జూలై 21వ తేదీన సాయి సంతోషి జ్యూలరీ షాపులో బంగారం దొంగతనం జరగగా 2.5 కేజీల బంగారం, కొంత నగదు దొంగతనానికి గురైనట్లు షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనంలో ఏడుగురు నింధితులు ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు నలుగురు నింధితులను అరెస్టు చేశారు. పట్టుబడ్డ వారి నుండి బంగారం, డబ్బులను రికవరీ చేస్తూ వస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఖమ్మంకు చెందిన యశోద నుండి 14 తులాల బంగారం, పశ్చిమ బెంగాల్‌లో మాలిక్ మొల్ల నుండి సుమారు రూ.55లక్షల విలువైన 554 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.87 వేల నగదు, ఖమ్మంలో అమర్‌బట్ నుండి రూ.5వేల నగదుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో జషీముద్దీన్ నుండి రూ.25లక్షల విలువైన 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.4,85,500 నగదును ఇప్పటి వరకు రికవరీ చేసినట్లు వివరించారు. మిగతా నింధితులను త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య, సిసిఎస్ సిఐ శివకుమార్, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, సిసిఎస్ ఎస్‌ఐ హరికృష్ణ, సూర్యాపేట పట్టణ, పెన్‌పహాడ్ ఎస్‌ఐలు శివతేజ, గోపికృష్ణ, మిగిలిన సిబ్బందిని అభినందించి రివార్డులను అందజేశారు.

## అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్: అసెంబ్లీ సమావేశంలో ఉద్యోగుల భృతి కోసం, నిరుద్యోగుల జాబ్ క్యాలండర్ కోసం, విద్యార్థినుల స్కూటీల కోసం, రైతుల రుణమాఫీ, రైతు భరోసా, యూరియా, కరెంటు కోతలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నల్లగొండలోని కంచర్ల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ వరదలపై ప్రభుత్వానికి సోయి లేదని సియం పాత పద్ధతుల్లోనే రోత మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. మంత్రులకు రివ్యూ చేయాలనే సోయి లేదని గోదావరి, కృష్ణాలో వందల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందని జిల్లా కేంద్రంలోని ఉదయసముద్రం రి జర్వాయర్లలో లో నీరు లేదని జిల్లా మంత్రికి ఏమాత్రం సోయలేదు అన్నారు.ఓ వైపు భారీ వర్షాలు మరోవైపు యూరియా కోసం రైతుల పడిగాపులు కాస్తున్నారనిఅసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం అన్నారు.కాళేశ్వరం నివేదిక అసెంబ్లీలో పెడితే మాకేం ఇబ్బంది లేదని ఒరిజినల్ నివేదికను బహిరంగ పర్చాలని డిమాండ్ చేస్తున్నామని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మోసం బైట పడటంతో మరో డ్రామాకు తెర తీస్తుందన్నారు. ఓ వైపు వర్షాలు, వరదలు వస్తుంటే సమగ్రంగా లేని ఓటర్ లిస్ట్ లను పెట్టి గందరగోళం చేస్తున్నారని అన్ని ఓటర్ లిస్టును గ్రామాల్లో బహిరంగ పరిచి అన్ని అభ్యతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నలబోతు భాస్కరరావు, మాజీ కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్ రెడ్డి, మారగోని గణేష్, పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వీడిన రమేష్ హత్య కేసు... తన స్థలంలో పడుకున్నందుకే హత్య!

### కర్ణాటక రాష్ట్రానికి చెందిన షేక్ సిరాజ్ హంతకుడు 24 గంటలు గడవక ముందే హత్య కేసును ఛేదించిన వన్ టౌన్ పోలీస్ బృందం : నల్లగొండ డిఎస్‌పి



ప్రజాపక్షం/ నల్లగొండ: నల్లగొండ పట్టణంలో సంచలనం సృష్టించిన హత్య కేసును 24 గంటలు గడవకముందే వన్ టౌన్ పోలీసులు కేసును సేదించి నిందితుని అరెస్టు చేశారని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాంరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు . శుక్రవారం నల్లగొండ పట్టణంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ ఈనెల 27న నల్లగొండ పట్టణంలో అర్థరాత్రి జరిగిన హత్య సంచలనము అయిన కేసులో వన్ టౌన్ పోలీసులు 24 గంటల్లోపే నిందితుడుని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 28న ఉదయం 6 గంటల సమయంలో స్థానికుల సమాచారం మేరకు, ప్రతిక్ రెడ్డి జూనియర్ కాలేజ్ పక్కన ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింత కింది రమేష్ నిద్రిస్తున్న సమయంలో బండరాయితో తల పై మోది చంపిన విషయంలో రమేష్ బావ భూష్పాక వెంకటయ్య పిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం మూడు బృందాలుగా ఏర్పడి మర్డర్ కేసును సేదించే క్రమంలో క్లూటీమ్స్ సిబ్బంది సాయంతో నేర స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ లభించిన సమాచారం ఆధారాలతో చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లతో నేరస్తుడిని గుర్తించడం జరిగిందని తెలిపారు.నిందితుడు కర్ణాటక రాష్ట్రానికి చెందిన షేక్ సిరాజ్ (55) నెల రోజుల క్రితం ఇతనికి తెలిసిన హుస్సేన్ అనే వ్యక్తి దగ్గర లారీ క్లీనర్ గా పని చేస్తూన్నాడని ఒక రోజు లోడ్ తీసుకొని నల్లగొండ నుండి పోతున్న సమయంలో డ్రైవర్ తో గొడవపడగా, డ్రైవర్ లారీ నుండి దింపేసి వెళ్ళిపోయాడని తెలిపారు. అప్పటి నుండి నల్లగొండ పట్టణంలో ఉంటూ, అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద ఐదు రూపాయల భోజనం చేస్తూ చుట్టుపక్కల అడుక్కుంటూ క్యాంటీన్ వద్దే పడుకున్నాడు. ఈనెల 27న రాత్రి 10 గంటల సమయంలో సిరాజ్ పడుకునేటటువంటి స్థలంలో చింతకింది రమేష్ నిద్రిస్తున్నడంతో తను రోజు నిద్రించే ప్లేస్ విషయంలో గొడవకు దిగి నిద్రిస్తున్న రమేష్‌ని గమనించి పక్కనే ఉన్న మొలదేలిన ఒక గ్రానైట్ రాయిని తీసుకోని రెండు చేతులతో మృతుడి తలపై బలంగా కొట్టి చంపి రాయిని దొరకకుండా కాలేజీ గోడ వెనక విసిరేసి అక్కడ నుండి పారిపోయినట్లు నిందితుడు సిరాజ్ విచారణలో నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. అతడు నేరానికి ఉపయోగించిన బండ రాయిని చూపించగా అట్టి రాయి స్వాధీనం చేసుకొని అతడిని కోర్టు ముందు హాజరపరచడం జరిగిందని తెలిపారు.ఈ కేసును వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో 24 గంటల్లో సేదించినందుకు ఎస్ఐ వెంకట్ నారాయణ, ఏఎస్ఐ వెంకట్ యాదవ్,సిబ్బంది రబ్బాని, షకీల్, శ్రీకాంత్, శంకర్, జానకి రాములు, సైదులు ని అభినందించారు.

## అభ్యంతరాలు తెలపాలి : కలెక్టర్



ప్రజాపక్షం/నల్లగొండ: గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా రూపొందించి ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా, ముసాయిదా పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30 లోగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నీ రాజకీయ పక్షాల ప్రతినిధులతో కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో గ్రామపంచాయతీ వార్డుల వారీగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా తయారీ, ప్రచురణ, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ పై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 28 న సంబంధిత ఎంపీడీవోల ద్వారా మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని, ఈ ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాలపై రాజకీయ పార్టీలు అభ్యంతరాలను ఈ నెల 28 నుండి 30 వరకు సమర్పించవచ్చని, వచ్చిన అభ్యంతరాలను ఈనెల 31న పరిశీలించి, పరిష్కరించడం జరుగుతుందని, తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 2న ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 869 గ్రామ పంచాయతీలు ఉండగా, 7494 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 10 లక్షల 73,506 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో 600 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైతే ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అధికారం ఉంటుందని వివరించారు.ఈ సమావేశానికి బిఆర్ఎస్ నుండి కంచర్ల భూపాల్ రెడ్డి ,మల్లికార్జున్, పంకజ్ యాదవ్, పిచ్చయ్య, బిజెపి నుండి లింగస్వామి, బిఎస్‌పి నుండి యాదగిరి, టిడిపి తరపున రఫీక్, సిపిఐఎం తరపున హాజరైన నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి సైదిరెడ్డి ,ఆమ్ ఆద్మీ పార్టీ నుండి ఎస్‌కె అన్సారి పాల్గొన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉర్జిత్ పటేల్ నియామకం

**న్యూఢిల్లీ :** ఆర్‌బిఐ మాజీ గవర్నర్, ఆర్థికవేత్త ఉర్జిత్ పటేల్‌ను అంతర్జాతీయ ద్రవ్య నిధికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. కేంద్ర క్యాబినెట్‌కు చెందిన అపాయింట్స్ కమిటీ దీనికి అనుమతి ఇచ్చింది. మూడేళ్ల పాటు ఆయన ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చేయనున్నారు. 2016 నుంచి 2018 వరకు ఆర్‌బిఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ బాధ్యతలు నిర్వర్తించారు. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో ఆయన భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. అయితే ఆర్‌బిఐ గవర్నర్‌గా తన పదవీకాలం ముగియక ముందే ఉర్జిత్ పటేల్ రిజైన చేశారు. 2016, సెప్టెంబర్ 4వ తేదీన ఆయన ఆర్‌బిఐ 24వ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఐఎంఎఫ్‌కు సేవలు అందించడం ఉర్జిత్ పటేల్‌కు ఇది రెండోసారి. 1996–1997 మధ్య ఆయన ఐఎంఎఫ్ తరపున ఆర్‌బిఐకి పనిచేశారు. రుణాలు, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు, పెన్షన్ నిధుల అప్‌డేట్, విదేశీ మార్కెట్ గురించి ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. 1998 నుంచి 2001 వరకు ఆర్థికశాఖలోని ఆర్థిక వ్యవహాల శాఖకు కన్సల్టెంట్‌గా చేశారు.

‘ఒక నెల, ఒక వ్యక్తి’

## రెండు విరుద్ధమైన ప్రకటనలు

మోహన్ భగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ :** పదవీ విరమణపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన భాగవత్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. తాను పదవీ విరమణ చేస్తానని లేదా మరొకరు 75ఏళ్ల వయసులో పదవీ విరమణ చేయాలని ఎప్పుడూ చెప్పలేదని మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. నెల తిరగక ముందే ఆయన విరుద్ధమైన ప్రకటనలు చేశారని ధ్వజమెత్తింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రస్తావిస్తూ నాయకుల పదవీ విరమణపై భాగవత్ చేసిన వ్యాఖ్యలు పలు ఊహాగానాలకు తెరదించాయి. మోదీ, భాగవత్ ఇద్దరూ వచ్చే నెలలో 75ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. అయితే గురువారం నాటి, జులైలో భగవత్ ప్రకటనపై మీడియా నివేదికలను ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్పందిస్తూ ‘ఒక నెల, ఒక వ్యక్తి, రెండు విరుద్ధమైన ప్రకటనలు’ అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం పలు ప్రశ్నలకు భాగవత్ సమాధానమిస్తూ ‘జీవితంలో ఎప్పుడైనా పదవీ విరమణ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. సంఘ్ తమను పని చేయాలని కోరుకునేంత కాలం పని చేయడానికి సిద్ధంగా ఉన్నాము’ అని అన్నారు. 75 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసే అంశంపై భాగవత్ ఇటీవల నాగ్‌పూర్‌లో దివంగత ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు మోరోపంత్ పింగళేను ఉటంకిస్తూ ఆయన చమత్కారాన్ని హైలైట్ చేశానని చెప్పారు.‘అతను చాలా చమత్కారంగా ఉన్నాడు, అతని చమత్కారం మిమ్మల్ని మీ కుర్చీలో కూర్చోబెట్టింది... ఒకసారి మా కార్యక్రమంలో, మేమందరం అక్కడ అఖిల భారత కార్యకర్తలం ఉన్నప్పుడు అతను (పింగల్) తన 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాడు. కాబట్టి అతనికి ఒక శాలువా ఇచ్చి ఏదో చెప్పమని అడిగారు... అతను లేచి నిలబడి ‘మీరు నన్ను సత్కరించారని మీరు అనుకుంటున్నారా కానీ ఈ శాలువా ఇచ్చినప్పుడు మీరు ప్రశాంతంగా కుర్చీలో కూర్చుని ఏమి జరుగుతుందో చూడండి’ అని అన్నాడు’ అని భగవత్ అన్నారు. 75 సంవత్సరాల వయస్సు వచ్చినందుకు పింగల్‌కు శాలువాతో సత్కరించారు.75 సంవత్సరాల గురించి తన ప్రస్తావన ఏ నాయకుడి పదవీ విరమణను ఉద్దేశించి కాదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ స్పష్టం చేశారు.75 సంవత్సరాల పదవీ విరమణ చేస్తానని లేదా మరొకరు 75 సంవత్సరాల వయసులో పదవీ విరమణ చేయాలని తాను ఎప్పుడూ చెప్పలేదని భగవత్ గురువారం నొక్కి చెప్పారు. ఇది ఎవరి పదవీ విరమణ కోసం లేదా తమ కోసం కాదను, తాము జీవితంలో ఎప్పుడైనా పదవీ విరమణ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.


‘రామసేతు’పై

## మీ స్పందన ఏంటీ?

సుబ్రమణ్యస్వామి పిటిషన్‌పై కేంద్రాన్ని కోరిన ‘సుప్రీం’

నోటీసు జారీచేసిన ‘అపెక్స్’ కోర్టు

4 వారాల తర్వాతకు పిటిషన్ విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :** ‘రామసేతు’ను జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించడానికి తన ప్రాతినిధ్యాన్ని త్వరగా నిర్ణయించాలని, ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ రాజ్యసభ ఎంపి సుబ్రమణ్యన్ స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు కేంద్రం నుంచి స్పందన కోరింది. రామ్‌సేతును ‘ఆడమ్ వంతెన’ అని కూడా పిలుస్తారు. ఇది తమిళనాడులోని ఆగ్నేయతీరంలో ఉన్న పంబన్ ద్వీపానికి, శ్రీలంక వాయవ్య తీరంలో ఉన్న మన్నార్ ద్వీపానికి మధ్య ఉన్న ఒక సున్నపురాయి గొలుసు ఒడ్డున ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మోహ్‌తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సుబ్రమణ్యస్వామి పిటిషన్ విచారణకు అంగీకరించి, కేంద్రానికి నోటీస్ జారీ చేసింది. ఈ అంశంపై విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. సుబ్రమణ్య స్వామి తన పిటిషన్‌లో 2023 జనవరి 19న ఈ విషయంలో సుప్రీం కోర్టు జారీచేసిన ఆదేశాలను ప్రస్తావించారు. 2023 జనవరి 19న రామసేతును జాతీయ వారసత్వ స్మారకచిహ్నంగా ప్రకటించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్రం అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. అప్పుడు సుప్రీంకోర్టు ఈ విషయమై సుబ్రమణ్యస్వామి పిటీషన్‌ను విచారణకు స్వీకరించింది. ‘సాంస్కృతిక మంత్రిత్వ శాఖలో ఈ ప్రక్రియ జరుగుతోందని సొలిసిటర్ జనరల్ చెప్పారు. అయితే పిటిషనర్ కోరిన పక్షంలో రెండు వారాల వ్యవధిలోపు ఏదైనా అదపపు మెటీరియల్ లేదా కమ్యునికేషన్‌ను కూడా సమర్పించవచ్చు’ అని అత్యున్నత న్యాయస్థానం తన 2023 జనవరిలో ఉత్తర్వులు జారీచేసిందని గుర్తించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరిన కోర్టు అసంతృప్తి చెందినట్లయితే సుబ్రమణ్యస్వామికి తాను ముందుకు వెళ్లే స్వేచ్ఛను మంజూరుచేసి, ఈ అంశంపై ఆయన దాఖలుచేసిన మధ్యంతర దరఖాస్తును కొట్టివేసింది. స్వామి దాఖలు చేసిన తాజా పిటిషన్‌లో ఈనాటి వరకూ తనకు లేదా సుప్రీంకోర్టుకు ఎలాంటి స్పందన తెలియజేయలేదని పేర్కొన్నారు. రామసేతును ఏరూపంలోనైనా దుర్వినియోగం, కాలుష్యం, అపవిత్రం నుండి రక్షించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని పిటిషన్ పేర్కొంది. 2023 జనవరి 19 ఉత్తర్వు తర్వాత సుబ్రమణ్యస్వామి జనవరి 27న ప్రభుత్వానికి అన్ని పత్రాలతో ప్రాతినిధ్యం చేశారని పిటిషన్ తెలిపింది. అంతేకాకుండా 2025 మే 13న పిటిషనర్ ప్రభుత్వానికి మళ్ళీ లిఖితపూర్వక తాజా వినతిపత్రాన్ని అందజేసినట్లు పిటిషన్ వెల్లడించింది. 2023 జనవరి 19నాటి సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా త్వరితగతిన, సమయానుకూల పద్ధతిలో నిర్ణయించేలా సాంస్కృతిక శాఖను దిశానిర్దేశం చేయాలని పిటిషన్ కోరింది.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మానవాళి పోరాటంలో...

## ఆపరేషన్ సిందూర్ ఒక ‘సువర్ణ అధ్యాయం’


రాష్ట్రపతి ముర్ము కితాబు



**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మానవాళి పోరాటంలో ఆపరేషన్ సిందూర్ ఒక ‘సువర్ణ అధ్యాయం’ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు. భారతదేశంపాకిస్థాన్ మధ్య సైనిక వివాదంలో కీలకపాత్ర పోషించిన అకాష్టీర్ వైమానిక రక్షణ నియంత్రణ, రిపోర్టింగ్ వ్యవస్థను నిర్మించడంలో పిఎస్‌యు(ప్రభుత్వరంగ సంస్థ)ల సహకారాన్ని ఆమె విపులీకరించారు. శుక్రవారం నాడు ఇక్కడ జరిగిన ఎస్‌సిఓపిఇ (స్కోప్) ఎమినెన్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రసంగిస్తూ 2047నాటికి వికసిత్ భారత్ లేదా అభివృద్ధిచెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వరంగ సంస్థల కీలకపాత్రను ఆమె నొక్కిచెప్పారు. ప్రభుత్వ రంగసంస్థలు ఆదాయం, లాభం వంటి కీలకమైన ఆర్థిక పారామీటర్లలో బాగానే ఉన్నాయని ముర్ము సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వరంగ సంస్థలలో మూడింట ఒకవంతు అభివృద్ధి చెందలేదన్నారు. గత దశాబ్దంలో ప్రభుత్వరంగ సంస్థల నికరలాభం గణనీయంగా పెరిగిందని రాష్ట్రపతి వెల్లడించారు. ప్రభుత్వరంగ సంస్థలు శ్రేయస్సుకు ఉత్ప్రేరకాలు అని ఆమె అభివర్ణించారు. సుపరిపాలన, పారదర్శకతను ప్రభుత్వరంగ సంస్థలు నిర్దేశించుకున్నాయన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ నిర్మాణం(స్వావలంభన భారతదేశం)లో ప్రభుత్వరంగ సంస్థలు అద్భుతమైన పాత్రను పోషిస్తున్నాయని, మేక్ ఇన్ ఇండియా ప్రచారంలో వారి సహకారాన్ని రాష్ట్రపతి ఎత్తిచూపారు. దేశానికి సంబంధించిన రక్షణ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మానవ విజయంలో ఆపరేషన్ సిందూర్ ఒక సువర్ణ అధ్యాయం అని ఆమె చెప్పారు. జాతీయ భద్రతపై స్వావలంభన సాధించడంలో ప్రభుత్వరంగ సంస్థల సహకారం ఆవిష్కరణల ద్వారా జరుగుతున్నదని రాష్ట్రపతి తెలిపారు. పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం, వ్యవసాయం, మైనింగ్,అన్వేషణ, తయారీ, ప్రాసెసింగ్, సేవలు వంటి రంగాలలో ప్రభుత్వరంగ సంస్థలు కీలకపాత్రను పోషిస్తున్నాయని వివరించారు. మహిళా నాయకులు బహుళ సవాళ్లను అధిగమిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు.

## ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్







### మరో 11 మంది గల్లంతు

**డెహ్రాడూన్ :** దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి.ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షం పలు గ్రామాలను ముంచెత్తుతోంది. తాజాగా ఉత్తరాఖండ్‌లో మరోసారి మేఘ విస్ఫోటం సంభవించింది. ఈఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 11మంది గల్లంతయ్యారు. అనేక మంది శిథిలాల కిందే చిక్కుకున్నట్లు తెలుస్తోంది. చమోలీ జిల్లాలోని మోపాటా ప్రాంతంలో భారీ వరదల్లో ఇద్దరు కొట్టుకుపోయారు. అలాగే పశువుల కొట్టం కూలడం వల్ల దాదాపు 20 పశువులు జలసమాధి అయ్యాయి. ఓ జంట శిథిలాల కిందే చిక్కుకుపోయారని జిల్లా కలెక్టర్ సందీప్ తివారీ తెలిపారు. మరో జంటను శిథిలా నుంచి సురక్షితంగా కాపాడమని, కానీ వారికి తీవ్రంగా గాయలయ్యాయని చెప్పారు. మరోవైపు మేఘ విస్ఫోటం కారణంగా రుద్రప్రయాగ్‌లోని అలకనంద, మందాకిని నదుల నీటి మట్టాలు భారీగా పెరుగుతున్నాయి. రుద్రప్రయాగ్‌లోని హనుమాన్ ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం వల్ల 180కి పైగా రోడ్లు మూసుకుపోయాయి. జౌలాభదేత్ గ్రామంలో కూడా ఇలాంటి పరిస్థితి నెలకొంది. వరదల్లో అనేకమంది గల్లంతైనట్లు సమాచారం. అదే ప్రాంతంలోని స్యూర్ గ్రామంలో ఒక ఇల్లు దెబ్బతింది. రోడ్డుపై పార్క్ చేసిన కారు శిథిలాల్లో కొట్టుకుపోయింది. భదేత్, బగద్ధార్, తలాజ్‌మణి గ్రామాల రెండు వైపులా వాగులు ఉప్పొంగి వరద ముప్పు మరింత పెరిగింది. కేదార్‌నాథ్ లోయలోని లారా గ్రామాన్ని పట్టణంతో కలిపే వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల దృష్ట్యా రుద్రప్రయాగ్, బాగేశ్వర్, చమోలి, హరిద్వార్ జిల్లాల్లోని పాఠశాలలను మూసివేశారు. ప్రస్తుతం పరిస్థితులపై ఉత్తరాఖండ సిఎం పుష్కర్ సింగ్ ధామి తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు. రుద్రప్రయాగ్‌లోని బాసుకేదర్ తహసీల్, చమోలి జిల్లాలోని దేవల్ ప్రాంతంలో మేఘ విస్ఫోటం కారణంగా అనేక కుటుంబాలు వరదల్లో చిక్కుకున్నాయని తెలిపారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటం వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని చెప్పారు. ’స్థానిక పరిపాలన యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలును కొనసాగిస్తోంది. ఈ విషయంలో నేను ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాను. విపత్తు నిర్వహణ కార్యదర్శి, జిల్లాకలెక్టర్లతో మాట్లాడి సహాయక చర్యలు సమర్థవంతంగా సాగేందుకు సూచనలు ఇచ్చా ప్రతి ఒక్కరి సురక్షిత కోసం బాబా కేదార్‌ను ప్రార్థిస్తున్నాను’ అని సిఎం ధామి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, వరద ప్రవాహ ధాటికి ప్రజలు, అడవుల్లోని మూగజీవాలు సైతం భారీస్థాయిలో మృతిచెందుతున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. వరదల్లో గల్లంతైన వారి గురించి కచ్చితమైన సమాచారం లేకపోయినా చాలామంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు పేర్కొన్నారు. ఆకస్మిక వరదలతో తప్పించుకొనే మార్గం లేకపోయిందని చెప్పారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రాంనగర్ పెద్ద కాలువలో వరద నీటి ధాటికి చిరుత పులి కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గ్రామాలలోని జంతువులు, పశువులు సైతం భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నాయి.

మరాఠా కోటా ఉద్యమ నాయకుడు

## జరంగే నిరాహారదీక్ష



**ముంబయి :** మరాఠా కోటాపై మహారాష్ట్రలో ఉద్యమం ఊపందుకుంది. శుక్రవారం దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మరాఠా కోటా ఉద్యమ నాయకుడు మనోజ్ జరంగే నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఇక్కడి నుంచి కదిలేదని లేదని ప్రతిజ్ఞ చేశారు. 43 ఏళ్ల కార్యకర్త ఉదయం 9.45 గంటల ప్రాంతంలో నిరసన వేదిక వద్దకు చేరుకున్న తర్వాత, కాషాయ టోపీలు, కండువాలు, జెండాలు ధరించి వేలాది మంది మద్దతుదారుల నుండి ఘన స్వాగతం లభించింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి వెళ్ళనని, తనను కాల్చి చంపినా వెనక్కి వెళ్ళను అని జరంగే తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం సహకారం లేకపోవడం వల్లే మరాఠా సమాజం ముంబయికి కవాతు చేయాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ప్రభుత్వం నిరసనకు అనుమతి ఇచ్చినందున పోలీసులతో సహకరించాలని, సమాజ ప్రతిష్టను దెబ్బతీసే ఏదీ చేయకుండా చూసుకోవాలి పిలుపునిచ్చారు. ముంబయి రోడ్లను దిగ్బంధించవద్దని మద్దతుదారులను కోరారు. అయితే పోలీసులు తనకు ఒక రోజు మాత్రమే అనుమతి ఇచ్చినందుకు జరంగే ఆవేదన వ్యక్తం చేశారు. తాము ముంబయికి రావాలని నిర్ణయించుకుని వచ్చామని చెప్పారు. ప్రభుత్వం, కోర్టు తమ నిరసనకు అనుమతిస్తాయని ఆశిస్తున్నామని, తాము మరొక దరఖాస్తును సమర్పిస్తామని చెప్పారు. నిరసన తెలిపేందుకు తనకు మరిన్ని రోజులు సమయం ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమకు రిజర్వేషన్లు మంజూరు చేయాలని, డిమాండ్లన్నింటినీ అంగీకరించాలని కోరుకుంటున్నామన్నారు. మరాఠాల ఆగ్రహానికి గురికాకుండా ముఖ్యమంత్రిని హెచ్చరించాలనుకుంటున్నామని, తను కాల్చవచ్చు లేదా జైలులో పెట్టవచ్చు, జైలులో కుళ్ళిపోతాను కానీ తమ డిమాండ్లు నెరవేరే వరకు కదలబోనన్నారు. జరంగే ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) వర్గం కింద మరాఠాలకు 10 శాతం కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరాఠాలందరినీ ఒబిసి వర్గంలో చేర్చబడిన వ్యవసాయ కులమైన కున్బీలుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఇది వారిని ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లకు అర్హులుగా చేస్తుంది. కాగా, బుధవారం జల్నా జిల్లాలోని తన గ్రామం అంతర్వాలి సారథి నుండి తన పాదయాత్రను ప్రారంభించిన జరంగేకు వందలాది వాహనాలతో శుక్రవారం ఉదయం ముంబయిలోకి ప్రవేశించగానే మద్దతుదారులు వాషి వద్ద స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన ఆజాద్ మైదాన్ కు వెళ్లారు. జరంగే ఆందోళనకు ముందు శాంతిభద్రతలను కాపాడటానికి ఆజాద్ మైదాన్ వద్ద 1,500 మందికి పైగా ముంబయి పోలీసు సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు.

గవర్నర్‌గా రాధాకృష్ణ హయాంలో

## రాజ్‌భవన్‌లోనే సిఎం అరెస్టు

### అలాంటి వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తెస్తారా?: పవార్



**ముంబయి :** ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌పై ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ తీవ్ర వ్యాఖ్య లు చేశారు. ఆయన జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో రాజ్‌భవన్ లోపలే ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయించారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి దేశంలోని రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎలాంటి వన్నె తెస్తారని ప్రశ్నించారు. తాను గవర్నర్ పీఠాన్ని గౌరవిస్తానని, కానీ రాధాకృష్ణన్ జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు గిరిజన సమాజానికి చెందిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తనను రాజ్ భవన్ లోపల అరెస్టు చేయవద్దని వేడుకున్నప్పటికీ అరెస్టు చేయించడాన్ని ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. ఈ చర్య వల్ల సంస్థలు, వాటి గౌరవాన్ని కాపాడుకోవడంపై ఆయన అభిప్రాయాలు ఏమిటో అవగతమవుతున్నాయన్నారు. ఇప్పుడు అలాంటి వ్యక్తిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్‌డిఎ ఎన్నుకున్నదని పవార్ శుక్రవారం తన ముంబయి నివాసంలో ప్రతిపక్షాల ఉపాధ్యక్షుడు బి సుదర్శన్ రెడ్డిని కలిసిన తర్వాత అన్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) నామినేట్ చేసిన రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఆయవత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉందని, ముఖ్యంగా మునుపటి ఉపరాష్ట్రపతి తన పదవీకాలం పూర్తి కావడానికి ముందే రాజీనామా చేసి, సమాధానం లేని ప్రశ్నలను లేవనెత్తారన్నారు. ఒక సీనియర్ పార్లమెంటేరియన్‌గా తనకు కూడా కారణాలు తెలియవని, ఆ పదవి స్థాయి, గౌరవాన్ని ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ కాపాడుకోవాలని సూచించారు. అందుకే ఈ ఎన్నిక చాలా కీలకం అవుతుందని స్పష్టం చేశారు. కాగా, ఇద్దరు అభ్యర్థులు దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారు కాబట్టి, పోటీ దక్షిణ వర్సెస్ దక్షిణ పోరాటం అనే అభిప్రాయాలను విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తిరస్కరించారు. అలా చిత్రీకరించడం తగదన్నారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ మాత్రమేని, ఒకే దేశం, ఒకే జాతి అని ఆయన పేర్కొన్నారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అయిన సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వడంలో ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా ఉన్నాయని పవార్ అన్నారు. న్యాయమూర్తిగా ఆయన పదవీకాలంలో తీసుకున్న నిర్ణయాలు సామాన్యుల హక్కుల రక్షణ కోసమేనని, అందువల్ల, అలాంటి వ్యక్తి ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకు రావడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. విజయం లేదా వైఫల్యం ముఖ్యం కాదని, కుర్చీ గౌరవాన్ని నిలబెట్టడమే ప్రధానమన్నారు. అయితే ఆధునిక మహారాష్ట్రను నిర్మించిన రాజనీతిజ్ఞుడి ఆశీర్వాదం కోసం తాను ఇక్కడికి వచ్చానని సుదర్శన్‌రెడ్డి విలేకరులతో అన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదని, అందులో చేరాలని కూడా అనుకోవడం లేదన్నారు. బహుశా దీని కారణంగానే, అన్ని ప్రతిపక్ష పార్టీలు తనను తమ అభ్యర్థిగా ఎంచుకుని ఉండవచ్చని చెప్పారు. ప్రతి పార్టీ, ప్రతి ఎంపి తన అభ్యర్థిత్వాన్ని యోగ్యత ఆధారంగా పరిశీలిస్తే కృతజ్ఞుడినన్నారు. పార్టీ అనుబంధంతో సంబంధం లేకుండా పార్లమెంటు సభ్యులందరికీ నే లేఖ రాస్తానని చెప్పారు. అయితే ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నుండి తనకు ఫోన్లు వచ్చాయని పవార్ చెప్పారు.

## కొట్టుకున్న కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు



**పాట్నా:** బిజెపి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. పార్టీ జెండాలతో బిహార్‌లోని పాట్నాలో ఒకర్ని ఒకరు కొట్టుకున్నారు. నిరసన ర్యాలీ భారీ విధ్వంసానికి దారి తీసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఓట్ అధికార్ యాత్ర నిర్వహించారు. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనికి నిరసనగా శుక్రవారం బిజెపి ర్యాలీ చేపట్టింది. అయితే ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కూడా ర్యాలీ నిర్వహించారు. ఆ రెండు పార్టీలకు చెందిన నేతలు ఎదురుపడిన సమయంలో.. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో కార్యకర్తలు పార్టీ జెండాలు ఉన్న కర్రలతో దాడి చేసుకున్నారు. ఓ దశలో కాంగ్రెస్ కార్యాలయం వద్ద కూడా దాడి జరిగింది. కాంగ్రెస్‌కు గట్టి బదులిస్తామని బిజెపి నేత నితిన్ నాబిన్ అన్నారు. తల్లిని దూషించిన కాంగ్రెస్ పార్టీకి బిహారీలు గుణపాఠం చెబుతారని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన అన్నారు. నితీశ్ కుమార్ పాలన సరిగా లేదని, ఇదంతా ప్రభుత్వ జోక్యంతోనే జరుగుతోందని కాంగ్రెస్ నేత డాక్టర్ ఆశుతోష్ ఆరోపించారు. దర్భంగా జిల్లాలో జరిగిన ర్యాలీలో రఫీక్ అలియాస్ రాజా అనే వ్యక్తి అకస్మాత్తుగా మైక్‌ను అందుకుని ప్రధాని మోదీతో పాటు ఆయన తల్లిపై దుర్భాషలాడాడు. రఫీక్ అలియాస్‌ను భోపురా గ్రామస్థుడిగా గుర్తించారు. సిమ్రి పోలీసు స్టేషన్‌లో అతనిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. బితౌలీ వద్ద ర్యాలీ జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. చాలా తీవ్రమైన పదజాలంతో మోదీ, ఆయన తల్లిని తిట్టాడు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అనుకూలంగా ఆ వ్యక్తి నినాదాలు చేశాడు. ప్రధాని మోదీపై దుర్భాషలాడిన వ్యక్తి రఫీక్ ను పోలీసులు అరెస్టు చేశారు.

బీజింగ్ నిబంధనల ప్రకారమే భారత్—చైనాతో సంబంధాలు

## సాధారణీకరించుకునే ప్రయత్నం

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ ధ్వజం

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ చైనా పర్యటనపై కాంగ్రెస్ పార్టీ విమర్శనాస్త్రాలను సంధించింది. ప్రధాని మోదీ జపాన్ పర్యటనలో ఉండి, ఆ తర్వాత చైనాకు వెళ్లనున్న నేపథ్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. భారత్—అమెరికా సంబంధాలలో తిరోగమనాన్ని సద్వినియోగం చేసుకోవడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తింది. మణిపూర్ ప్రజలు చాలాకాలంగా ప్రధాని పర్యటన కోసం ఎదురుచూస్తున్నారని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మణిపూర్ రాష్ట్రం విషయంలో చాలా సులభంగా తన చేతులెత్తేశాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ మాట్లాడుతూ తరచుగా విమాన ప్రయాణం చేస్తున్న (తరచూ అబద్ధాలు చెప్పే) ప్రధానమంత్రి జపాన్, చైనాలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. భారత్—అమెరికా సంబంధాలలో క్షీణతను చైనా కూడా ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తుండటం పట్ల ఆయన చైనా పర్యటన కొంతవరకు ఒక అంచనాకు వస్తుందని జైరామ్ రమేష్ తన ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలిపారు.

**ANNOUNCEMENT**
**SUR NAME CHANGE**

I MASHULLA LAXMI RAJAM S/O MASHULLA NARSAIAH, R/O. H No 4-97, Vilage: Badankurthi Mandal KHANAPUR, DIST NIRMAL TS. Has Declare that Change My Sur Name, Parents Sur Name & Spouse Sur Name Mentioned In my Passport BEARING NO. W7888896 'MASHULLA LAXMI RAJAM, FATHER NAME MASHULLA NARSAIAH, MOTHER NAME MASHULLA GANGAVVA, SPOUSE NAME MASHULLA VIJAYA TO "MASULA LAXMI RAJAM" Father Name "MASULA NARSAIAH MOTHER Name" MASULA GANGAVVA", SPOUSE NAME "MASULA VIJAYA" we would change our Sur name MASHULLA TO MASULA

ప్రజాపక్షం
శనివారం, 30 ఆగస్టు

# పత్తి రైతులకు శాపం

పత్తి దిగుమతులపై సుంకాన్ని డిసెంబర్ 31వరకు నిలుపుదలలో ఉంచుతూ కేంద్రప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వు అది చెప్పుకుంటున్నట్లు టెక్స్‌టైల్ రంగానికి ఎంత మేలు చేస్తుందో చెప్పలేము గాని, పత్తి పంట సాగుచేసే లక్షలాది రైతాంగానికి తీరని చేటు చేస్తుంది. పత్తి దిగుమతిపై సుంకం మినహాయింపు తొలి ఉత్తర్వు ఆగస్టు 18న జారీ అయింది. సెప్టెంబర్ 30వరకు అమలులో ఉండే ఆ ఉత్తర్వు – అమెరికా మన దేశం నుంచి దిగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచిన ఉత్తర్వు అమలులోకి రావటానికి 8 రోజులముందు జారీ అయింది. 50 శాతం సుంకాలు అమలులోకి వచ్చిన మరుసటి రోజు – ఆగస్టు 28న రెండవ మినహాయింపు ఉత్తర్వు విడుదలైంది. అంటే తొలి ఉత్తర్వును డిసెంబర్ 31వరకు పొడిగించినట్లయింది. అమెరికా వ్యవసాయోత్పత్తులకు భారత్ మార్కెట్లు గేట్లు తెరవాలని డిమాండ్ చేస్తున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ – భారత ప్రభుత్వం తమ ఒత్తిడికి తలొగ్గనందున వాణిజ్య ఒప్పందంపై చర్చలు వాయిదా వేశారు. రష్యా నుంచి క్రూడ్ ఆయిలు కొనుగోలు చేయటాన్ని నిలుపు చేయాలన్న ట్రంప్ హుకుంను నిరాకరించినందుకు అప్పటికే 25 శాతానికి పెంచిన దిగుమతి సుంకాలకుతోడు మరో 25 శాతం పెనాల్టీ విధించారు. పాకిస్థాన్‌తో భారత్ యుద్ధాన్ని తానే ఆపుచేశానని పదేపదే చెప్పటం ద్వారా మన రాజకీయ సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకున్న డోనాల్డ్ ట్రంప్, మన దేశం ఏ దేశంతో వ్యాపారం చేయాలో, చేయకూడదో నిర్దేశిస్తూ మన ఆర్థిక సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నారు. తమ బెదిరింపులకు భారత్ కాళ్లబేరానికి వస్తుందని ఆశించిన ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు నిరాశోపహతులై నిందలకు దిగారు. ఉక్రేన్–రష్యా యుద్ధాన్ని ''మోడీ యుద్ధం'' అని ఆక్రోశిస్తున్నారు. రష్యా నుంచి ఆయిలు కొనుగోలును భారత్ నిలుపుదలచేస్తే ఉక్రేన్–రష్యా యుద్ధం ముగుస్తుందని భ్రమలో ఉన్నారు వారు.

ఈ నేపథ్యంలో, చిన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, రైతులు, పశుపోషకుల సంక్షేమం తమ ప్రభుత్వానికి అత్యధిక ప్రాధాన్యత అని ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 25న అహ్మదాబాద్‌లో ఉద్ఘాటించారు. మన వ్యవసాయరంగం, పాడి పరిశ్రమ మార్కెట్‌లో ప్రవేశానుమతిని అమెరికా డిమాండ్ చేస్తున్న దృష్ట్యా ప్రధాని ఉద్ఘాటనకు ప్రాముఖ్యత ఉంది. అయితే ఆయన ప్రభుత్వం 28వ తేదీన పత్తి దిగుమతిపై ఉన్న 11శాతం సుంకం మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జౌళి పరిశ్రమకు పత్తి కొరత ఉన్నందున దానికి మేలుచేసే పేరుతో ఈ ఉత్తర్వును సమర్థించుకుంటున్నది. దీన్ని అమెరికాకు మోదీ లొంగుబాటుగా ఆప్ నాయకుడు కేజ్రీవాల్ విమర్శిస్తున్నారు.

పత్తి ఉత్పత్తి, గిట్టుబాటు ధర లభ్యత, ఎగుమతి, దిగుమతి మన దేశ రైతాంగానికి చాలా సున్నితమైన అంశం. 60 లక్షలమంది రైతులు పత్తిపంటసాగుతో జూదమాడుతున్నారు. మరో 4కోట్లమందికిపైగా కార్మికులు జౌళి మిల్లుల్లో పని చేస్తున్నారు. అందువల్ల అమెరికా నుంచి పత్తి దిగుమతిపై సుంకం మినహాయించటం మన దేశంలో పత్తి ధర దిగకోసేందుకు దారితీస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారత్ రూ.16,710 కోట్ల విలువైన వస్త్రాలు, దుస్తులను 2024లో అమెరికాకు ఎగుమతి చేసింది. ఇప్పుడు 50 శాతం సుంకంతో ఆ ఎగుమతులు తీవ్రంగా పడిపోయి జౌళి పరిశ్రమలో సంక్షోభం తలెత్తవచ్చు. పత్తి పంట సాగు సంక్షోభాలతో 1995 నుండి లక్షలాదిమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జాతీయ క్రైం రికార్డు బ్యూరో డేటా ప్రకారం 1995–2014 మధ్య 2,96,438 మంది రైతులు అప్పులపాలై బలవన్మరణం పొందగా, 2014–22 మధ్య మరో 1,00,476 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో పత్తి రైతుల ప్రత్యేక గణాంకాలు లేకపోయినా, మెజారిటీ మాత్రం పత్తి రైతులే. అందువల్ల మోదీ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం సుంకాలపై అమెరికాతో పోరాటం చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ, ఆచరణలో వారితో పన్నురహిత వ్యాపారం రైతులను మోసగించటమే అవుతుంది. కఠినంగా ఉండకపోతే ట్రంప్ తన 'ప్రియమిత్రునిపై' స్వారీ చేస్తారు.

## బాధిత జనరవం సురవరం



సురవరమా జోహార్!
బాధిత జనరవమా జోహార్
జనవరమా జోహార్
రూపెత్తిన కమినిజమా
జోహార్

చిరునవ్వులు చిలకరించు
మృదుస్వరమా
కోపం తాపం ఎరుగమి
మీ వరమా

సిద్ధాంత ప్రచారంలో
గుండెలు మీటే మాటలు
వాడే మర్మం తెలివిడి
సొంతమా

అనునిత్యం నినదించిన?
జనస్వనమా
దోపిడిపై పూరించిన
రణరవమా

అలుపెరుగని
అధ్యయనం
భావజాల వినిమయం
తుదివరకూ మీకబ్బిన
వ్యసనమా
నిన్నమొన్న కలిసి మనం
మాటలాడుకున్న క్షణం
ఇదే వీడుకోలన్నది
తెలియదు ఆ దినం
మీ ధ్యాసలె ఊసులై
మీ ఆశలె శ్వాసలై
కలిసెత్తూ వెలిగిస్తాం
గుండె దీప
రగిలిస్తూ కదిలిస్తాం
ఆశల లోకం
సురవరమా జోహార్
బాధిత జనస్వరమా జోహార్

ఏటుకూరి ప్రసాద్
25.08.2025

## జనస్వరం కామ్రేడ్ సురవరం

ఎరుపెక్కిన జనస్వరం
కామ్రేడ్ సురవరం
ఎర్ర జెండ పోరాటాల్లో
సదా నీవు స్మరణీయం
సురవరం సుధాకర రెడ్డి
సదా నీవు స్మరణీయం.
॥ ఎరుపెక్కిన ॥

విద్యార్థి దశలోనే
శ్వేతారుణ జండయితివి
శాస్త్రీయ విద్య కోసం
సమరాలను నడిపిస్తివి
అడ్డంకులు ఎన్నున్నా
కమ్యూనిస్టు పార్టీ బాట నడిచి
సిపిఐ అగ్రశ్రేణి
నేతగా నువ్వు ఎదిగితివి
కామ్రేడ్ సురవరం
సుధాకర రెడ్డి నీవు మోసిన
ఎర్రజెండ మా చేతికిచ్చి వెళ్ళితివా.
॥ ఎరుపెక్కిన ॥

మా గుండెలకు ఎర్ర జెండ
ఎరుపు నద్దిన యోధుడా
పేదోళ్ళ పోరాటానికి
గెలుపు తీగ లల్లితివా
నీ గంభీర ఉపన్యాసం
జ్ఞానం ఎంతో పంచితివి
జనములోన ఎర్రజెండ
ప్రతిష్టను పెంచితివి
కామ్రేడ్.. సురవరం
సుధాకర రెడ్డి నీవు చేసిన
పోరాటాలు సదామాకు స్మరణీయం.
॥ ఎరుపెక్కిన ॥

పార్లమెంటులో ప్రజల
గొంతుకగా మెరిసినావు
ప్రజా స్వామ్యం రాజ్యాంగం
విలువలను చాటినావు
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని
సాధించగ నిలిచినావు
సాగు త్రాగు నీటి కోసం
సమరాలను నడిపినావు
కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి
నీవు మోసిన ఎర్రజెండ స్ఫూర్తి పంచి వెళ్లితివా
॥ ఎరుపెక్కిన ॥

కవ్వించే కాంతులతో
కార్పొరేట్ మాయజాలం
మనువాద ప్రభుత్వాల
మతోన్మాద మంత్రజాలం
దోపిడోళ్ల ఆగడాల
కనిపించని మోసాల
గుట్టువిప్పే అగ్ని కణం
కమ్యూనిస్టు పార్టీ అన్నావు
॥ ఎరుపెక్కిన ॥

కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి
నువ్వెత్తిన ఎర్రజెండ
లక్ష్యసాధనకు పోరు చేస్తం
నీ ఆశయాల బాటలను సాగుచేస్తం....
॥ ఎరుపెక్కిన ॥

(కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి గారికి నివాళిగా...)

కె.వి.ఎల్.
9490952649

# నింగికేగిన ఉద్యమ కెరటం...సురవరం

సంస్మరణ

సమస్యలపై ప్రశ్నించడం..నిలదీయడం.. ఉద్యమించడం హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే ఆచరణలో పెట్టి.. ఉద్యమ బాట పట్టారు. విద్యార్థి నాయకుడిగా.. యువజన నాయకుడిగా.. పార్టీ నాయకుడిగా.. రాష్ట్ర స్థాయి నుండి ఆలిండియా స్థాయి వరకు అత్యున్నత పదవులు చేపట్టి వివిధ స్థాయిలో తన ప్రత్యేకతను నిరూపించుకున్న నాయకుడు.. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి. వారు మన నుండి( 2025 ఆగస్టు 22 న) దూరమైనప్పటికీ..వారు చూపిన ఉద్యమ పోరాట పటిమను.. కార్య దీక్షను.. నేటి యువతరం ఆదర్శంగా తీసుకుందాం! అనేక క్లిష్ట పరిస్థితులలో రాష్ట్రంలో విద్యార్థి యువజనోద్యమాన్ని ఐక్యంగా ముందుకు నడపడంతో ఆయన.. ఆయనకే సాటి.. వారిని స్మరించుకుందాం!

అది 1968–69 సం.ము ప్రత్యేక తెలంగాణ ఉద్యమము నడుస్తున్న కాలం.. రాష్ట్ర విద్యార్థిసంఘం (ఎఐఎస్ఎఫ్) కార్యదర్శిగా, 1972–73 సం.లో జై ఆంధ్ర ఉద్యమం నడుస్తున్న కాలంలో ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల్లో ఉంటున్న కాలంలో వారి స్వరాష్ట్రమైన తెలంగాణలోనూ.. ఆంధ్రాలోను విద్యార్థి యువకులు ప్రాంతీయ ఉద్యమాల వైపు ఉద్యమిస్తుంటే చాలా చాకచక్యంగా, నేర్పరిగా, ఓర్పుతో ప్రాంతీయ విభేదాలు తీవ్రస్థాయిగా వస్తున్న వేళ సమయస్ఫూర్తితో.. విద్యార్థి యువకులు ఎదుర్కొంటున్న సమస్యలను.. వాటిని సాధించుకొనుటకు ఉద్యమం కార్యాచరణను రూపొందించడంలోను పరిష్కారం చూపించటంలో వారు చూపిన దూరదృష్టి.. మార్గం నేటికీ ఆచరణీయం..

### తెలంగాణ ఉద్యమం :

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలలో ఉన్నారు. అదే సంవత్సరం ఉస్మానియాలో లా చేస్తున్న రోజులు. ఆకాలంలో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘాలలో కాంగ్రెస్ పార్టీకి అనుబంధమైన ఎన్ ఎస్ యు ఐ, సిపిఐకి అనుబంధమైన ఎఐఎస్ఎఫ్ సంఘాలు బలంగా ఉండేవి. యూనివర్సిటీ లా కాలేజీ విద్యార్థి సంఘానికి జరుగుతున్న ఎన్నికలలో ఎన్నికల్లో సుధాకర రెడ్డి అధ్యక్షులుగా ఎన్నికైనారు. వారు గెలవడానికి కారణం ఎన్నికల ముందు రోజున వారు కాలేజీ విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగం విద్యార్థులను బాగా అక్షర్షించింది. 'నేటి యువతే దేశానికి భవిష్యత్తని' దేశ,రాష్ట్ర రాజకీయాలపై అనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక, సామాజిక విధానాలపైన పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలపైన గంభీరమైన ఉపన్యాసంలో ఇచ్చిన సందేశము నేటికీ నాకు బాగా గుర్తుంది.

ఒక వైపు తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకున్నది. స్కూల్సు, కాలేజీలు విద్యార్థుల ఉద్యమాలతో మూతపడినవి. రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేశారు. అప్పటివరకు విద్యార్థి జెఎసి చేతిలో ఉన్న ఉద్యమం.. రాజకీయ నాయకుల చేతిలోనికి వెళ్ళింది. ఆ సంవత్సరం అన్ని పరీక్షలు వాయిదా పడినవి. విద్యార్థి ఉద్యమంలో చీలికలు వచ్చినవి. కాలేజీలు మూతపడటంతో విద్యార్థులు గ్రామాలకు వెళ్లి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఒక వర్గం..విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉండాలని ఒక వర్గం.. విభేదాలు తలెత్తినవి.

ఈ దశలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమైక్యత కోసం పిలుపునిచ్చింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు విలీనమైనప్పుడు.. చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని, ముల్కీనిబంధనలను అమలు చేయాలని, వెనుకబడిన తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని తదితర డిమాండ్లపై ఉద్యమించాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

### ఉద్యమాలకు శ్రీకారం చుట్టిన సురవరం:

ఆనాటి పెద్ద మనుషుల ఒప్పందంలో భాగంగా ముఖ్యంగా ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణలో ఉద్యోగ నియామకాలు జరుగుతుండేవి, అదేవిధంగా తెలంగాణలో వెనుకబడిన జిల్లాల్లో కాలేజీలు లేవు.. విద్యా అవకాశాలు కల్పించాలని, స్కూల్స్, కాలేజీలు పెట్టాలని, వెనుకబడిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని తదితర డిమాండ్లతో అసంతృప్తితో ఉన్న విద్యార్థి,యువకులను విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సురవరం వారిని సమీకరించి సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, స్కాలర్షిప్స్, నిరుద్యోగులకు ఉపాధి, ఎంప్లాయ్మెంట్, తెలంగాణ అభివృద్ధి సమస్యలపై సెమినార్లు నిర్వహించి అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలులో పాలకుల వైఫల్యాలు.. పదవులు కోల్పోయిన రాజకీయ నాయకులు.. అనుసరిస్తున్న విధానాలను వివరిస్తూ.. తెలంగాణ ప్రాంతంలో ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు.. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య, ముల్కీ నిబంధనలు అమలు, పేద విద్యార్థులకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ నెలకొల్పాలని వివరిస్తూ విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టారు..ఆ విధంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువకులు అనేకమంది కమ్యూనిస్టు పార్టీ, ఎఐఎస్ఎఫ్ లో చేరారు. ఆ విధంగా చేరిన వారిలో నేను ఉన్నాను.

రెండోవైపు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణలో భూస్వాముల వద్ద వారి స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను.. బయటకు తీసి పేదలకు పంచాలని.. భూ ఆక్రమణ ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చింది. 1970–71 ప్రాంతంలో ఈ ఉద్యమం తీవ్రంగా నడిచింది. వేలాది ఎకరాల భూములను ఆక్రమించడం, పేదలకు దున్నించటం నడిచింది. ఈ ఉద్యమంలో కూడా విద్యార్థి, యువకులు పాల్గొనే విధంగా కార్యక్రమాన్ని ఇచ్చి స్వయానా సుధా



కర రెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేపట్టారు. ఇందులో చెప్పుకోదగినది.1971 లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా వేలాది మంది విద్యార్థులతో రాష్ట్ర సచివాలయం ముట్టడి జరిగింది. దీనికి ప్రత్యక్షంగా సుధాకర రెడ్డి, అజీజ్ పాషా, రాం నరసింహారావు తదితరులు నాయకత్వం వహించారు. ఆ సందర్భంగా అరెస్టులు చేసి జైల్లో పెట్టటం జరిగింది. దీనితో రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కు నిధులు అధికంగా కేటాయించింది. ప్రతి జిల్లా కేంద్రంతో పాటు, కొన్ని వెనుకబడిన తాలూకాలలో సాంఘిక సంక్షేమ హాస్టల్లు నెలకొల్పడ్డాయి.

### ఉద్యోగమైనా ఇవ్వాలి.. జైల్లోనైనా పెట్టాలి:

నిరుద్యోగ సమస్యపై విద్యార్థి యువకులను సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ జాతాలు.. ర్యాలీలు చేపట్టాలని ఆనాటి యువజన విద్యార్థి సంఘాలకు నాయకత్వం వహిస్తున్న కె.ప్రతాపరెడ్డి, సుధాకర రెడ్డిగారల నాయకత్వంలో వందల గ్రామాలలో పట్టణ, తాలూకా, జిల్లా కేంద్రాలలో కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఆ సందర్భంగా దేవరకొండ నుండి 36 మంది యువకులము సైకిళ్ల ద్వారా 50 కి పైగా గ్రామాల్లో నేడు పార్టీ బాధ్యతలలో ఉన్న అజీజ్ పాషా, ఉజ్జిని రత్నాకర్ రావు, పల్లా వెంకటరెడ్డి, యాదగిరి రావు, వై జైహింద్ రెడ్డి తదితరులము గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్నాము. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా వందల గ్రామాల్లో జరిగింది.

### 18 ఏండ్లకే ఓటింగ్ హక్కు:

1972లో ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన సుధాకర రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి కె చంద్రప్పన్ 18 ఏళ్లకు ఓటు హక్కు సాధించే ఉద్యమానికి నేతృత్వం వహించారు. ఢిల్లీ వీధులలో భారీ యువజన ర్యాలీలు నిర్వహించారు. ఆ సందర్భంగా రాష్ట్ర కేంద్రాలలో పెద్ద ఎత్తున విద్యార్థి యువకులను సమీకరించి ప్రదర్శనలు జరిగినవి.1973 అక్టోబర్లో సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు అధిక ధరలు.. భూ సంస్కరణలు తదితర సమస్యలపై లక్షలాదిమందితో ఢిల్లీ పార్లమెంటును ముట్టడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలాది మంది యువకులను సమీకరించటంలో సుధాకర రెడ్డి పాత్ర కీలకమైనది. ఈ కార్యక్రమంలో హైదరాబాదు నుండి 50 మందికి పైగా యువకులతో నేను పాల్గొన్నాము.

### జై ఆంధ్ర ఉద్యమం:

సుధాకర రెడ్డి గారు ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే 1972–73లో జై ఆంధ్ర ఉద్యమం మొదలైంది. కమ్యూనిస్టు పార్టీ, యువజన సమాఖ్య అనేక ఆటుపోట్లను ఎపిలో ఎదుర్కొన్నది. ఆ సందర్భంలో సుధాకర రెడ్డి గారు రాజకీయ నాయకులు కొంతమంది వారి స్వప్రయోజనాల కోసం ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాన్ని తీసుకొచ్చి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి దెబ్బతీసే ప్రయత్నం ఉన్నదని.. దీనికి వ్యతిరేకంగా యువకులను చైతన్యం చేస్తూ..వివిధ ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా యువకులతో విజయవాడలో సమావేశం జరిగింది.

1978 నుండి రాష్ట్ర రాజకీయాల్లో సుధాకర రెడ్డి గారు క్రియాశీలకమైన పాత్ర పోషించారు. కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో భూ పోరాటాలతో పాటు వెనుకబడిన ప్రాంతాలకు కృష్ణా, గోదావరి నదీ జలాలు అందించే ప్రాజెక్టులు చేపట్టాలని సదస్సులు, పాదయాత్రలు చేపట్టారు.

### సుధాకర రెడ్డిగారు నాయకత్వం వహించిన పోరాటాలు:

రాష్ట్ర సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలో ఉన్న సందర్భంలో 2000 సంవత్సరంలో విద్యుత్ రేట్లు పెంపుదలకు నిరసిస్తూ ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నడిపారు. చివరికి ఆగస్టు 28 న రాష్ట్ర అసెంబ్లీని ముట్టడించాలని పిలుపునిచ్చి.. అన్ని వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలను భాగస్వాములు చేసినారు. ఆ సందర్భంగా బషీర్బాగ్ లో జరిగిన కాల్పుల్లో తృటిలో ప్రాణపాయం నుంచి తప్పించుకున్నారు. తీవ్రమైన కేసులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా వందలాదిమందిని అరెస్టులు.. జైళ్లలో నిర్బంధించారు.

శాశ్వత కరువు నివారణ.. ఫ్లోరోసిస్ బారి నుండి రక్షించేందుకు నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలు అందించాలని, ఎస్ఎల్‌బిసి సొరంగ పథకం పూర్తి చేయాలని, గోదావరి జలాలు శ్రీరాంసాగర్ రెండవ దశ ద్వారా 2.5 లక్షలు ఎకరాలకు నల్లగొండ జిల్లాకు అందించే కాల్వ పనుల చేపట్టాలని రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శిగా 1996 97 సం. లో జిల్లాలో చేపట్టిన అనేక కార్యక్రమాలతో పాటు జిల్లా కలెక్టరేట్ ముట్టడి లో పాల్గొన్నారు. 2003 సెప్టెంబర్ లో డిండి మండలం నుండి నల్లగొండ వరకు 120 కి. మీ. పాదయాత్రకు 60 సంవత్సరాలు వయసులో స్వయంగా నాయకత్వం వహించి ఆరు రోజులు 500 మంది కార్యకర్తలతో నడిచారు. అదేవిధంగా తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ జిల్లాకు చేపట్టిన ఎత్తిపోతలు పూర్తి చేయాలని అనేక ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

1998లో 2004లో నల్లగొండ పార్లమెంటు నుండి ఎన్నికైన అనంతరం జిల్లాలో ఫ్లోరిన్ నివారణకు, రాచకొండ భూములను మిలిట్రి స్థావరాలకు ఇవ్వకుండా, ఎత్తిపోతల పథకాలు పూర్తికి, జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ స్థాపనకు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులు పూర్తికి చేపట్టిన ఉద్యమాలలో పాల్గొని వాటిని అమలు చేయించారు.

### కార్యకర్తలతో మమేకం :

కార్యకర్తలతో మమేకమై ఉత్సాహాన్ని నింపేవారు. హుందాతో కూడిన రాజకీయపంథా సుధాకర రెడ్డి ని అజాతశత్రువుగా నిలిపింది. మాటల్లో సౌమ్యత, మనసులో ఆర్ధత, ఆచరణలో నిబద్ధత, కార్యకర్తల పట్ల ఆత్మీయత, వామపక్ష ప్రజా సంఘాలతో సౌహార్ద్రత కలిగి ఉండేవారు. ఈ లక్షణాలు సురవరాన్ని పార్టీలకు అతీతంగా అందరి వాడిని చేశాయి.

సురవరం గత కొంతకాలం నుండి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్తో బాధపడుతూ చికిత్స పొందుతూ.. రాష్ట్ర పార్టీ మహాసభలు ఆగస్టు 20–22 తో ముగిసిన రాత్రే 10.20 గం. లకు (83 వ సంవత్సరంలో) మన నుండి దూరమైనారు. వారి భౌతికకాయాన్ని పరిశోధనల కోసం మెడికల్ కాలేజీకి దానం చేయాలని, నేత్రదానం చేయాలని కోరినమేరకు చేయడం జరిగింది.

ఉజ్జిని రత్నాకర్ రావు, 9490952646

# కష్టజీవుల పోరాటయోధుడు

మార్క్సిజం వెలుగులో ఎర్రజెండా నీడలో అంతిమ శ్వాస వరకు ఎత్తిన జెండా దించకుండా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఒకే పార్టీలో కొనసాగి ఎందరికో ఆదర్శప్రాయుడుగా నిలిచి పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన ముద్రవేసిన కష్టజీవుల పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి ఈ నెల 22 నాడు మరణించడం కడు విషాదకరం. విద్యార్థి దశ నుండి పోరాట స్వభావాన్ని అలవర్చుకొని అతి సాధారణ కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదిగి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి తెలుగు నేల నుండి మూడు పర్యాయాలు భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగాను, రెండు పర్యాయాలు నల్గొండ పార్లమెంట్ సభ్యుడుగాను నిరుపమాన సేవలు అందించారు.

సురవరం సుధాకరరెడ్డి తన పదేళ్ల వయస్సులోనే సాహిత్యం చదవడం అలవరచుకున్నారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఆయనను కమ్యూనిస్టు భావజాలం ఎంతగానో ఆకర్షించింది. ఫలితంగా ఆయన విద్యార్థి దశ నుంచి ప్రశ్నించడం అలవరచుకున్నారు. సురవరం సుధాకరరెడ్డి 1957లో కర్నూలులోని మున్సిపల్ పాఠశాలలో ఎస్.ఎస్. ఎల్. సి చదువుతున్న సమయంలో 15 ఏళ్ల వయసులో పాఠశాలల్లో ప్రాథమిక అవసరాలకోసం చేపట్టిన ఆందోళన కర్నూలు జిల్లాలోని అన్ని పాఠశాలలకు విస్తరించి ఉద్యమంగా మారడంతో అది ఆయన జీవితానికి రాజకీయ బాటలు పరిచింది అని చెప్పవచ్చు.

సురవరం సుధాకరరెడ్డి 19 ఏళ్లకే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఎస్.ఎఫ్) కర్నూలు పట్టణ విభాగానికి కార్యదర్శిగా ఎన్నికై 1960 నాటికి కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆయా విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం 56 రోజుల పాటు ఏకధాటిగా నిర్వహించిన సమ్మెకు సురవరం సుధాకరరెడ్డి నాయకత్వం వహించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయన 1964లో కర్నూలులో బి.ఏ చదువుతున్న సమయంలో కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ప్రతి విద్యార్థికి చదువు,పోరాటం రెండు కళ్ళు అని ఆయన తరచుగా పేర్కొనేవారు. డిగ్రీ తర్వాత విజయవాడలోని విశాలాంధ్ర దినపత్రికలో సురవరం సుధాకరరెడ్డి పనిచేయాలనుకున్నారు. కాని పార్టీ ఆదేశం మేరకు ఆయన 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి కోర్సులో చేరి కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎ.ఐ.ఎస్.ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టారు. 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయం లా కాలేజీ నుండి ఎల్. ఎల్.బి డిగ్రీని పొందారు. 1968లో ఎల్.ఎల్.ఎమ్ కోర్సులో చేరినప్పటికి ఆయన విద్యార్థి నాయకుడిగా కొనసాగుతుండటంతో దాన్ని పూర్తి చేయలేకపోయారు.

కేరళకు చెందిన చంద్రప్పన్‌తో కలిసి సురవరం సుధాకరరెడ్డి '18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించాలి' అని 1969 లో పార్లమెంటు ముందు మహాప్రదర్శన నిర్వహించారు. 1970లో ఎ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికై అనేక విద్యారంగ సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించారు. అలాగే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించాడు. సోవియట్ యూనియన్, చెకొస్లొవేకియా, హంగేరి, ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన అంతర్జాతీయ విద్యార్థి సంఘం కార్యవర్గ సభ్యుని హోదాలో పాల్గొన్నారు. 1972లో ఎ.ఐ.వై.ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి కాశ్మీర్ నుంచి కేరళ వరకూ విద్యార్థి, యువజనోద్యమాల బలోపేతానికి విస్తృతంగా పర్యటించారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో నిరసనలు చేస్తున్న క్రమంలో ఆయన దేశవ్యాప్తంగా ఢిల్లీ, కలకత్తా, పాట్నా, లక్నోలతోపాటు అనేక చోట్ల నిర్బంధాలకు గురయ్యారు.

రాజమండ్రిలో 1974లో జరిగిన సి.పి.ఐ రాష్ట్ర మహాసభలో సురవరం సుధాకరరెడ్డి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికై రెండు పర్యాయాలు 1984 వరకు ఆ బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సురవరం సుధాకరరెడ్డి 1985, 1989 లలో ఎం.ఎల్.ఎ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. మళ్ళీ పార్టీ అదేశానుసారం 1994 లో కర్నూలు జిల్లాలో పార్టీ బలంగా ఉన్న డోన్ నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డిపై పోటీ చేసిననూ ఆ ప్రాంతాల్లో ఫ్యాక్షన్ ముఠాలు రిగ్గింగ్‌కు పాల్పడటంతో ఆయన ఓటమి చెందారు. సురవరం సుధాకరరెడ్డి 1998 లో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి 12 వ లోక్ సభకు తొలిసారిగా గెలుపొందారు. ఆ సమయంలోనే మానవ వనరుల అభివృద్ధి కమిటి, ఔషధ నియంత్రణ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. కాని 13 నెలలకే పార్లమెంటు రద్దు కావడం గమనార్హం.

సురవరం సుధాకరరెడ్డి 2000 సంవత్సరంలో సి.పి.ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగాను, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2004 లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 14వ లోక్‌సభకు రెండవసారి ఎన్నికయ్యారు. ఆ విధంగా ఆయన నల్గొండ నియోజకవర్గం నుండి రెండుసార్లు (1998 మరియు 2004) పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. లోక్‌సభలో ప్రజా సమస్యలను లేవనెత్తడం లో సురవరం సుధాకరరెడ్డి ముందుండేవారు. పార్లమెంటు వేదికగా నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య, విదేశాల్లో నల్లధనం, దేశంలో రైతుల ఆత్మహత్యలు, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, జిల్లాలో సాగునీటి పథకాల అమలు మరియు కరువు మొదలైన అంశాలపై ఆయన ప్రజాప్రతినిధిగా ప్రజాపక్షం వహించి ప్రజాగొంతుకగా నినదించారు. 2004 లోనే ఆయన కార్మికశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ అయ్యారు. అలాగే ఆయన ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధిగా ప్రసంగాలు చేశారు.

హైదరాబాద్‌లో 2008 లో జరిగిన పార్టీ జాతీయ 20 వ మహాసభలో సి.పి.ఐ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా సురవరం సుధాకరరెడ్డి ఎన్నికయ్యారు. 2012 (పాట్నాలో), 2015 (పుదుచ్చేరిలో), 2018 (కొల్లం)లలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సందర్భంగా ఆయన సి.పి.ఐ జనరల్ సెక్రటరీగా వరుసగా మూడుసార్లు ఎన్నికైనారు. చంద్రరాజేశ్వరరావు తరువాత సి.పి.ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తి సురవరం సుధాకరరెడ్డి . చంద్ర రాజేశ్వరరావు అడుగుజాడలలో సురవరం సుధాకరరెడ్డి పురోగమించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా ఆయన అమెరికా, చైనా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఫ్రాన్స్, పాకిస్తాన్, ఇటలీ దేశాల్లో ఆయా కమ్యూనిస్టు పార్టీల సమావేశాలకు హాజరయ్యారు.

తెలంగాణ ఉద్యమంలో సురవరం సుధాకరరెడ్డి కీలక పాత్ర పోషించారు. గతంలో విశాలాంధ్ర కోసం ఉద్యమించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ మలిదశ తెలంగాణ పోరాటంలో క్రమంగా తన నిర్ణయాన్ని మార్చుకోవడంలో ఆయన క్రియాశీలంగా వ్యవహరించారు అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌కు మద్దతు ఇవ్వడం సరైనదే అని ఆయన సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ కేంద్ర నాయకత్వాన్ని, ఆంధ్రలోని తన సహచరులను సురవరం సుధాకర రెడ్డి ఒప్పించగలగడం అనన్య సామాన్యం. ఆ రకంగా తెలంగాణ ప్రజాభిప్రాయం మేరకు ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ ఆకాంక్ష కు అనుగుణంగా పార్టీ నిర్ణయాన్ని ప్రకటింపజేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సురవరం సుధాకర్రెడ్డి తొలిసారిగా కర్నూలు జిల్లా మొలగవల్లి గ్రామంలో మిగులు భూములపై భూపోరాటంలో పాల్గొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు 250 మంది పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. మెదక్, నల్లగొండ, అనంతపురం జిల్లాలలో జరిగిన అనేక భూపోరాటాలలో ఆయన ముందుండి ఉద్యమించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా పెదకొత్తపల్లి మండలంలో భూపోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావుతో కలిసి భూ ఆక్రమణోద్యమ ఫలితంగా 300 ఎకరాలను పేదలకు పంచజేయడంలో ఆయన ప్రముఖంగా ఉద్యమించారు. అలాగే పేదలకు కరువు పెన్షన్‌కోసం ఎంతగానో ఉద్యమించి విజయం సాధించారు. స్పష్టమైన అభిప్రాయాలతో అనర్గళంగా మాట్లాడగలిగే ఉపన్యాసకుడుగా సురవరం సుధాకరరెడ్డి పేరు గడించారు. రాజకీయ, సామాజిక, చారిత్రక విషయాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ ఉపన్యసించడం ఆయన ప్రత్యేకత. ఆయన ప్రసంగా లు ఎందరినో ఆకట్టుకున్నాయి. అలా ఆయన తన వాగ్ధాటితో ఎంతోమందిని ప్రభావితం చేశారు. ఆయన వామపక్షాల ఐక్యతను ఆశించారు.

వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ అనారోగ్యంతో ఉన్నా కూడా అంతిమ శ్వాస దాకా పార్టీ ఆశయాల కోసం పరితపించిన పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మరణం కష్టజీవులకు, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు. ఆదర్శాలు అందరూ నొక్కి వక్కాణిస్తారు. కాని కొందరు మాత్రమే ఆ ఆదర్శాలను కడదాకా ఆచరించి భావి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారు.

***ఈ రోజు ఆయన సంస్మరణ సభ సందర్భంగా ఆయనకు వినమ్ర నివాళులు అర్పించుదాం!***

జె.జె.సి.పి.బాబూరావు, రీసెర్చ్ స్కాలర్
94933 19690

## నిజాంసాగర్‌కు తగ్గిన వరద ఉధృతి



ప్రజాపక్షం/నిజాంసాగర్‌: నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ఉధృతి తగ్గింది. దీంతో నీటి విడుదలను తగ్గించి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 16 వరద గేట్లు, 20 వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండగా నీటి విడుదల ప్రవాహాన్ని తగ్గించడంతో శుక్రవారం చిన్నపూల్ వంతెన తేలింది. దీంతో మోడల్ స్కూల్‌లో ఉన్న 90 మంది విద్యార్థులను సురక్షితంగా బయటకు తేగలిగారు. శుక్రవారం ఉదయం నిజాంసాగర్‌కు చేరుకున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంఓల ప్రత్యేకంగా విద్యార్థులకు బస్సును ఏర్పాటు చేసి వారి వారి స్వస్థలాలకు పంపించారు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్, పిట్లం ఏఎంసీ చైర్మెన్ మనోజ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లికార్జున్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య, వార్డెన్ సరోజన విద్యార్థులను సురక్షితంగా వారి వారి స్వస్థలాలకు పంపించారు.

## నీట మునిగిన కుభీర్ రోడ్డు



ప్రజాపక్షం/బైంసా : గడ్డెన్న వాగు ప్రాజెక్టు వరద నీటి విడుదలతో బైంసా పట్టణ శివారులోని కుభీర్ రోడ్డు మార్గం జలమయమైంది. పాలజ్, కుభీర్, నిగ్వ ప్రాంతాలకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. గడ్డెన్న ప్రాజెక్టు నుంచి సుద్దవాగులోకి వదిలే నీరు కుభీర్ మార్గాన్ని ముంచేత్తింది. పట్టణ శివారులోని హనుమాన మఠం వద్దకు వరద నీరు చేరింది. నీరు పెరుగుతుండడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పాలజ్,తదితర ప్రాంతాలకు వెళ్లె వాహనాలన్నీ భట్టిగల్లీ హనుమాన్ మఠం వద్దే బారులు తీరాయి.

## గిరిజనుల సంక్షేమం కోసం కృషి

### ఆసిఫాబాద్ ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి



ప్రజాపక్షం / అసిఫాబాద్ : గిరిజనుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఎల్‌ఎ కోవలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పిల్లల పార్కులో కొట్నాక భీంరావ్ 23వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్‌పి కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, బిఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ లతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి గిరిజన శాఖ మంత్రిగా కొట్నాక భీంరావ్ పని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదివాసీల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం మహోన్నతమైందని కొనియాడారు. గిరిజన సంఘాల పెద్దలు మాట్లాడుతూ నేటి యువత భీంరావును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మర్సకోల సరస్వతి, డిడి రమాదేవి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, మాజీ ఎంఎల్‌ఎ ఆత్రం సక్కు, మాజీ లైబ్రరీ చైర్మన్ కనక యాదవరావు, గిరిజన సంఘాల నాయకులు అర్జు మాస్టర్, తుడుం దెబ్బ వ్యవస్థాపకులు బుర్స పోచయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం



ప్రజాపక్షం/దిలావార్‌పూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజున జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సదానందం మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అధ్వర్యంలో భారత మూడూ సార్లు ఓలంపిక్ లో స్వర్ణ పతకం సాధించిందని చెప్పారు.క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వనికి దోహదపడుతాయి అన్నారు. వ్యాయమ ఉపాధ్యయుడు అంబాజీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడల ద్వారా కో.ఆపరేషన్ పెరుగుతుందని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అంబాజీ వల్ల క్రీడల పట్ల ఆసక్తి పెరిగిందని పలువురు విద్యార్థులు అన్నారు.ఈ దినోత్సవాన్ని ఇంత ఘనంగా జరపడానికి సహకరించిన తెలుగు ఉపాధ్యాయుడు సాయన్న కు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. నాగభూషణం,పోశెట్టి,అమృత్,వామన్ రావ్, రమేష్, తదితరులు మాట్లాడారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముధోల్ నియోజకవర్గానికి భారీ నష్టం

### ఎమ్మెల్యే పవార్



ప్రజాపక్షం/బైంసా : భారీ వర్షాలతో ముధోల్ నియోజకవర్గం లో భారీ నష్టం జరిగిందని,ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ డిమాండ్ చేశారు.శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.రేపు వర్సకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న,నేపథ్యంలో వరద నష్టం పైనే మాట్లాడనున్నట్లు చెప్పారు.పంటలు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయని రైతాంగానికి తక్షణ పరిహారం ప్రభుత్వం అందించేలా మంత్రులును,రాష్ట్ర ముఖ్యమంత్రి కి విన్నవిస్తానన్నారు.నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తానని,రోడ్లు,జనావాసాలు దెబ్బతినడంతో పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు.వీరికి సహాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన



ప్రజాపక్షం/తానూర్ : రెండు రోజుల నుంచి భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను శుక్రవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల తోపాటు ఏఎస్పీ అవినాష్ కుమార్,తానూర్ ఎస్‌హెచ్ఓ షేక్ జుబేర్,మండలంలోని జౌళా బి,తొండాల,మొగలి,కోలూర్ గ్రామాలను సందర్శించారు.వారు పరిశీలించడమేకాకుండా,ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని,వరదల వల్ల ఏర్పడిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళేందుకు దృష్టి పెట్టారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ ప్రజల రక్షణ,భద్రతే ప్రధాన లక్ష్యంగా తీసుకొని,పోలీస్ శాఖ ప్రజల పక్కనే నిలుస్తుందని తెలిపారు.

## సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ : హవేలీ ఘన పూర్ మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పర్యటించారు. పోచమ్మరాల్ సమీపంలో జాతీయ రహదారిపై కొట్టుకుపోయిన బ్రిడ్జిని, ఆర్మీ బృందం చేపట్టిన చర్యలు పరిశీలించారు. మంజీరా పరివాహక గ్రామం సర్దనలో పర్యటించారు. బూర్గుపల్లిలో రోడ్డు కొట్టుకుపోగా తాత్కాలిక చర్యలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల కాలంలో ప్రజలకు అండగా జిల్లా యంత్రాంగం రక్షణగా ఉంటుందని. ప్రభుత్వం సహాయక చర్యలు ముమ్మరం చేసిందని తెలిపారు. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రావు, పీఆర్ ఇఇ నర్సింలు, డిఈ శివనాగరాజు, తహసీల్దార్ సింధు రేణుక, డిఎస్పీ ప్రసన్న కుమార్, సిఐ రాజశేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# వరద బాధితులకు అండగా ఉంటాం

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/బైంసా : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శుక్రవారం ఆమె ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్‌తో కలిసి బైంసా పట్టణంలోని రావుల్ నగర్,ఆటోనగర్,ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ,భారీ వర్షాలు,వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలడం జరుగుతుందని తెలిపారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని,ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు.ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటారని,ఇబ్బందులు తలెత్తితే 9100577 132 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎవరూ ప్రవాహం నీటిలోకి వెళ్లకూడదని హెచ్చరించారు. ఎన్డిఆర్ఎఫ్,బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.అనంతరం బైంసా మండలంలోని దేగమ వంతెనను కలెక్టర్,ప్రత్యేక అధికారి పరిశీలించారు.వంతెన పరిసర ప్రాంతాలలో వరద పరిస్థితులను గమనించారు.స్థానికులతో మాట్లాడుతూ వరద నీటిప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కుంటాల మండలంలోని అందకూరు బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరదల వల్ల వంతెనలు,రహదారులు సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మరమ్మతులు చేస్తామన్నారు. బైంసా సబ్ కలెక్టర్‌ప అజ్మీరా సంకేత్ కుమార్,ఆర్ అండ్ బి డిఈ సునీల్, మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## తుది ఓటరు జాబితాకు సహకరించాలి

### కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ :మండలకేంద్రాలు,గ్రామపంచాయతీలు ,వార్డుల వారిగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే 30 వరకు తెలియజేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 2 వార్డు, గ్రామపంచాయతీల వారిగా ఫొటోతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సమీకృత జిలాల్ల కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం మాట్లాడారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల విషయంలో 30 వరకు అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, 31 న అభ్యంతరాలను పరిష్కరిస్తామని, అనంతరం సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి : బొజ్జు పటేల్

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ నియోజకవర్గం లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వరదలకు ఇబ్బందులకు గురైన గ్రామాలకు ప్రజలకు అధికారులు అప్రమత్తంగా ఉండి సేవ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధికారులను ఆదేశించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పొంగిన చెరువులు వాగులు వంకలకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులు సమీక్షించి వాటిని సరిహద్దుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యుత్ సమస్య పట్ల అధికారులు అప్రమత్తంగా పనిచేయాలన్నారు.వర్షాలకుశిథిలమైన ఇండ్లను గుర్తించాలని సూచించారు.

# భారీ వర్షాల నష్టాలపై నివేదికలు సమర్పించాలి

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్‌: జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల కలిగిన నష్టాలపై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ భవనంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ జూలై, ఆగస్టు నెలల్లో వర్షాల కారణంగా పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ పరిధిలో రహదారులు కోతకు గురయ్యాయని, కల్వర్టులు తెగిపోయాయని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల కాలువలు గండ్లు పడ్డాయని, జిల్లాలో 15 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. విద్యుత్ శాఖ పరిధిలో స్తంభాలు కూలి తీగలు తెగిపోయిన ఘటనలు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిన సంఘటనలు జరిగాయని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చనిపోయిన పశువులు, గొర్రెలు, మేకల వివరాలను ఫోటోలతో అం దించాలని ఆదేశించారు. అన్ని శాఖల నివేదికల ఆధారంగా బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

**ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు**

స్థానిక సంస్థల ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30లోపు సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఇప్పటికే సిద్ధం చేసి ఈ నెల 28న అన్ని గ్రామపంచాయతీలు, మండల కార్యాలయాల్లో ప్రదర్శించామని చెప్పారు. 30న మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో సమావేశం నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. 31న అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. జిల్లాలో గ్రామీణ ఓటర్లు 3,53,904 మంది, గ్రామపంచాయతీలు 335, వార్డులు 2,874 ఉన్నాయని వివరించారు.జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ నారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ధ్యాన్ చంద్ సేవలు చిరస్మరణీయం**

కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోజాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.కలెక్టర్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి రమాదేవి, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టరేట్ ముందు జర్నలిస్టుల నిరసన



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులు తమ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె ఐజెయు) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు, రైల్వే పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరంకృషిచేస్తున్నారనిగుర్తు చేశారు. 24 గంటలూ శ్రమిస్తున్నప్పటికీ సొంత ఇల్లు లేకపోవడంతో జర్నలిస్టుల కుటుంబాలుఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం జర్నలిస్టులుతమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పరిపాలనా అధికారికి అందజేశారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లు వెంటనే పరిష్కరించకపోతే మరోసారిఆందోళన చేస్తామని హెచ్చరించారు. జాతీయ కమిటీ సభ్యులు గాండ్ల రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టి.రవీందర్,జిల్లా సంయుక్త కార్యదర్శి సట్ల హనుమాన్లు, పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

## విచ్ఛిన్నకర శక్తుల చర్యలను తిప్పికొట్టాలి : ఎఐటియుసి



ప్రజాపక్షం /శ్రీరాంపూర్ : మైనింగ్ స్టాఫ్ సిబ్బందిని విడగొట్టే విచ్ఛిన్నకర శక్తుల చర్యలను సమిష్టి బలంతో తిప్పికొట్టాలని ఎఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య అన్నారు. శుక్రవారం ఎస్ఆర్‌పి 3, 3ఎ గనిని సందర్శించిన వారు మైనింగ్ స్టాఫ్ సిబ్బంది సమస్యలపై మీటింగ్ నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ అన్‌ఫిట్ అయిన సిబ్బందికి సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ కల్పించేందుకు ఆర్ఎల్‌సి వద్ద అగ్రిమెంట్ జరిగిందని, త్వరలో సర్క్యులర్ రానున్నదని తెలిపారు. 2016, 2017 బ్యాచ్ సిబ్బందికి ఓవర్‌మెన్ ప్రమోషన్లు, ఎన్‌ఓసి లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అండర్ మేనేజర్ పరీక్షల అర్హతలపై యాజమాన్యంతో చర్చిస్తామని వెల్లడించారు. గతంలో గుర్తింపు సంఘం లేకున్నా మైనింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించిన ఘనత ఎఐటియుసి దేనని గుర్తుచేశారు. ప్రస్తుతం గుర్తింపు సంఘంగా స్ట్రక్చర్ మీటింగ్ లలో సమస్యలు లేవనెత్తి పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఇతర యూనియన్ల మాటలు నమ్మి మోసపోకుండా, సమస్యలను గుర్తింపు సంఘం దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అడ్డు శ్రీనివాస్, ఏరియా సెక్రటరీ బాలకృష్ణ, ట్రేడ్స్ మెన్ ఇంచార్జి సురేష్, పిట్ సెక్రటరీ మురళి చౌదరి, వైస్ ప్రెసిడెంట్ తౌటం మల్లేష్, కిరణ్, సాయి బాబా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన



ప్రజాపక్షం/గజ్వేల్: వర్షాల ఫలితంగా ధ్వంసమైన పంటలను పరిశీలించామని, పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలను సందర్శించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందజేశారు. ముఖ్యంగా పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తద్వారా నష్టం నుండి కొంతవరకు బయట పడవచ్చని తెలిపారు. కాగా ఇప్పటి వరకు గజ్వేల్ మండల పరిధిలో ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు వరి 643 ఎకరాలు, ప్రత్తి 300 ఎకరాలు, రాయపోల్ మండల పరిదిలో వరి 183 ఎకరాలు, ప్రత్తి 52 ఎకరాలలో దెబ్బతిన్నట్లు వివరించారు. ఎఇఒగణేష్ పాల్గొన్నారు.

# చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు

### కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశం



ప్రజాపక్షం/సంగారెడ్డి : జిల్లాలో కురిసిన వర్షాల పట్ల అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు.శుక్రవారం సంగారెడ్డి పట్టణ పరిధిలోనిరేణిగుంట,ఎర్రగుంట,మాసాను,కుంట, చెరువులు వరద నీటితో పొంగి పోర్లుతున్న నేఫథ్యంలో కలెక్టర్ పర్యటించారు. రేణిగుంట చెరువులో ఏర్పాడిన గండిని పరిశీలించారు.చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు సవ్యంగా కిందికి పారేలా మార్గాలు కల్పించాలని సూచించారు. ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయం భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.ఇంటింటికి తిరిగి ఇంటెన్సివ్ జ్వర సర్వేలు నిర్వహించి సత్వర చికిత్స అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని ముఖ్యమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆడ్‌డిఓ రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి, తహసీల్దార్ జయరామ్, మున్సిపాల కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘మెదక్’లో వరదలకు రోడ్లు, వంతెనలు ధ్వంసం

- తెగిన చెరువులు, కాలువలు, కుంటలు
- శంపూర్ వద్ద రైల్వే ట్రాక్ ధ్వంసం
- జల దిగ్బంధంలో 7 గ్రామాలు.. రాకపోకలు బంద్
- మెదక్ జిల్లా వ్యాప్తంగా పంటలకు నష్టం



ప్రజాపక్షం/మెదక్: అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్నా భారీ వర్షాలకు మెదక్ జిల్లా అతలాకుతలమైంది.జిల్లాలో కురిసిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు బంద్ అయ్యాయి.గ్రామాలు, తండాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పంట పొలాలు, నివాస ప్రాంతాలు, చెరువులను తలపిస్తున్నాయి. వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా 50వరకు రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. భారీ వరదల కారణంగా మెదక్ అక్కన్నపేట మీదుగా కాచిగూడ వరకు వెళ్లే రైలు మార్గం హవేలీ ఘనపూర్ మండలం శంనాపూర్ గ్రామం వద్ద రైల్వే ట్రాక్ ధ్వంసం అయింది. దీంతో రైళ్ల రాకపోకలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిలిపివేశారు.అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులుచేపడుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో 39 చెరువులు, కాలువలు గట్లు తెగిపోగా, పలుచోట్ల బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల 86 వరకు కుంటలకు, చెరువులకు బుంగలు పడ్డాయి. అవుసులపల్లి, ముద్దుల్ వాయి, రాయన్ పల్లి, తొగిట, బూరుగుపల్లి, హవేలీ ఘన పూర్, ముత్తయిపల్లి, వాడి గ్రామాలలో చెరువుగట్టులు, కెనాల్, బ్రిడ్జిలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు ఈఈ శ్రీనివాసరావు, డిఈ శివనాగరాజు,ఏఈ విక్రమ్ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వరుణుడి దెబ్బకు మెదక్ జిల్లాలో పంట నష్టం భారీగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంకా వరదలు కొనసాగుతుండటంతో పంట నష్టాన్ని అధికారులు అంచనా వేయాల్సి ఉంది.

**ఏడు గ్రామాలు జల దిగ్బంధం.. రాకపోకలు బంద్**

వరుణుడి ప్రతాపానికి ఏడు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏడు గ్రామాల ప్రజలకు పక్క ప్రాంత ప్రజలతో పూర్తిగా సత్సంబంధాలు తెగిపోయాయి. మెదక్ నుండి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి భారీ వర్షాలకు కోతకు గురై కొట్టుకపోవడంతో శివ్వాయిపల్లి,మక్త భూపతిపూర్, మల్కాపూర్ తండా,తిమ్మానగర్, వెంకటాపూర్, మల్కాపూర్, గుట్ట కింద పల్లి, రాయన్ పల్లి గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.రాయన్ పల్లి, కోంటూరు పెద్ద చెరువు అలుగు పోస్తుండటంతో గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.

## శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూల్చివేత



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు ప్రభుత్వ ప్రైమరి పాఠశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాధికారి హరిప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల భవనాన్ని జెసిబి సహాయంతో కూల్చివేశారు.సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే భవనాలను కూల్చివేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

## చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: విద్యార్థులు చదువుతో పాటు పలు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్య ఎంత అవసరమో క్రీడలు అంతే ఉపయోగమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని పేర్కొన్నారు. క్రీడా పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్మీలో సేవ చేసిన అనంతరం ఆయన ప్రత్యేక శ్రద్ధతో హాకీలో గోల్డ్ మెడల్ సాధించారని గుర్తు చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ రావు, హర్మిందర్ సింగ్, చరణ్, భరద్వాజ్, సుమంత్‌రావు, కోట రామస్వామి, శంకరయ్య, శ్రీనివాస్, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ వేణు గోపాల్, హెచ్‌ఎం శ్రీనివాస్, హాకీ అసోసియేషన్ సెక్రటరీ ఎండి తారిక్ అలీ, క్రీడాకారులున్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏసిపి



ప్రజాపక్షం/కొహెడ: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ ఏసిపి సదానందం అన్నారు.శుక్రవారం బస్వాపూర్ గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలు అందులో ఒకటి సోలార్ సిస్టంతో ఏర్పాటు చేసిన వాటిని ఏసిపి సదానందం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ డివిజన్ పరిధిలో అన్ని గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు.సీసీ కెమెరాలు ఉన్న చోట నేరస్తులు నేరం చేయడానికి వెనుకడుగు వేస్తారని, ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటి రక్షణ కల్పించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు.సైబర్ నేరాల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా అవసరం మీదకే ఉపయోగించుకోవాలని తెలిపారు.గంజాయి ఇతర మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం చాలా ముఖ్యమని తెలిపారు.ముఖ్యంగా యువకులు, విద్యార్థులు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు వారిని ఎప్పటికి అప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.గ్రామంలో ఏవైన చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.అనంతరం ఏసీపీ సదానందం కొహెడ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, కొహెడ ఎస్‌ఐ అభిలాష్, ఏఎస్‌ఐలు బాలగంగాధర్ తిలక్, కనకయ్య, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం : గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్, మెట్‌పల్లి సిఐ అనిల్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా భారీ వర్షాల దృష్ట్యా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో జగిత్యాల జిల్లా ఎర్దండి గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, మెట్‌పల్లి సిఐ అనిల్ కుమార్‌లు వేరువేరుగా గోదావరి నదిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బర్ల కాపరులందరిని, గొర్రెల కాపరులందరిని,మత్స్యకారులను గోదావరి నది వైపు వెళ్లకుండా గ్రామ మైక్‌లో చాటింపు చేయించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వరద ఎక్కువ వస్తే ముంపుకు గురయ్యే కాలనీలోని ఇండ్లలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గాని వారి బంధువుల ఇండ్లలో ఉండే విదంగా చూడాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట తహశీల్దార్ వర ప్రసాద్, ఎంపిడివో మహమ్మద్ సలీం, ఎస్సై అనిల్ కుమార్, ఆర్‌ఐ రమేష్, కార్యదర్శి మనోజ్, కారోబార్ రతన్, అధికారులు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సంక్షేమ బోర్డు కోసం సంఘటితం కావాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి : హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం కార్మికులు సంఘటితం కావాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం, అన్నేడి వెంకట్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రైల్వే గుడ్ షెడ్ హమాలీల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జంగా సంపత్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కార్మిక క్షేత్రమైన పెద్దపల్లి జిల్లాలో వేల సంఖ్యలో హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని కార్మికులకు భద్రత, భరోసా, సమాన పనికి సమాన వేతనం, కనీస సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, హమాలీలకు గుర్తింపు కార్డులు ఇచ్చి భద్రత భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అన్ని జిల్లాలలో మార్కెట్ యార్డ్లు, రైస్ మిల్లులు, సిడబ్ల్యుసి, ఎస్ డబ్ల్యూ సి గోదాములు, రైల్వే గుడ్ షెడ్ లు, బజార్, వివిధ సంస్థలు, స్థలాలు ప్రదేశాలలో బరువులు బస్తాలు మోస్తున్న హమాలీ కార్మికులందరిని సంఘటితం చేస్తూ ప్రతి జిల్లాలో సభలు సమావేశాలు నిర్వహిస్తూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తూ స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తూ మెమోరాండాలు అందజేస్తున్నామని, ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, వరంగల్, మంచిర్యాల్, బెల్లంపల్లి, జగిత్యాల జిల్లాలలో మహా సభలు నిర్వహించినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వచ్చే నెలలో పెద్ద ఎత్తున జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు జంగా సంపత్ యాదవ్, కామ భూమన్న, కొమ్ము మధు, కీసరి సదయ్య, చంద్రయ్య, బండారి రమేష్, కొమ్ము సందీప్, తిరుపతి, రవి, అంబటి శంకర్, పాల్గొన్నారు.

## డెంగీతో బాలుడు మృతి



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: డెంగీ వ్యాధి సోకి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోనగిరి యశ్వంత్(10) గత నాలుగు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతూ ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సాపొంతుతున్నారు. గురువారం తీవ్ర జ్వరంతో బాధపడుతున్న క్రమంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇటీవలనే సమీప గ్రామమైన తిమ్మాపూర్‌లో డెంగీతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మరువక ముందే అనంతసాగర్‌లో బాలుడు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతుంది. గ్రామాలలో పడకేసిన పారిశుద్ధ్యం ఫలితంగానే డెంగీ వ్యాధి విజృభిస్తుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ
# తుది ఓటర్ జాబితా!

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గ్రామ పంచాయతీ ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్ట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్ డేట్ చేయడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని 263 గ్రామ పంచాయతీల పరిధిలోని 2432 వార్డులలో 4,04,209 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆగస్టు 28న విడుదల చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ వారిగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఈ జాబితా పరిశీలించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 30 లోపు తెలియజేయాలని , ఆగస్టు 31 లోపు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు.ప్రతి మండలం పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2432 డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో ఆగస్టు 28న తయారు చేశారని, వీటిపై అభ్యంతరాలను ఆగస్టు 30 లోపు ఎంపిడిఓ కార్యాలయంలోఅందించాలని అన్నారు. సెప్టెంబర్ 2న తుది పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎరువుల సరఫరాలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్‌లోని యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులు వందల సంఖ్యలో బారులు తీరారు. శుక్రవారం యూరియా వస్తుందన్న సమాచారం మేరకు యూరియా కోసం పంపిణీ కేంద్రం వద్ద ఉదయం 7 గంటల నుండి అధిక సంఖ్యలో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో క్యూలైన్లో నిలబడ్డారు. ఆయితే కేవలం 560 బస్తాలు మాత్రమే యూరియా రావడంతో క్యూలైన్లో ఉన్న సగం మందికి యూరియా అందక తిరుగు ముఖం పట్టారు. సకాలంలో ఎరువులు అందక సాగు చేసిన పంటల్లో ఎదుగుదల లేక దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో ఎరువుల కొరత ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా రైతులకు సరిపడ రసాయణ ఎరువులు సరఫరాలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం చెందిందని బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో రైతులు పొలాలు విడి ఎరువుల దుకాణాల వద్ద క్యూలైన్లో నిలబడవల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు.



## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఏసిపి శ్రీనివాస్



ప్రజాపక్షం/జమ్మికుంట: గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు పరిశీలించినట్లు హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి తెలిపారు. శుక్రవారం జమ్మికుంట నాయిని చెరువు వద్ద నిర్వహించే నిమజ్జనం చేస్తున్న స్థలాన్ని పరిశీలించి మున్సిపల్ అధికారులకు, స్థానిక పోలీసు అధికారులకు ఏసిపి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తయ్యేలా మున్సిపల్, పోలీస్ సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. ఆయన వెంట జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## చదువు వయస్సుకు అడ్డంకి కాదు



కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/శంకరపట్నం: చదువు వయస్సుకు అడ్డంకి కాదు అని, మహిళలు చదువుకుంటేనే కుటుంబం బాగుపడుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శంకరపట్నం మండలం వంకాయ గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన శుక్రవారం సభలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. చిన్నారులు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చదువుకు వయస్సు అడ్డంకి కాదని, చదువుకోని మహిళలు ఓపెన్ టెన్త్ , ఇంటర్ జాయిన్ కావాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు చదువుకుంటేనే ఆ కుటుంబం బాగుపడుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్య కేంద్రం సద్వినియోగం చేసుకోవాలని , ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని మందులు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేసుకుని మెడికల్ దుకాణాలలు మందులు కొనుగోలు చేసి ఆర్థిక ఇబ్బందులు పడవద్దని సూచించారు. పేదలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం 45 రకాల వైద్య పరీక్షలు చేపట్టిందని, మహిళలు వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ కాన్పులు చేపిస్తున్న వైద్యాధికారి శ్రావణ్ కుమార్‌ను అభినందించారు. పోషణ లోపాలు ఉన్న చిన్నారులను ఎన్నారిసిలో చికిత్స చేయించాలని వైద్యాధికారిని ఆదేశించారు. ప్రతి ఆరు మాసాలకు మహిళలు ఒక సారి ఫుల్ బాడీ చెకప్ చేయించుకోవాలన్నారు. లేకుంటే మొత్తం అనారోగ్యానికి గురై భూములన్నీ ప్రైవేట్ ఆస్పత్రిలో లక్షలు ఖర్చు చేసి వైద్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవం అయిన అనూషకు చీరను బహుకరించారు. కార్యక్రమంలో సిడిపివో శ్రీమతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, తహసీల్దార్ సురేఖ, ఎంపిడివో కృష్ణ ప్రసాద్, ఎంఈవో లక్ష్మీ నారాయణ, ఎంపివో ప్రభాకర్, డిప్యూటీ డిఎంహెచ్‌వో చందు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు నష్టపోయిన
# రైతాంగాన్ని ఆదుకోవాలి



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వరదల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కలెక్టర్ హైమావతికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల వల్ల అనేక గ్రామాల్లో పంటలు మునిగిపోయి పంటలన్ని ఇసుక, బురదతో నిండిపోయాయని, దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారని, దీనిపై అధికార యంత్రాంగం సర్వే చేయాలని, కొన్ని గ్రామాల్లో భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయి పునరావాసం లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వారిని ఆదుకోవాలని, మరికొన్ని చోట్ల చెరువు కట్టలు తెగిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే వాటిని మరమ్మత్తులు చేయించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల రూపాయలు పంట నష్టపరిహారం అందించాలని కోరారు.దీనిపై కలెక్టర్ స్పందిస్తూ భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన పరిణామాలను నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి తగిన సహాయం అందెలా చొరవ తీసుకుంటామని కలెక్టర్ అన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ నేతలకు
# కలెక్టర్ సమీక్ష సమావేశం




ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ , రెవెన్యూ అబ్దుల్ హమీద్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో 508 గ్రామపంచాయతీలలో 4508 పోలింగు స్టేషన్‌లలో 1.07.2025 తేది వరకు 6,55,958 ఓటర్లు ఉన్నారని, ఈ 508 గ్రామపంచాయతీలలో ఓటర్ లిస్ట్ పబ్లిష్ చేయడం జరుగుతుందని, వేరువేరుగా ఇంటి నెంబర్ ఉన్న కుటుంబ సభ్యులను ఒకే వార్డు చేర్చి సవరణ చేయడం జరిగిందని డెత్ అయిన వారి లిస్ట్‌లో మార్కింగ్ చేసి డెత్ అని వస్తుందని తెలిపారు.ఈ ఓటర్ జాబితాపై ఇతరత్రా ఎలాంటి సందేహాలు ఉన్నట్లయితే ఆయా గ్రామపంచాయతిలో లేదా మండల ఎంపిడిఓ కార్యాలయంలో అప్లికేషన్ పెట్టుకోవాలని తెలిపారు.ఈ కార్యాక్రమంలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి దేవకీ దేవి, వివిధ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/ధర్మపురి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఫార్మసి విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యులకు ఆదేశించారు. ఆసుపత్రికి వస్తున్న ఇన్, ఔట్ పేషంట్‌ల వివరాలను ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఔట్ పేషంట్లలో వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. రోగి లక్షణాలు రికార్డు చేయాలని, ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు వీలు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఆర్‌ఎంఓ డాక్టర్ రామకృష్ణ, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో రవీందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీంను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం గల్లంతు అయ్యారు. ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్య శాఖ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగువ మానేరు ప్రవహించే మండలాల్లోని చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నర్మాల నుంచి గంభీరావుపేట వరకు, గంభీరావుపేట నుంచి మల్లారెడ్డిపేట వరకు, మల్లారెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు, వెంకటాపూర్ నుంచి సిరిసిల్ల వరకు, సిరిసిల్ల నుంచి మధ్య మానేరు రిజర్వాయర్ వరకు వెతకాలని ఒక్కో ప్రాంతానికి ఐదుగురితో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ సభ్యులు వెంటనే తమ విధి నిర్వహణను మొదలు పెట్టాలని ఆదేశించారు.

## నాడు విద్యార్థిగా.. నేడు ఎమ్మెల్యేగా శంకుస్థాపన

ఎమ్మెల్యే విజయ రమణారావు



ప్రజా పక్షం/సుల్తానాబాద్ : విద్యార్థిగా విద్యను అభ్యసించి నేడు ఎమ్మెల్యేగా నూతన భవనానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉంది అని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు నూతనంగా రూ.1 కోటి 40 లక్షల నిధులతో 9 గదుల నిర్మాణానికి గాను శుక్రవారం ఎమ్మెల్యే విజయ రమణారావు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను సుల్తానాబాద్ లోని ఈ ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజ్ పూర్వ విద్యార్థి కావడం గర్వంగా ఉందన్నారు. ఇదే హైస్కూల్ నాటి విద్యార్థిగా ఇప్పుడు ఇదే హైస్కూల్ భవనాలకు శంకుస్థాపన చేయడం, అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. హైస్కూల్, కాలేజ్ ని ఎంత సాధ్యమైతే అంతవరకు అభివృద్ధి చేస్తానని అన్నారు. హైస్కూల్ లో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంతటి అన్నయ్య గౌడ్, ప్రకాష్ రావు, హెచ్‌ఎం రత్నాకర్ రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, ఎంఈఓ రాజయ్య, రమేష్, శ్రీగిరి శ్రీనివాస్, అబ్బయ్య గౌడ్, సతీష్, పన్నాల రాములు, ఎం రవీందర్, కుమార్ కిషోర్, అమిరిశెట్టి రాజలింగం, అమిరిశెట్టి తిరుపతి, పల్లా సురేష్, పడాల అజయ్ గౌడ్, సత్యనారాయణ రావు, నన్ను, మొబీన్, చందు, కాలేజీ ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## కెటిఆర్ విమర్శలు మానుకో...

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్లా ఎమ్మెల్యే,బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాట నర్సయ్య విమర్శించారు.సింగ సముద్రం పరిధిలోని ఏడుగ్రామాలలో 2500 ఎకరాల భూమికి జీవనాధారంగా ఉందన్నారు.నర్మాలలో కేటీఆర్ చేసిన ప్రభుత్వం తీరుపై విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.రెండుమార్లు అధికారంలో ఉండి తొమ్మిదో ప్యాకేజి పనులను పూర్తిచేయలేదని అసమర్థ ఎమ్మెల్యేగా మిగిలిపోయారని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాలం కలిసొచ్చిందని పార్టీ అధ్యక్షులు సింగసముద్రానికి హారతినిచ్చి జల్లి పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు వంగగిరిధర్‌రెడ్డి, గౌస్, ఏఎంసీ సబేరా బేగం,చెన్ని బాబు కాంగ్రెస్ నాయకులు వెంటున్నారు.

క్రీడ

# ఆశలు ఆవిరి..

## సింధుకు షాకిచ్చిన తొమ్మిదో సీడ్!



బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో దూసుకెళ్తున్న పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పతకంపై ఆశలు రేపిన తెలుగు తేజం అనూహ్యాగా క్వార్టర్ ఫైనల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఉత్కంఠగా సాగిన పోరులో తొమ్మిదో సీడ్ పుత్రి కుసుమ వర్దానీ (ఇండోనేషియా) చేతిలో ఐదుసార్లు ఛాంపియన్ అయిన సింధు ఓటమిపాలైంది. దాంతో.. మరోసారి మెగా టోర్నీలో టైటిల్





సాధించకుండానే సింధు ఇంటిదారి పట్టింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో జోరు చూపిస్తున్న సింధు క్వార్టర్ ఫైనల్లో చేతులెత్తేసింది. పదహారో రౌండ్‌లో రెండో సీడ్‌ను చిత్తు చేసిన ఒలింపిక్ విజేత.. ఇండోనేషియా షట్లర్ మర్దానీకి పోటీ ఇవ్వలేకపోయింది. తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించిన వర్దానీ 21–14తో ముందంజ వేసింది. అయితే.. రెండో సెట్‌లో గొప్పగా పోరాడిన సింధు ప్రత్యర్థికి షాకిస్తూ 21–13తో సెట్ గెలిచింది. దాంతో, మ్యాచ్ మూడో సెట్‌కు వెళ్లింది. అయితే.. నిర్ణయాత్మక సెట్‌లో భారత షట్లర్ దూకుడుగా ఆడలేకపోయింది. ఫలితంగా 16–21తో సెట్‌తో పాటు సెమీఫైనల్ బెర్తును చేజార్చుకుంది సింధు. దాంతో, ఈ పోటీల్లో ఆరోసారి ఛాంపియన్‌గా నిలవాలనుకున్న ఆమె



కలలు కల్లలయ్యాయి. ఈ టోర్నీలో భారత స్టార్ గతంలో ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది. జాంగ్ నింగ్ (చైనా) తర్వాత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అత్యధికంగా ఐదు పతకాలు గెలుపొందిన రెండో షట్లర్ సింధునే కావడం విశేషం.

### తనీషా, ధ్రువ్ జోడీకి చుక్కెదురు

మిక్స్‌డ డబుల్స్‌లోనూ తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల జోడీ కూడా ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. పదహారో రౌండ్‌లో ఐదో సీడ్ జంటపై సంచలన విజయంతో ఆశలు రేపిన ఈ జోడీ సైతం క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన పోరులో నాలుగో సీడ్ జంట చెన్ తంగ్‌జీ, తో ఇవీ(మలేషియా) చేతిలో పరాజయం పాలైంది భారత ద్వయం. దాంతో, ఈ టోర్నీలో పతకం గెలిచిన మూడో భారత జంటగా రికార్డు నెలకొల్పే అవకాశాన్ని చేజార్చుకున్నారు తనీషా, ధ్రువ్.

## టీమిండియా చేతుల్లో చైనా చిత్తు

### హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్

స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. ఆరంభ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాకు షాకిస్తూ పాయింట్ల ఖాతా తెరిచింది టీమిండియా. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగగా ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. సారథి జోరుకు జుగురాజ్ సింగ్ గోల్ కూడా తోడవ్వడంతో 4–3తో మ్యాచ్‌ను ముగించిన టీమిండియా గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచింది. రాజ్‌గిర్ వేదికగా ప్రారంభమైన ఆసియా కప్‌లో భారత పురుషుల హాకీ జట్టు అదిరే ఆటతో చైనాను మట్టికరిపించింది. గ్రూప్ దశలోని తొలి పోరులో ఆట మొదలైన కాసేపటికే ప్రత్యర్థి జట్టు తొలి గోల్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయినా సరే ఒత్తిడికి లోనవ్వని భారత బృందం టాప్ గేర్‌లో ఆడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చైనా డిఫెన్స్‌ను ఛేదిస్తూ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు.

చైనా ఆటగాళ్లు సైతం మరో రెండు గోల్స్ చేయడంతో స్కోర్లు సమం అయ్యాయి. ఉత్కంఠ నెలకొన్న వేళ.. జుగ్‌రాజ్ సింగ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపడంతో టీమిండియా ఆటగాళ్లు సంబురాలు చేసుకున్నారు. ఈ మెగా టోర్నీలో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిస్తే ఈ ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ బెర్తు కైవసం చేసుకుంటుంది.

### జూరిచ్ డైమండ్ లీగ్ ఫైనల్లో..

## నీరజ్ చోప్రాకు రెండో స్థానం

ప్రపంచ చాంపియన్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. జూరిచ్‌లో జరిగిన డైమండ లీగ్ ఫైనల్లో రెండో స్థానంలో నిలిచాడు. 85.01 మీటర్లు జావెలిన్‌ను విసిరాడు.

అయితే జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ ఆ టోర్నీలో టాప్ ప్లేస్ కొట్టేశాడు. అతను తన జావెలిన్‌ను 91.51 మీటర్ల దూరం విసిరాడు. రెండో ప్రయత్నంలోనే అతను ఆ మార్క్ దాటేశాడు. తొలి రెండు ప్రయత్నాల్లోనూ వెబర్ 91 ప్లస్ మీటర్ల దూరానికి జావెలిన్‌ను విసిరాడు. జూరిచ్‌లో నీరజ్ పర్ఫార్మెన్స్ సరిగా సాగలేదు. ఆరంభంలో రెండు సార్లు 80 మీటర్ల దూరం వరకే తన త్రో వేశాడు. ఆ తర్వాత మూడు సార్లు ఫౌల్స్ తో నిరాశకు గురి చేశాడు. అయితే చివరి ప్రయత్నంలో అతను 85 మీటర్ల దూరం విసిరి ఊపిరి పీల్చుకున్నాడు. వరుసగా 26 టోర్నీల్లో నీరజ్




చోప్రా తొలి రెండు స్థానాల్లో నిలవడం గమనార్హం.

2012 లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన ట్రినిడాడ్ టొబాగో త్రోయర్ కేషార్న్ వాల్కాట్ 84.95 మీటర్లు విసిరి మూడవ స్థానంలో నిలిచాడు.

ఫోకస్ సైన్స్

## ఊహాతీతమైన బ్లాక్‌హోల్




అత్యంత విస్తారమైన బ్లాక్‌హోల్‌ను 'కాస్మిక్ బెహెమోత్'గా పేర్కొంటారు. అలాంటి ఒక అతిపెద్ద బ్లాక్‌హోల్‌ను కనుగొన్నట్టు ఇంగ్లాండ్‌లోని పోర్ట్స్‌మౌత్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రకటించారు. వారి అధ్యయన వివరాలను అనుసరించి, కొత్తగా కనిపెట్టిన ఈ బ్లాక్‌హోల్ ఊహాతీతమైనది. ఎందుకంటే, ఇది 36 బిలియన్ సూర్యుల ద్రవ్యరాశి కలిగి ఉంది. ఈ భారీ కాల రంధ్రం పరిమాణం విశ్వంలో సాధ్యమయ్యే సైద్ధాంతిక భారీ కృష్ణ బిలాల పరిమితికి చాలా దగ్గరగా ఉంది. ఈ కొత్త కృష్ణ బిలం మన పాలపుంత గెలాక్సీ మధ్యలో ఉన్న కృష్ణ బిలం కంటే 10,000 రెట్లు బరువుగా ఉంటుంది. ఈ సూపర్ మాసివ్ కృష్ణ బిలం భూమి నుండి ఐదు బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. కాస్మిక్ హార్స్‌షూ వ్యవస్థలోని ఒక పెద్ద గెలాక్సీ మధ్యలో దీనిని గుర్తించారు. గురుత్వాకర్షణ లెన్సింగ్ ద్వారా ఏర్పడిన దాని అద్భుతమైన గుర్రపు నాడా ఆకారపు కాంతి వలయానికి కాస్మిక్ హార్స్‌షూ అని పేరు. 'ఇది ఇప్పటివరకు శాస్త్రవేత్తలు గుర్తించిన టాప్ 10 అత్యంత భారీ బ్లాక్ హోల్స్‌లో ఇది ఒకటి. బహుశా ఇది మిగతా వాటి కంటే అత్యంత భారీది కూడా కావచ్చు' అంటున్నారు పోర్ట్స్‌మౌత్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ థామస్ కోల్లెట్. ఆయన అభిప్రాయాన్ని అనుసరించి, ఇతర కృష్ణ బిల ద్రవ్యరాశి కొలతలు చాలావరకు పరోక్షంగా ఉంటాయి. ఎక్కువ శాతం అనిశ్చితుల మధ్య వాటి అంచనాలు కొనసాగుతాయి. కాబట్టి, ఏ కృష్ణ బిలం అతి పెద్దదో ఖరారు చేయడానికి సరైన ఆధారాలు లేవు. అయితే, అధునాతన పరికరాలను ఉపయోగించి జరిపిన అధ్యయనంలో పరిశోధకులు 'కాస్మిక్ బెహెమోత్'ను కనుగొనగలిగారని అనుకోవచ్చు. గురుత్వాకర్షణ లెన్సింగ్, నక్షత్ర కైనమాటిక్స్ (గెలాక్సీలలోని నక్షత్రాల కదలిక, అవి కాల రంధ్రాల చుట్టూ తిరిగే వేగం యొక్క అధ్యయనం) కలయికను ఉపయోగించి పరిశోధకులు కొత్త బ్లాక్‌హోల్‌ను అతిపెద్దదిగా భావిస్తున్నారు. కాగా, విశ్వంలోని ప్రతి గెలాక్సీ మధ్యలో ఒక సూపర్ మాసివ్ బ్లాక్ హోల్ ఉంటుందని, పెద్ద గెలాక్సీలు సూపర్ మాసివ్ బ్లాక్ హోల్స్ అని పిలిచే పెద్ద వాటిని కలిగి ఉంటాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత సిద్ధాంతాలు విశ్వంలోని మొదటి నక్షత్రాల (కాంతి విత్తనాలు) కూలిపోవడం ద్వారా లేదా ప్రత్యక్ష వాయు మేఘాల కూలిపోవడం (భారీ విత్తనాలు) ద్వారా ఏర్పడిన ప్రారంభ 'సీడ్స్' నుండి సూపర్‌మాసివ్ బ్లాక్ హోల్‌లు ఉద్భవించాయి. అయితే, ఈ సిద్ధాంతాలకు ఇప్పటివరకు ప్రామాణికమైన లేదా పరిశీలనాత్మక ధ్రువీకరణ లేదు. ఇలావుంటే, గత సంవత్సరం నవంబర్‌లో, శాస్త్రవేత్తలు ఒక సూపర్ మాసివ్ బ్లాక్ హోల్‌ను కనుగొన్నారు. ఇది అసాధారణ రేటుతో పదార్థాన్ని మింగివేస్తోందని గుర్తించారు. ఎడింగ్టన్ పరిమితి అని పేర్కొనే సైద్ధాంతిక పరిమితికి ఇది 40 రెట్లు ఎక్కువ.

## విశ్వం విస్తరణ

విశ్వం విస్తరణకు కృష్ణ శక్తి కాదు... కృష్ణ బిలాలు కారణమని ఇటీవల ఒక అధ్యయనం పేర్కొంది. చాలా కాలంగా, శాస్త్రవేత్తలు 'ఇన్‌ఫ్లేషన్ యూనివర్స్' సిద్ధాంతాన్ని విశ్వసిస్తున్నారు. ఇది దాదాపు 14 బిలియన్ సంవత్సరాల క్రితం, బిగ్ బ్యాంగ్ ప్రారంభంలో, చీకటి శక్తిగా నమ్ముతున్న ఒక మర్మమైన శక్తి. విశ్వం ప్రారంభ విస్తరణను ఇది వేగవంతం చేసిందని అంచనా. అయితే, ఈ కొత్త అధ్యయనం ఈ భావనను సవాలు చేస్తున్నది. డార్క్ ఎనర్జీ స్పెక్ట్రోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ (డిఇఎస్ఐ) నుండి డేటాను విశ్లేషించిన తర్వాత, శాస్త్రవేత్తలు కాల రంధ్ర ద్రవ్యరాశి పెరుగుదలకు, కాలక్రమేణా పెరుగుతున్న చీకటి శక్తి సాంద్రతకు మధ్య పరస్పర సంబంధం ఉందని గుర్తించారు.



## గ్రహాల్లో ఇమిడిపోయే డార్క్ మ్యాటర్!



డార్క్ మ్యాటర్ కణాలు ఒకదానితో ఒకటి ఢీకొట్టుకొని, నాశనం కాకపోతే, అవి క్రమంగా ఒక గ్రహం అంతర్భాగంలో ఇమిడిపోతాయి. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం పరిశోధకులు తాజా నివేదికను అనసరించి కొన్ని భారీ ఎక్సోప్లానెట్లలో అత్యంత బలమైన, అద్వితీయ శక్తిగల గురుత్వాకర్షణను కలిగి ఉండవచ్చు. అది కృష్ణ పదార్థం లేదా డార్క్ మ్యాటర్‌తో ఘర్షణ పడినప్పుడు కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఏర్పడతాయి. భారీ ఎక్సోప్లానెట్స్‌లో డార్క్ మ్యాటర్ కణాలు పేరుకుపోతూ, ఒక దశలో గురుత్వాకర్షణకు లొంగిపోయి, చిన్న కృష్ణ బిలంలా కుప్పకూలుతాయి. తర్వాత, అదే కృష్ణ బిలం క్రమంగా ఆ ఎక్సోప్లానెట్‌ను కబళించడం మొదలుపెడుతుంది. అయితే, ఈ సిద్ధాంతాన్ని పూర్తిగా సత్యమని అనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే, డార్క్ మ్యాటర్ కణాలు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు నాశనమైతే, అవి తగినంత సంఖ్యలో ఒకే దగ్గర చేరవు. అప్పుడు, ఎక్సోప్లానెట్‌లోకి డార్క్ మ్యాటర్ కుప్పకూలే ప్రక్రియ జరగదు. అంతేకాదు, ఈ ప్రయాణం ఎదో ఒక రకమైన విధ్వంసం కారణంగా, నిరంతరం కొనసాగే అవకాశాలు కూడా ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో, కొత్తగా ఏర్పడిన కృష్ణబిలం హాకింగ్ వికిరణం ద్వారా ఆవిరైపోతుంది. మరికొన్ని సందర్భాల్లో మాత్రం, గ్రహం లోతుల్లో రహస్యంగా కొనసాగుతుంది. దీనిని బట్టి, తాజా పరిశోధన డార్క్ మ్యాటర్‌పై ఒక కొత్త దారిని మాత్రమే చూపిస్తుంది. ఎక్సోప్లానెట్ల శాస్త్రానికీ ఒక విశ్వ గూఢమయమైన ఉన్నదనే ఆలోచనకు బీజం వేస్తున్నది. అంటే దూరమైన కొన్ని ప్రపంచాలు ఇప్పటికే కృష్ణబిలాలుగా మారి ఉండవచ్చని సూచిస్తుంది. భవిష్యత్తులో, శాస్త్రవేత్తలు టెలిస్కోపులు, ఇతరత్రా సర్వేల ద్వారా ఈ సిద్ధాంతాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాలి. ఉదాహరణకు, దూరంలోని వాయు మహాగ్రహాలలో కనిపించని గమనప్రవేశాలు లేదా అసాధారణంగా పెరిగిన తాపన వంటి సంకేతాలను గుర్తించడం ద్వారా పరీక్షించవచ్చు.

# ఆదివాసీ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్యం అందక విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం పాలకులు తలవంచుకునే పరిస్థితి అని ఆయప అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో కలుషిత నీరు, దోమల కారణంగా డెంగ్యూ వంటి విషజ్వరాలు విస్తరిస్తున్నాయని, ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించకపోతే పరిస్థితి మరింత తీవ్రం అవుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే ఉమ్మడి



ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాని మండలం పంగిడి మాదార గ్రామం ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదివే ఆత్రం అనురాగ్ ఎంజిఎం ఆసుపత్రిలో డెంగ్యూ జ్వరంతో మృతి చెందాడని, అతని తమ్ముడు ఆత్రం అబెడ్నిగో (3వ తరగతి) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని వివరించారు. వైద్యం అందక విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ తరహా మరణాలు పునరావృతం కాకుండా మంచిర్యాల జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ఇంటింటా సర్వే చేసి వ్యాధులను అరికట్టే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. వర్షాలతో వాతావరణ మార్పులతో ఆదివాసీ గ్రామాలలో విషజ్వరాలు విజృంభిస్తున్నందున ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. మెనూ ప్రకారం పౌష్టికారమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలని, వారికి అవసరమైన మందులు అందజేయాలన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, సరిపడా మందులు సరఫరా చేయాలని కలవేన శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, ఖలిందర్ అలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, ఇప్పకాయల లింగయ్య, జోగుల మల్లయ్య, లింగం రవి, మిరియాల రాజేశ్వర్‌రావు, ముస్కే సమ్మయ్య, మిట్టపల్లి పౌలు, చాడా మహేందర్ రెడ్డి, కొత్తపల్లి మహేష్, మొగిలి లక్ష్మణ్, నర్సయ్య, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# సురవరం మరణం ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** సిపిఐమాజీ జాతీయ ప్రధానకార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సమావేశం శుక్రవారం యాదగిరిగుట్ట పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్టు పార్టీలకు, కార్మిక, కర్షక, ప్రజాతంత్రశక్తులకు, పేదప్రజలకు తీరనిలోటు అన్నారు. నల్లగొండ ఎంపిగా సుధాకర్‌రెడ్డి దేశస్థాయిలో చేనేత కార్మికుల సమస్యలపైన మాట్లాడారని ముఖ్యంగా ఫ్లోరైడ్ రైతు జిల్లాగా ఇక్కడ పరిస్థితులను పార్లమెంటుకు తీసుకుపోయి ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆలేరు నియోజకవర్గంలో నాటి తాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామాలలో ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌లను ఏర్పాటు చేయించి ఒక్క రూపాయికి నీటిని అందించారన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, బబ్బూరి శ్రీధర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, పేరబోయిన పెంటయ్య, ఆరె పుష్ప, పేరబోయిన బంగారి మాటూరి మల్లయ్య, మునుకుంట్ల నరసమ్మ, గోపగాని రాజు, పాకలపాటి రాజు, కంబాల వెంకటేష్, చందు నాయక్, లక్ష్మి, శ్రీను, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.



### 42 శాతం బిసి రిజర్వేషన్లతోనే

# స్థానిక సంస్థల ఎన్నికలు

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్

**ప్రజాపక్షం/హనుమకొండ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. శుక్రవారం కాజీపేట మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి సిపిఐ మండల కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్ అధ్యక్షత వహించగా భిక్షపతి హాజరై మాట్లాడారు. 42శాతం స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించిన విషయం అందరికీ తెలిసినదేనని, కానీ వచ్చే నెల 30వ తేదీ వరకు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో గతంలో అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్ 42 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థల ఎన్నికలకు కల్పిస్తామన్న హామీ అమలు చేయాలన్నారు. జనాభాలో అత్యధిక శాతం బిసిల జనాభా ఉన్నందున తప్పకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో వారికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**హైదరాబాదులో సురవరం సంతాప సభ...**

ఈనెల 30న హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగే సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ జరుగుతుందని భిక్షపతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్‌రెడ్డితో పాటు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొంటున్నారని తెలిపారు. పార్టీ, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయనకోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి, మండల కార్యదర్శి మాలోతు శంకర్‌నాయక్, కుడి స్వామి, రాసమల్ల దీన, స్వరూప తదితరులు పాల్గొన్నారు.





# కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



### సరిపడా యూరియా రైతాంగానికి సరఫరా చేయాలి

### సిపిఐ, రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/దేవరకొండ :** కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడే ఎండి. మైనోద్దిన్ విమర్శించారు. యూరియా అందుబాటులో ఉంచి రైతులను ఆదుకోవాలని శుక్రవారం దేవరకొండ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఐ, రైతుసంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో యూరియా ఉంచాలని, వర్షాకాలం అదును సమయంలో యూరియా లేకపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాకుగాను 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావడం రైతులకు సరిపోవడంలేదని, మిగిలిన 15వేల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే అందించి రైతులకు ఇబ్బందులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. యూరియా బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్న దళారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అధికారుల నిర్లక్ష్య వైఖరి వీడనాడాలన్నారు. బ్లాక్ మార్కెట్లో యూరియా అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకొని ఎడల రైతు సంఘం ఆధ్వర్యంలో పోలీసులకు పట్టించి కేసులు పెట్టిస్తామని ఆయన హెచ్చరించా రు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సుదర్శన్‌రెడ్డి, పల్లా రంగారెడ్డి, సిపిఐ నాయకులు వెంకటయ్య, పాండురంగారెడ్డి, రామస్వామి, వెంకట్రాములు, మహీనుద్దీన్, వెంగళయ్య, యాదయ్య, కృష్ణారెడ్డి, యాదవరెడ్డి, గోవర్ధన్, మహేష్, మల్లేష్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.





### యూరియా సకాలంలో అందించాలి

### ఉజ్జిని డిమాండ్

**చింతపల్లి :** గ్రామాలలోని రైతులకు యూరియా సకాలంలో అందించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులకు యూరియా సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్ధేశించి ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడు తూ గ్రామాలలో రైతన్నకు యూరియా దొరకని పరిస్థితి నెలకొందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యల పరిష్కారంలో పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన మండిపడ్డారు. గ్రామాలలో ప్రస్తుతం వరి, పత్తి సాగు చేసిన రైతన్నకు యూరియా దొరకకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టే దుస్థితి దాపురించిందని విమర్శించారు. యూరియా కొరత కారణంగా రైతుల పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు వెచ్చించి రైతులు పంటలు సాగు చేస్తుంటే ప్రభుత్వాలు యూరియా అందించకపోవడం సిగ్గుచేటన్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్న దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, ప్రజానాట్యమండలి నాయకులు పాండురంగారావు, మండల కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, యాచారం శ్రీశైలం, కొలుకులపల్లి కొండల్, జోగు శ్రీరాములు, మిడొదొడ్డి వెంకటయ్య, నరసింహా, రామకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## న్యూవిజన్‌లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో జాతీయ దినోత్సవ క్రీడా వేడకలను శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ తెలిపారు. ప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధవహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## వైద్య రంగంలో జిల్లా మరింత బలపడాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

ఉషా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించిన నేత

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణంలో వైద్యరంగం మరింత బలోపేతం కావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని ఓల్డ్ డిపో ఏరియాలో నతనంగా ఏర్పాటు చేసిన ఉషా మల్టీ స్పెషాలిటీ అండ్ డయాల్సిస్ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ప్రారంభించి ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ వైద్యశాల వివిధ జబ్బులు, ప్రాణాంతకమైన వ్యాధులు, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేదవర్గాల అధునిక వైద్యసౌకర్యం అందుబాటులోకి రావడం శుభపరిణామం అన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు కేవలం లాభాపేక్షతో కాకుండా ప్రజాసేవా భావంతో ముందుకు రావాలని, బలహీనవర్గాల ప్రజలకు తక్కువ ధరల్లో, అవసరాన్నిబట్టి ఉచిత సేవలు కూడా అందించాలన్నారు. వైద్య సేవలు అందరికీ హక్కుగా మారేలా ప్రభుత్వం కూడా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించి పేదలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, విజయ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు నయూమ్ ఖురేషి, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి.సత్యనారాయణ చారి పాల్గొన్నారు.



## పోలీసు అధికారులకు ప్రతిభా పురస్కారాలు

పోలీసు కమిషనర్ సునీల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో అందించిన ఉత్తమ సేవలకు గాను ఉత్తమ సేవా పతకాలను అందుకున్న పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పతకాలు పొందిన వైరా ఏసిపి ఎం.అబ్దుల్ రహెమాన్, ఐటికోర్ ఎస్పై పి.సత్యనారాయణతో పాటు మరో నలుగురు పోలీసు అధికారులు, వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్పైలు బి.వెంకటరమణరావు, జె.వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటరెడ్డి ఉన్నారు. అదేవిధంగా మహోన్నత సేవాపతకాన్ని హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కె.సయ్యద్ హుస్సెన్ ఉన్నారు. వీరికి సిపి సునీల్‌దత్ సేవాపతకాలను శుక్రవారం అందజేసి అభినందించారు.

## సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా?

కమిషనర్, సిసి అత్యుత్సాహం

'మీకేం పని?' అంటూ సిపిఐ నాయకులపై ఆగ్రహం



**ప్రజాపక్షం/ఖమ్మం :** సమస్యల పరిష్కారం కోసం కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసేందుకు వస్తే అరెస్టు చేయిస్తారా అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం ప్రశ్నించారు. కార్పొరేషన్‌లో సమస్యల గురించి కమిషనర్ దృష్టికి తెచ్చేందుకు సిపిఐ ప్రతినిధులుగా వెళితే కమిషనర్, సిసి అత్యుత్సాహం ప్రదర్శించారని అనవసర జోక్యం చేసుకుని రాజకీయ నాయకుని తరహాలో ప్రశ్నలు సంధించారని ఆయన తెలిపారు. శుక్రవారం కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లిన సిపిఐ నాయకులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కమిషనర్‌ను కలవడానికి వీలు లేదన్నారు. అది చాలంటూ సిసి ఇష్టానుసారంగా మాట్లాడారని సిపిఐ నాయకులు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చారిత్రక వ్యక్తుల చిత్ర పటాల నుంచి మగ్దూం మోహినుద్దీన్ ఫోటో తొలగించారని, ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకుని రాగా మగ్దూం మోహినుద్దీన్ ఎవరంటూ వ్యంగ్యంగా మాట్లాడారని సలాం తెలిపారు. తక్షణం కమిషనర్, సిసిలపై తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని సలాం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, నాయకులు నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు, శేఖర్ నాయక్, ఎస్‌కె మీరా పాల్గొన్నారు.

## క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలి

3కె రన్ ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు భవిష్యత్తులో మరింత నైపుణ్యాన్ని కనబర్చి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ సన్మానించి జ్ఞాపికలు అందించారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత 3కె రన్‌ను సర్దార్ పటేల్ స్టేడియం వద్ద అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డు, ఇందిరా నగర్ సెంటర్ నుండి జెడ్పీ సెంటర్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల పోటీల వల్ల ఆరోగ్యం, ఉల్లాసం, సాంఘిక సౌభ్రాతృత్వం పెరిగి శారీరక, మానసిక పనితీరు మరింత మెరుగవుతుందన్నారు. విద్యార్థులు ప్రతి రోజు తప్పనిసరిగా క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం అధికంగా ఉంటుందని, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఆత్మవిశ్వాసం, ధైర్యం వంటి లక్షణాలు అలవడతాయన్నారు. క్రీడల్లో ఎంపిక అవడం వల్ల విద్య, ఉద్యోగ, ఉపాధిలో మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. భారత దిగ్గజం హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ దేశానికి, క్రీడారంగానికి చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ కొనియాడారు. ధ్యాన్‌చంద్ పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో యూనెక్స్ సన్‌రైజ్ 11వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ బాల బాలకల బ్యాడ్మింట్ ఛాంపియన్‌షిప్ పోటీలను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఫొటో ఎలక్టోరల్ గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఈనెల 28న ప్రదర్శించామన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కార్యాచరణ చేశామన్నారు. అసెంబ్లీ ఓటర్లను వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఎలక్టోరల్‌పై తిరిగి కూర్పుకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోగా సంబంధిత ఎంపిడిఒకు సమర్పించాలన్నారు. అట్టి అభ్యంతరాలను ఈనెల 31న పరిష్కరించి సెప్టెంబర్ రెండున వార్డుల వారీగా గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా పబ్లికేషన్ చేయనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో 571 గ్రామపంచాయతీలకు 5,214 వార్డులు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జెడ్పి డిప్యూటీ సిఇఒ నాగ పద్మజ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** జిల్లాలో ప్రజలకు అదనపు ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం మోరంపల్లిబంజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కెనాల్ పక్కన ఉన్న నీటిపారుదల శాఖ భూమిలో నూతనంగా ఏర్పాటు చేయు మోడల్ డెమో ఫామ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ డెమో ఫామ్‌ను ఏవిధంగా అభివృద్ధిచేయాలి అనే దానిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ డెమో ఫామ్‌లో కూరగాయల సాగు, మట్టితో ఇటుకల తయారీ యూనిట్, వెదురు, వాక్కాయ కంచె, క్వాయిల్ యూనిట్ షెడ్, సోలార్ డ్రైవర్ ఏర్పాటు చేయడంతో పాటు మునగ చెట్లు పెంచే విధంగా ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ మోడల్ డెమో ఫామ్ ద్వారా రైతులకు మాత్రమే కాకుండా మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కలగడం, సరికొత్త వ్యవసాయ పద్ధతులు పరిచయం కావడం ద్వారా అదనపు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, ఆర్ఐ నరసింహారావు, ఎస్సార్ ఎల్పీ ఎఇ సందీప్, ఎంపిఒ బాలయ్య, ఎపిఒ విజయలక్ష్మి, ఎపిఎం హేమంతిని, పంచాయతీ కార్యదర్శి భవాని, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఆర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా అభ్యంతరాలు తెలపండి

జిల్లా వ్యాప్తంగా 6,69,024 మంది ఓటర్లు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కోరారు. శుక్రవారం ఐడిఒసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుతో కలిసి కలెక్టర్ ఓటర్ జాబితా తయారీ, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీల్లో మొత్తం 6లక్షల 69వేల 24 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3,25,033 కాగా మహిళా ఓటర్లు 3,43,967 మంది ఉండగా, ఇతరులు 24 మంది ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గానూ 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈనెల 30నాటికి మండల స్థాయిలో రాజకీయ పార్టీల వారు సమావేశాలు నిర్వహించుకుని అభ్యంతరాలు లిఖితపూర్వకంగా తెలపాలని, సెప్టెంబర్ 2వ తేది నుండి ఓటర్ల తుదిజాబితా ప్రచురిస్తామన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పి సిఇఒ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, కాంగ్రెస్ నుండి లక్ష్మణ్, బాల ప్రసాద్, బిఆర్ఎస్ నుండి రేగా కాంతారావు, సిపిఐ నుండి ఎస్.శ్రీనివాస్, సిపిఎం నుండి ఎ.సత్యనారాయణ, బిజెపి నుండి నరేందర్, నోముల బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి రాంబాబు పాల్గొన్నారు.

## మట్టి రోడ్లు లేని గ్రామంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** సారపాక గ్రామ పంచాయతీలో పలు కాలనీలు, పరిసర ప్రాంతాలలో మట్టి రోడ్లను సిసి రోడ్లగా తయారు చేసి చూపిస్తానని ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సుమారు రూ.85లక్షల రూపాయల అంచనా వ్యయంతో సారపాక పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ, గాంధీనగర్, భాస్కర్ నగర్, ఒడియా క్యాంపు, బొగ్గు సూర గుట్ట కాలనీ ప్రాంతాలలో పలు సిసి రోడ్లు నిర్మాణ అభివృద్ధి ప్రారంభోత్సవాలను కాంగ్రెస్ కార్యకర్తల, గ్రామస్తుల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు ప్రాంతాల ప్రజలు పలు సమస్యలు వివరించగా, సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారం మార్గం చూపుతానని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సారపాక పంచాయతీలో ఉన్నటువంటి ప్రతి మారుమూల మట్టి రోడ్లను సైతం సిసి రోడ్లుగా నిర్మాణం చేపట్టడమే కాకుండా, డ్రైనేజీ కోసం నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా విద్యుత్ సమస్య లేకుండా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి దశలవారీగా విద్యుత్ స్తంభాల నిర్మాణం చేపట్టి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి పేద ప్రజల జీవితాలు వెలుగులో ఉండే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా సందేళ్ల రామాపురం ప్రాంతంలో స్థల సేకరణ, ఐసిడిఎస్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుందని, దానికి వెంటనే నిధులు కేటాయిస్తామని స్థలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సారపాక పంచాయతీతోపాటు, మండలంలో ఉన్నటువంటి 17గ్రామ పంచాయతీలలోకూడా మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి దిశగా నిధులు కేటాయించి పూర్తి స్థాయిలో పనులు వేగవంతం చేస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు మొహమ్మద్ ఖాన్, పినపాక బి బ్లాక్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బర్ల నాగమణి, తహసీల్దార్ కెఆర్‌కెవి ప్రసాద్, మండల అభివృద్ధి అధికారి జములారెడ్డి, సిడిపిఒ రేవతి, డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ చంద్రశేఖర్, హౌసింగ్ ఇఇ సత్యనారాయణ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు ఇంగువ రమేష్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దారం రమేష్‌రెడ్డి, తిరుపతి చంటి, లాలయ్య, మహిళా నాయకురాలు రేణుక, దేవి, సిపిఐ నాయకులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతాం

డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/బోనకల్ :** రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముష్టికుంట్లలో కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో భారీ చేరికల కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ముఖ్య అతిథిగా బంధం నాగేశ్వరరావు పాల్గొని పలు కుటుంబాలకు పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో మరో మారు సత్తా చాటాలన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను ప్రభుత్వం, పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, రాజీవ్ యువ వికాసం తదితర పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం యువతకు అండగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు, ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో యువను మోసగిస్తోందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లు, షేక్ షాజహాన్, షేక్ ముస్తాఫా, షేక్ జానిమియా, అమరేసి సీతయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, మహిళ నాయకురాలు అమరేసి ప్రమీల, యూత్ అధ్యక్షులు షేక్ చాంద్‌పాషా తదితరులు అన్నారు.

## పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** వాతావరణం మార్పు వలన గ్రామాలలో వైరల్ ఫీవర్ విజృంభిస్తున్నందున హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్ సమన్వయంతో ఉండి ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూసి మెనూ ప్రకారం పౌష్టికారమైన ఆహారాన్ని అందించాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉప్పుసాకలో ఆశ్రమ పాఠశాలను సందర్శించి డార్మెటరీ, డైనింగ్ హాల్, వంటగది, సిక్ రూమ్ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పనిచేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎటువంటి విభేదాలు పెట్టుకోకుండా అందరూ కలిసికట్టుగా ఉండి విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రతి రోజు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, స్టోర్ రూమ్‌లో నాసిరకమైన ఆహార పదార్థాలు డేట్ అయిపోయినవి ఉంటే వెంటనే తీసివేయాలని, జిసిసి నుండి సరఫరా అయ్యే ప్రతి వస్తువు నాణ్యతగా ఉన్నవి తీసుకోవాలన్నారు. అనంతరం సిక్ రూమ్‌లో వైద్య సేవలు తీసుకుంటున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకొని, పిల్లలు అనారోగ్య బారిన పడినప్పుడు మెడికల్ క్యాంపులు నిర్వహించారా లేదా అని హెచ్‌ఎంని అడిగి తెలుసుకుని, పిల్లలకు రెండు మూడు రోజులు మించి జ్వరంగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పిహెచ్‌సికి తీసుకొని పోయి వైద్య పరీక్షలు చేయించి పిల్లల తల్లిదండ్రులకు, డిడి ట్రైబల్ వెల్ఫేర్, ఎటిడిఎ దృష్టికి విషయం తెలియజేయాలని అన్నారు. అనంతరం సిక్ రూమ్‌లో మందులను పరిశీలించి ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఎక్స్‌పైరీ డేట్ ఈనెలాఖరు వరకే ఉందని కొత్త స్టాక్ తీసుకోలేదా అని ఎఎన్‌ఎంని అడిగి తెలుసుకుని డేట్ అయిపోయిన మందులు ఉంటే వెంటనే తీయించి వేయాలన్నారు.

అనంతరం డిఎంహెచ్‌వోకు ఫోన్ కాల్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ ఉప్పుసాక పాఠశాలలో నిర్వహించిన మెడికల్ క్యాంపుల వివరాలు, పిల్లల ఆరోగ్య స్థితిగతులకు సంబంధించిన డేటా తనకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక పాఠశాల హెచ్‌ఎం భీమ, వార్డెన్ శశికళ, ఎస్‌సిఆర్‌పి మాధవి పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు సాధ్యం

ఎర్త్ యూనివర్సిటీ ఓరియంటేషన్‌లో కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల త్యాగాలు వృథా కానివ్వకుండా చూడాలని, శ్రద్ధతో చదివితే ఉన్నస్థానాలకు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటి ఆడిటోరియంలో నిర్వహించిన ఇంజనీరింగ్, బిఎస్‌సి మొ.సం. విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ డా.వి రామచంద్ర, జియాలీజ ప్రొ డా. మల్లిఖార్జున రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్య కోసం ఇంటి నుండి దూరంగా పంపే సమయలో అనేక అపోహలతో ఉంటారని, విద్యార్థులకు స్వేచ్ఛనిచ్చి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు, మంచి పేరు సంపాదించవచ్చని సూచించారు. ప్రతీ ఏటా ఇంజనీరింగ్ డే అంతా ఘనంగా నిర్వహించి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పిస్తామన్నారు. కానీ ఆయన ఏ కళాశాల నుండి విద్యనభ్యసించారు. వారి గురువుల గూర్చి ఎవ్వరికీ తెలియదన్నారు. 1861వ సం.లో కర్ణాటకలో జన్మించి ఇంజనీరింగ్‌లో ప్రతిభ కనబరిచి, దేశానికి గర్వకారణమై అనేక ప్రాజెక్టులను రూపొందించారన్నారు. ఆధునిక సదుపాయాలు లేనప్పటికీ ఆయన కృషి నిబద్ధతే నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ తాను విద్యనభ్యసించే సమయంలో ఎటువంటి సదుపాయాలు లేవని, కిలోమీటర్ల దూరం నడిచి చదువుకునే వారమని, కానీ మంచి ఉపాధ్యాయులు, ల్యాబ్ సౌకర్యాలు ఉండటం వల్ల నైపుణ్యం సాధించి ఈ స్థాయికి చేరుకోగలిగామని ఆయన అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు ప్రత్యక్ష అనుభవాల ద్వారా నైపుణ్యాన్ని సాధించాలన్నారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యాధునిక సదుపాయాలతో యూనివర్సిటీని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. జిల్లాల జియోలాజికల్ వైవిధ్యం ఉండటం ద్వారా యూనివర్సిటీని ఇక్కడ స్థాపించడం జరిగిందని తెలిపారు. ఇక్కడ విద్యను అభ్యసించడం ద్వారా దేశవిదేశాల్లో విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అసిస్టెంట్ ప్రొ. డా.రాము, కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కళ్యాణ లక్ష్మి చెక్ పంపిణీ



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల లక్ష్మీ పురం గ్రామానికి చెందిన వల్లపు ఉపేందర్ వెంకన్న లకు శుక్రవారం మహ బూబాబాద్ జిల్లా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అందజేశారు. ఈ కార్య క్రమంలో లక్ష్మీ పురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ నాయక్ భూక్య కిషన్ భూక్య మోహన్ పాల్గొన్నారు. అదేవిధంగా తీగల వేణి గ్రామానికి చెందిన జంపాల ధనమ్మ జంపాల వెంకటయ్యలకు సైతం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో లక్ష 116 రూపాయాల చెక్కును అందించడం జరిగింది. ఈ కార్య క్రమంలో కృష్ణా రెడ్డి మండల సీనియార్ నాయకలు గ్రామ పార్టీ అధ్యక్షుడు నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్ర రూపం

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద శుక్రవారం గోదావరి ఉగ్ర రూపం దాల్చి పరవళ్ళు తొక్కుతోంది. ఎగువలోని గోదావరి బేసిన్ ప్రాంతాల వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా ఎల్లంపల్లి జలాశయం గేట్లు ఎత్తి వరద నీటిని భారీ స్థాయిలో దిగువకు విడుదల చేయడంతో పాటు మహా రాష్ట్ర ప్రాంతాల నుండి ప్రవహిస్తున్న ప్రాణహిత వరద ఉధృతి పోటెత్తి చేర డంతో కాళేశ్వరం పుష్కర ఘాట్ తీరం వద్ద గోదావరి ఉగ్ర రూపం దాల్చి ఉరకలేస్తోంది. కాళేశ్వరం తీరం వద్ద గోదావరి వరద ఉధృతి అంతకంతకు పెరిగి 12.210 మీటర్ల నీటిమట్టం వద్ద జారీ చేసిన మొదటి ప్రమాద హెచ్చ రికను దాటి శుక్రవారం సాయంత్రానికల్లా 12.350 మీటర్ల నీటిమట్టం ఎత్తుకు చేరి వరద ఉధృతి ప్రవహిస్తోంది. వరద ఉధృతి ఇలాగే కొనసాగి 13.460 మీటర్ల నీటిమట్టానికి చేరితే అధికారికంగా డేంజర్ లెవల్ ప్రకటన జారీ కానుంది.త్రివేణి సంగమ తీరం వద్ద గోదావరి, ప్రాణహిత ఉభయ నదుల వరద ఉధృతి పోటెత్తి 9.89 లక్షల క్యూసెక్కుల వరద నీటితో ఉధృత రూపం దాల్చి దిగువకు కొనసాగుతోంది. పుష్కర ఘాట్ వద్ద స్నాన ఘట్టా లను వరద నీరు పూర్తిగా ముంచెత్తగా, సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద జ్ఞాన దీపాలను ముంచెత్తి గోదావరి జలకళను సంతరించుకుని నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుండి వరద ఉధృతి పోటెత్తడంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పూస్కుపల్లి, బలిజాపూర్, చంద్రుపల్లి, అన్నారం తదితర లోతట్టు ప్రాంతాల పంట చేలు నీట మునిగాయి.

## సురవరం సైద్ధాంతిక నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** సురవరం సుధాకర్ రెడ్డి నిరాడం బరత, పోరాట పటిమ ,సైద్ధాంతిక నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తి దాయక మని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు సిపిఐ కురవి మండల పార్టీ కార్యాలయంలో సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి చి త్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఉద్యమాల బాట పట్టి వి ద్యార్థి, యువజన సంఘాల జాతీయ కార్యదర్శిగా, అధ్యక్షునిగా సమరశీల పోరాటాలు నిర్వహించాచారని, సిపిఐ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వ హిస్తూ, నల్గొండ పార్లమెంట్ సభ్యునిగా ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తూ, పార్లమెంట్ లో తమ ప్రసంగాలతో అందరినీ ఆకట్టుకుని అనేక స్టాండింగ్ కమిటీల్లో పనిచేశారన్నారు. దేశ వ్యాప్తంగా ఎందరో విద్యార్థి, యువకులనుతమ వాగ్ధాటితో ఉద్యమాల వైపు ఆకర్షించారని, వేలాది మంది ప్రజలను తమ రాజకీయ నిబద్ధతతో ఆదర్శ పాయలుగా నిలిచి, లక్ష లాది మంది కార్యకర్తలలో ఉద్యమ స్ఫూర్తిని నింపారని ఆయన కొనియా డారు. ఈ సమావేశంలో సిపిఐ కురవి మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, నిలి గొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్



**ప్రజాపక్షం/గూడూరు:** కాంగ్రెస్ ది ప్రజా ప్రభుత్వం అని గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ చేసి చూపి స్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకలు బుడిగె సతీష్ గౌడ్ అన్నారు. మహ బూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్‌ను బ్రాహ్మ ణపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకలు మార్మాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యకరమాలపై చర్చించిన అనంతరం బుడిగే సతీష్ గౌడ్ మాట్లాడుతూ పేదలు గిరిజనలు అధికంగా ఉండే బ్రహ్మణపల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎక్కువ శాతం అవకాశం ఇవ్వడం జరిగిందిని అంతే కాకుండా మరికొన్ని కూడా ఇవ్వలని ఎమ్మెల్యేను కోరారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బ్రహ్మణపల్లి గ్రామంలో చేపడుతుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా బ్రహ్మణపల్లి గ్రామం తరపున ఎమ్మెల్యే మురళినాయక్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఒకసారి తమ గ్రామాన్ని సందర్శించాలని ప్రేమపూర్వకంగా ఆహ్వానిం చడం జరిగింది. కాంగ్రెస్ నాయకలు భూపతి శ్రీనువాస్ పూనం యాకయ్య బత్తుల రామన్న జూన్నూరి వెంకన్న యాకాచారి తదితరులు పాల్గొన్నారు.

## తాటికాయలో వ్యవసాయ అధికారుల క్షేత్ర సందర్శన

**ప్రజాపక్షం/ధర్మసాగర్:** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో శుక్రవారం క్షేత్ర పదర్శన నిర్వహించారు. ఈ సం దర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజేష్ రైతులకు కీలక సూచనలు చే శారు. పంటపెరుగుదల రోగాల నివారణ, ఎరువుల వినియోగం, నీటిస ద్వి నియోగంపై రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పంటల్లో ఏమైనా సమస్యలు తలెత్తిన పక్షంలోవ్యవసాయ శాఖను సంప్రదించాలని కోరారు. తెలంగాణ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పంపిణీ చేసిన నాణ్యమైన వరి డబ్ల్యుజిఎల్ 44కంది డబ్ల్యుఆర్జి 121పంటలను పరిశీలిండం జరిగిం దని అన్నారు. గ్రామల్లోని రైతులు అధికారులు ఇచ్చిన సూచనలను పాటిం చాలని కోరారు. ఎఆఇఒ, జైశ్రీ రైతులు తదితరులు ఉన్నారు.

# గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** జిల్లాలోని అన్ని గ్రా మ పంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా ను ప్రదర్శించామని, ఓటర్ల ముసాయిదా జాబి తాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియ జేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జి ల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా లోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీలో ప్రదర్శించిన ఓటర్ల ముసా యిదా జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివ రించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్ర తినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గు రించి అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చా రు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబ రిష్ మాట్లాడుతూ జిల్లాలో 210 గ్రామపంచాయ తీలు ఉన్నాయని, గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను గురువారం ప్రదర్శిం చామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటి వివరాలతో కూ డిన సమాచారాన్ని అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాపై గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సమావే శంలో పాల్గొన్న రాజకీయ పార్టీలో ప్రతినిధులకు సూచించారు. మండల స్థాయిలో ఈనెల 30వ తేదీన మండల స్థాయిలో సమావేశాన్ని నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్న త మ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేసి తుది ఓటర్ల జాబితాను వచ్చే నెల రెండవ తేదీన ప్రచురణ చేయడం జరుగు తుందన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఓటర్లు 3,70,867 ఉన్నారని, 1986 పోలింగ్ కేంద్రా లు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపల్ పరిధిలో ఓటు ఉన్నవారిని గుర్తించి ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా రెండు చోట్ల ఓట్లు ఉన్న వారిని తొలగించాలని కోరుతూ ఆ జాబితాను బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి, కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, తదితరులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచా యతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, వివిధ రాజకీ య పార్టీల ప్రతినిధులు ఇ. వి. శ్రీనివాస్ రావు, ఇండ్ల నాగేశ్వరరావు, నిశాంత్, ప్రభాకర్ రెడ్డి, రజినీకాంత్, ఎండి. నేహాల్, శ్యాంసుందర్, సయ్యద్ ఫైజుల్లా, కొట్టె ఏసోబు, మణి, తదిత రులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ టిజి మాడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో రూ.4.5లక్షల నిధులతో కిచెన్ షెడ్ నిర్మాణ పనులు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.12లక్షల నిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను, గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో రూ.45లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైయిన్స్ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు పాల్గొన్నారు.

## సమస్యల సాధనలో ఉద్యోగుల భాగస్వామ్యం

జిల్లా జెఎసి చైర్మన్ ఆకుల రాజేందర్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్ర జెఎసి ఉద్యమ కా ర్యాచరణ పిలుపు మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉ ద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జిల్లా జెఎసి చైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం పోస్టర్ను ఆవిష్కరించడం జరిగినది. అనంతరం ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరి ష్కారం కోసం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 20 నెల లకు పైగా ఎదురుచూడడం జరిగిందని ఇప్పటికే సమస్యల పరిష్కారానికి విపరీతమైన కాలయాపన జరిగిందని దీనివల్ల ఉద్యోగులకు ఆర్థికంగా ఎంతో నష్టం వాటిల్లుతున్నదని పెం డింగ్ డిఎలు, పిఆర్‌సి, ఇహెచ్ఎస్, పెండింగ్ బిల్లులు మొద లగు ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటితో పాటుగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు కార్యాచరణ ఆపేది లేదని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు ఆర్అండ్ బి, మిషన్ భగీరథ, ఇరిగేషన్, ఐటిఐ, కెఎంసి, పాలిటెక్నిక్ డిపా ర్ట్మెంటులలో పెన్షన్ విద్రోహ దినం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, జెఎసి నేతలు కిరణ్ గౌడ్, వెంకటేశ్వర్లు, రవి ప్రకాష్, టిఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్ కోశాధికారి పనికిల రాజేష్, శ్యామ్ సుందర్, కేంద్ర సంఘ నాయకులు రాము నాయక్, కత్తి రమేష్, జిల్లా నేతలు రాజమౌళి, దివాకర్ రెడ్డి, తిరుపతి, రాజేష్ ఖన్నా, భారత్, శ్రీనివాస్, రామ కృష్ణ, విజయ్ మోహన్, సునీల్, వేణు గోపాల్, శ్రీలత, మెహబూబ్, రవీందర్, రమేష్, ఆధిత్య, యూసఫ్ ఖాన్, మంజుల, నిఖిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

రాజకీయ పార్టీలను కోరిన కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం / జనగామ :**ముసాయిదా ఓటర్ల జా బితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ రాజకీయ పార్టీ లకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అఖిలపక్ష పార్టీల సమా వేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశా ల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా సిద్ధం చే యడం జరిగిందన్నారు. జిల్లాలోని వార్డులలో గ్రా మ పంచాయతీలతో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. ఏమైనా అభ్యంతా రలు ఉంటే ఈ నెల 29,30 తేదీలలో తెలియజే యాలన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 280 గ్రామపంచాయతీలలో 2534వార్డులకు గాను 2534 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరి గిందన్నారు. జిల్లాలో మహిళ ఓటర్లు 2లక్షల 2 వేల 906 మంది ఉండగా పురుషులు లక్షా 98వేల 466 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇతరులు 8 మంది ఉండగా మొత్తం 4లక్షల 1406 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సెప్టెంబర్ రెండవ తేదీన ఫైనల్‌లిస్ట్ రూపొందించడం జరుగుతుందని, ఓట రు మార్పులు, చేర్పులు కూడా ధరఖాస్తులు అం దించాలన్నారు. ఈ అఖిలపక్ష పార్టీల సమావేశం లో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, డివిజ నల్ పంచాయతీ అధికారి వెంకటరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బృంగి భాస్కర్, పి ప్రశాంత్, రావెల రవి, బి నవీణ్‌నాయక్, విజయభాస్కర్, వెంకటమల్లయ్య, చొప్పరి సోమయ్య, అజయ్‌కు మార్, అర్‌టిఐ సభ్యులు అభిగౌడ్ పాల్గొన్నారు.

## 'స్థానిక సంస్థలు'ను ఎన్నికల్ని ఆషామాషీగా తీసుకోవద్దు

ప్రార్టీ శ్రేణులకు కడియం శ్రీహరి హెచ్చరిక



**ప్రజాపక్షం / జనగామ :**స్థానిక సంస్థల ఎన్నికల్ని ఎవరు ఆషా మాషీగా తీసుకోవద్దు అని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్‌లో శుక్రవారం నియోజకవర్గ సమ న్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో విస్తృత్త స్థాయి స మావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. క్యాబినెట్ మీటింగ్‌లో స్పష్టత వస్తుందని, ఒక్కో ఎంపిటిసి స్థానానికి ఇద్దరు ఇంన్‌చార్జీలను నియమించామన్నారు. ఇన్‌చార్జిలు గ్రామంలోని అందరి అభిప్రాయాలు తీసుకొని రెండు, మూడు పేర్లు సిఫారస్సు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ కమిటీలు బలంగా పనిచేయాలని, కమిటీ సిపారస్ చేసిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత ఇన్‌చార్జీలదే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు సాధించిన వారే నిజమైన కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలని, అందరం కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులుగా పనిచేయాలన్నారు. ఎన్ని భేదాభిప్రాయాలు ఉన్నా ఎన్నికల్లో కటిసికట్టుగా పనిచేయాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలన్నారు. ప్రజల నుండి ప్రభుత్వంపై సానుకూలత ఉందని, ఆ సానుకూలతను స్థానిక సంస్థల ఎన్నికల్లో సద్వీని యోగం చేసుకోవాలనానరు. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి పనులు స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో జరుగుతున్నాయని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలో యూరియా కొరత ఉన్నా స్టేషన్ ఘనపూర్‌లో మా త్రం కొరత లేకుండా చూస్తున్నామన్నారు. రెండు రోజుల్లో మరో 500 మె ట్రిక్ టన్నుల యూరియా వస్తుందని, నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయ ర్లను నీటితో నింపుకోవడం జరిగిందన్నారు. వానాకాలమే కాదు యాసం గిలో కూడా పంటలకు కాలువల ద్వారా నీరందించేందు ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు నీరందించే బాధ్యత తనద న్నారు. రానున్న మూడు ఏళ్లలో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని ప్రజాప్రతినిధు లుగా చూడాలన్నదే తన కోరిక అన్నారు. కోర్టు తీర్పు ఎరకంగా వచ్చినా ఎద ర్కొవడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. దాని గురించి ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అందరి దృష్టి స్థానిక సంస్థల ఎన్నికలపైనే ఉండా లన్నారు. స్టేషన్‌ఘనపూర్‌లో ఏదీ జరిగిగా కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ ద్వారానే జరుగుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లో వంద శాతం విజయం సాధి స్తామన్న ధీమా ఉందని, అందరు కష్టపడి పనిచేయాలన్నారు. అందరు కలి సికట్టుగా పనిచేస్తేనే విజయం వరిస్తుందని, ప్రతి నాయకులు, కార్యకర్త ఇది గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రతినిదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమాజహితం కోసం జర్నలిస్టులు పనిచేయాలి

సమాచార కమిషనర్లు పివి శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** జర్నలిస్టులుగా సమాజహితం కోసం పని చేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్లు పివి శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డిలు అన్నారు. అధికారిక పర్యటన నిమిత్తం వరంగల్ కు విచ్చేసిన పివి శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డిలను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మీయ సన్మానం జరిగింది. క్లబ్ కు వచ్చిన సీనియర్ జర్నలిస్టులైన సమాచార కమీషనర్లు క్లబ్ సభ్యులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సద య్య, గొకారపు శ్యాం, యంసాని శ్రీనివాస్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఎండి న యీంపాషా, బలవారి విజయ్ రాజ్, యూనియన్ల జిల్లా,రాష్ట్ర నాయకులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వల్లాల వెంకటరమణ, గడ్డం కేశవమూర్తి, పెండెం వేణుమాధవ్, ఎం అరుణ్, బూరం ప్రశాంత్, నల్లాల బుచ్చిరెడ్డి, విద్యాసాగర్,ఎండి ఉస్మాన్ పాషా, శాగంటి శ్రీనివాస్, పారిజాతం కిషోర్ కుమార్,ప్రభాకర్ పలువురు సీనియర్ జర్నలిస్టులు హాజరయ్యారు.

## ప్రతి పౌరుడికీ మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ :** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని రెడ్డిపురం గ్రామంలో విజయలక్ష్మి కాలనీ నుంచి సాయి కృప కాలనీ వరకు సాయి కృప కాలనీ నుండి ఎస్సారెస్పీ కెనాల్ వరకు సుమారు రూ.1 కోటి 50 లక్షల జిడబ్ల్యుఎంసి సాధారణ నిధులతో నిర్మిం చబోయే బిటి రోడ్డుకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ప్రతి పౌరుడికి మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, గత కొన్ని సంవత్సరాలుగా రెడ్డిపురం గ్రామంలోని పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, డ్రైనేజీ సమస్యకు ఇది శాశ్వత పరిష్కారం అవుతుందని అన్నారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించానని, గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని తీసుకురావడా నికి మీ అందరి సహకారం అవసరం అని, అంతటితో కాకుండా గ్రామ ప్రజల అభ్యర్థనలు, సమస్యలను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు అభివృద్ధికి భాగస్వాములై ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవి నాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగిలాల్, ఎనుమాముల ఏఎంసీ డైరె క్టర్ రైతు రాజు, హన్మకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, డివి జన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరు పతి, జవహర్ నాయక్ తో పాటు డివిజన్, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా రవాణాకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మహాలక్ష్మి పథకం ద్వారా ప్రజా రవాణాకు ప్రభు త్వం పెద్దపేట వేసిందని, ప్రజలు ఆర్‌టిసి బస్సు సేవలను సద్వినియోగం చే సుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో భూపాలపల్లి పర కా(వయా మొరంచపల్లి, ఎస్ యం కొత్తపల్లి, ఒడితల, గోపాలపురం, కాకర్ల పల్లి, కొడవటంచ, లింగాల, రేగొం) సర్వీసును ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హా జరై ప్రారంభించారు. అనంతరం బస్సులో భూపాలపల్లి బస్టాండ్ నుంయి మొ రంచపల్లి, ఎస్‌ఎం కొత్తపల్లి, ఒడితల, గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ వరకు సాధారణ పౌరుడిలా ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశారు. ఒడి తల గ్రామానికి బస్సు చేరుకోగా మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువా లు కప్పి స్వాగతం పలికారు. బస్సు వద్ద గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టా రు. గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ గ్రామాల్లో కూడా గ్రామస్తులు ఎ మ్మెల్యేకు శాలువాలు కప్పారు. కాకర్లపల్లిలో వినాయకస్వామి మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ప్రయాణం అనంతరం ఎమ్మెల్యే కొడవటంచలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఆర్‌టిసి బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాల న్నారు. మహాలక్ష్మి పథకం రాష్ట్రంలో విజయవంతంగా కొనసాగుతుందన్నా రు. ఉదయం 6:30 గంటలకు భూపాలపల్లి బస్టాండ్ నుండి బస్సు బయలు దేరి పరకాలకు 8 గంటలకు చేరుకుంటుందని, తిరుగుప్రయణంలో ఉదయం 8:15 గంటలకు పరకాల బస్టాండ్ నుండి బస్సు బయలుదేరి 10 గంటలకు భూపాలపల్లి బస్టాండ్ కు చేరుకుంటుందన్నారు. సా:5:15 గంకు భూపాలప ల్లి బస్టాండ్ నుండి బస్సు బయలుదేరి 6:45 గంటలకు పరకాల చేరుకుంటుం దని 7:00గంటలకు పరకాల బస్టాండ్ నుండి బస్సు బయలుదేరి 8:20 గంట లకు భూపాలపల్లి బస్టాండ్ కు చేరుకుంటుందని వివరించారు. ఈ గ్రామాల ప్రజలందరూ ఆర్‌టిసి బస్సు సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డి ఎం ఇందు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, పిసిసి సభ్యుడు చల్లూరి మధు, కంకటి రాజ వీరు, చల్లూరి సమ్మయ్య, సాంబమూర్తి, మాజీ కౌన్సిలర్ లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ సుగుణాకర్‌రాజ్‌కు చిరంజీవి ప్రతిభ సన్మాన్ అవార్డు

**ప్రజాపక్షం/ జనగామ:** జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, తొర్రూర్ హాస్పటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజుకు మహా రాష్ట్ర ప్రభుత్వంచే చిరంజీవి ప్రతిభాష్ సన్మాన్ అవార్డు లభించింది. స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును జీవన్ ఈషీష్ సమ్మిట్ కోట, హేమక్షీ ఫబ్లికేషన్, షికార్ రాజస్థాన్ ఆధ్వర్యంలో ప్రకటించారు. డాక్టర్ సుగుణాకర్‌రాజు వైద్య రంగంలో వివిధ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణాకర్‌రాజుకు పలువురు అభినందనలు తెలిపారు. డాక్టర్ సుగుణాకర్ రాజు వైద్యరంగం లో అనేక సేవలు అందించారు.

ఫాసెస్ట్ సర్జరీ చేసి లిమ్కాబుక్‌లోనే పేరు సంపాదించుకున్నారు. పట్టణ ప్రాంతంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వారి మన్నలను పొందుతున్నారు.

# రీల్

## 'జటాధర'లో శిల్పా శిరోద్కర్

సుధీర్ బాబు, బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. మూవీ మేకర్స్ ఒక కీలకమైన కొత్త క్యారెక్టర్‌ని ఇంట్రడ్యూస్ చేశారు. శోభగా శిల్పా శిరోద్కర్‌ని పరిచయం చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఆమె బ్లాక్ చీర కట్టుకుని, హోమగుండం ముందు కూర్చొని కనిపించారు. ఆ పోస్టర్ మొత్తం తాంత్రిక శక్తులని సింబలైజ్ చేస్తోంది. శిరోద్కర్ ఇచ్చిన ఇంటెన్స్, సీరియస్ ప్రెజెన్స్ సినిమా సూపర్‌నాచురల్, స్పిరిచువల్ టోన్‌కి పర్ఫెక్ట్‌గా సూట్ అయింది.



## తమిళంలో రాజ్ తరుణ్ ఎంట్రీ



'గోలీసోడా', గోలీసోడా2 చిత్రాల దర్శకుడు,ప్రముఖ కెమెరామెన్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తాజాగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ద్వి భాషా చిత్రగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో రాజ్ తరుణ్ కథానాయకుడు. ఆయన చిత్రంతో తమిళంలోకి ఎంట్రీ ఇస్తున్నారు. రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'గాడ్స్ అండ్ సోల్జర్'గా టైటిల్‌ని ఫిక్స్ చేసి ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ప్రముఖ తమిళ కథానాయకులు విజయ్ సేతుపతి, విజయ్ ఆంటోని, ఆర్యలతో పాటు విశ్వక్‌సేన్ తమ ఎక్స్ అకౌంట్ వేదికగా టైటిల్‌ను ట్వీట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ గోలీసోడాలోని రఫ్‌నెస్‌ను, న్యూ చాప్టర్‌లో ఈ సినిమాలో ఆడియన్స్ చూడబోతున్నారు. ఈ టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## రాజేశ్వరి కుటుంబానికి ఆపద్బాంధవుడు

**మెగాస్టార్ చిరంజీవిని కలవడానికి సైకిల్‌పై వచ్చిన అభిమాని**

మహోన్నతమైన వ్యక్తిత్వం, యెనలేని సేవాతత్వంతో కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన మానవత్వాన్ని చాటారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని పట్టణానికి చెందిన చిరంజీవి వీరాభిమాని రాజేశ్వరి, మెగాస్టార్‌ని కలవాలనే కోరికతో సైకిల్‌పై హైదరాబాద్‌కు సాహసోపేత ప్రయాణం చేశారు. ఎన్నో శారీరక, మానసిక సవాళ్లు ఎదురైనా చిరంజీవిపై వున్న అపారమైన అభిమానమే ఆమెను విజయవంతంగా ముందుకు నడిపింది. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి, రాజేశ్వరిని హృదయపూర్వకంగా నివాసానికి ఆహ్వానించారు. ఆమె అంకితభావానికి, తనను చేరుకోవడానికి చేసిన కృషికి చలించిపోయిన చిరు, ఒక చిరస్మరణీయ జ్ఞాపకాన్ని ఇచ్చారు. ఆ సందర్భంలో రాజేశ్వరి, మెగాస్టార్‌కి రాఖీ కట్టగా, ఆమెకు ఆశీస్సులు అందించి అందమైన సాంప్రదాయ చీరను బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేశ్వరి కుటుంబ విషయాలను చిరంజీవి అడిగి తెలుసుకున్నారు. రాజేశ్వరి పిల్లల విద్య కోసం, వారి భవిష్యత్‌లో వెలుగు నింపడం కోసం పూర్తి స్థాయి ఆర్థిక సహాయం అందించనున్నట్లు చిరంజీవి హామీ ఇచ్చారు. ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పారు. తన అభిమానులను కేవలం అభిమానులుగానే కాక, కుటుంబ సభ్యుల్లా చూసుకునే చిరంజీవి గొప్ప మనసుకు ఇది మరొక ఉదాహరణగా నిలిచింది. సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా చిరంజీవి మెగాస్టార్ అని నిరూపించుకున్నారు.



## 'వేదవ్యాస్' షూటింగ్ ప్రారంభం




తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో ఘన విజయాలను అందించిన దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి 43వ సినిమా 'వేదవ్యాస్' హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రారంభమైంది. తెలంగాణ ఎఫ్‌డీసి చైర్మన్, నిర్మాత దిల్ రాజు, డైరెక్టర్స్ ఎస్వీ, వివి నాయక్, అనిల్ రావిపూడి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని కె.అచ్చిరెడ్డి సమర్పణలో సాయిప్రగతి ఫిలింస్ బ్యానర్ పై ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో సౌత్ కొరియా నటి జున్ హ్యాన్ జీ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఎస్వీ కృష్ణారెడ్డి. చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా హీరోయిన్ జున్ హ్యాన్ జీని ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు 'హలో కంగ్రాట్యులేషన్స్ అండ్ వెల్‌కమ్ టు టాలీవుడ్ అంటూ బొకే అందించగా ఆమె 'థాంక్యూ సర్' అనటాన్ని ముహూర్తపు షాటుగా చిత్రీకరించారు. కాగా ఈ ముహూర్తపు షాట్ కు దర్శకుడు వివి వినాయక్ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాత జెమినీ కిరణ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ పూర్తి చేస్తామని చిత్ర సమర్పకులు అచ్చిరెడ్డి చెప్పారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. కృష్ణారెడ్డి సినిమాలు నచ్చి ఆయనతో సినిమా నిర్మిస్తున్నానని నిర్మాత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తెలిపారు. విలన్‌గా చాలా సెర్చ్ చేసి మంగోలియన్ ఆర్టిస్ట్‌ను సెలెక్ట్ చేసుకున్నాం అని చెప్పారు. జున్ హ్యాన్ జీ, మురళీ మోహన్, సుమన్, సాయికుమార్, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రఘుబాబు, పృథ్వీ, రాజశ్రీ నాయర్, విద్యుల్లేఖ రామన్, దేవి శ్రీ, నవీనా రెడ్డి, ఐమ్యాక్స్ వెంకట్, బేబి సహస్రశ్రీ, మాస్టర్ మురారి, మాస్టర్ మోక్షజ్ఞ, మాస్టర్ రాయన్ నటిస్తున్నారు.

## విశాల్, సాయి ధన్సికల నిశ్చితార్థం

విశాల్, సాయి ధన్సిక నిశ్చితార్థం శుక్రవారం ఘనంగా జరిగింది. పెళ్లికి అడుగులు పడ్డాయి. కుటుంబ సభ్యుల సమక్షంలో విశాల్, సాయి ధన్సికల నిశ్చితార్థం ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యుల సమక్షంలో మా ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగింది.. అందరి ఆశీర్వాదం మాకు కావాలి అంటూ సోషల్ మీడియాలో విశాల్ తాజాగా సోషల్ మీడియాలో కోరారు. ఇక త్వరలోనే పెళ్లికి సంబంధించిన ఇతర వివరాల్ని విశాల్ ప్రకటించనున్నారు. విశాల్, ధన్సిక గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విశాల్, ధన్సిక ఇద్దరూ కూడా స్టేజ్ మీదే తమ ప్రేమ, పెళ్లికి సంబంధించిన విషయాల్ని ప్రకటించారు. ముందు చెప్పినట్టుగానే ఆగస్ట్ 29న ఈ ఇద్దరి



## ధర్మవరం పోస్టర్ విడుదల



'ధర్మవరం' చిత్రంలో రాజ్ వేంకటాచ్చ హీరోగా నటించడంతో పాటు కథ, దర్శకత్వం వహించి, ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కథానాయకుడిగా తన అద్భుతమైన నటనతో పాటు దర్శకుడిగా తన ప్రత్యేకమైన ముద్రను వేసేందుకు రాజ్ వేంకటాచ్చ ప్రయత్నిస్తున్నారు.ప్రధాన పాత్రల్లో అజయ్, నవీన్ రెడ్డి, సంయోగీత, ఏశాన్ ఖాన్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ ధర్మవరం పోస్టర్ చాలా బాగుంది. రాజ్ వేంకటాచ్చ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను అన్నారు. ధర్మవరం సినిమాను త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

## 'గప్ చుప్ గణేశా' ఫస్ట్ లుక్ ఆవిష్కరణ

కేఎస్ ఫిలిం వర్క్స్ బ్యానర్‌పై సూరి ఎస్ దర్శకత్వంలో కేఎస్ హేమ్రాజ్ నిర్మాతగా రోహన్, రిదా జంటగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'గప్ చుప్ గణేశా'. ఈ చిత్రానికి శ్రీ తరుణ్ సంగీతాన్ని అందించగా అంగత్ కుమార్ సినిమాటోగ్రాఫర్ గా పని చేశారు. ఈ చిత్రంలో అంబటి శ్రీనివాస్, గడ్డం నవీన్, అశోక్ వర్ధన్, సోనాలి పాణిగ్రహి, కిషోర్ మారిశెట్టి తదితరులు కీలకపాత్రలో పోషించారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ ఈ చిత్ర ఫస్ట్ లుక్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత హేమ్రాజ్, దర్శకుడు సూరి ఎస్, నటుడు రోహన్ పాల్గొన్నారు. రోహన్, రిదా, అంబటి శ్రీనివాస్, గడ్డం నవీన్, అశోక్ వర్ధన్, సోనాలి పాణిగ్రహి, కిషోర్ మారిశెట్టి తదితరులు నటించారు.




# 'రెవెన్యూ' తిమింగలాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎసిబి అధికారులు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో దాడులు జరిపారు. ఖిలా వరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, వీణవంక మండలం చల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కుంభం నాగరాజు అనే అవినీతి 'రెవెన్యూ' తిమింగలాలు ఎసిబి వలకు చిక్కాయి. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఇళ్లపై అవినీతినిరోధక శాఖ (ఎసిబి) అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డాడు. హన్మకొండలోని చైతన్యపురి, ఆయన స్వస్థలం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఇండ్లపై ఏకకాలంలో ఎసిబి బృందాలు దాడులు నిర్వహించాయి. శుక్రవారం ఉదయం ఈ దాడులు మొదలయ్యాయి. ఖిలావరంగల్ మండల తహసీల్దార్ కార్యాలయంలోనూ సోదాలు చేపట్టారు. ఖిలావరంగల్ తహసీల్దార్ ఆఫీసులోని సిబ్బందిని విచారించడంతో పాటు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే ఖమ్మం జిల్లాలో తహసీల్దార్ నాగేశ్వర్‌రావుకు ఒక భవనం, కోళ్ల ఫారమ్ ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో అక్కడ కూడా ఎసిబి అధికారులు దాడులు జరిపారని తెలిసింది. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న బండి నాగేశ్వర్ రావుపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించడం రెవెన్యూ శాఖలో కలకలం రేపుతోంది. ఖిలావరంగల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగేశ్వర్‌రావు గతంలో హసన్ పర్తి, కాజీపేట మండలాల తహసీల్దార్‌గా కూడా పనిచేశారు. కాగా ఈ దాడులలో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుకు చెందిన రూ.1.15 కోట్ల ఇల్లు, రూ.1.143 కోట్ల విలువైన 17.10 ఎకరాల వ్యవసాయ భూమి,రూ.24 లక్షల బంగారు ఆభరణాలు,రూ.35 లక్షల రెండు ఫోర్ వీలర్స్,రూ.3 లక్షల విలువైన రిస్ట్ వాచీలు సహా మొత్తం రూ.5 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ఎసిబి అధికారులు గుర్తించారు.

### రెడ్‌హ్యాండెడ్‌గా...చల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు

లంచం తీసుకుంటూ ఎసిబికి వీణవంక మండలంలోని చల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కుంభం నాగరాజు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నిర్మాణం జరిగిన ఇంటికి నెంబర్ ఇవ్వడానికి నాగరాజు ఒక వ్యక్తిని లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. ఎసిబి డిఎస్‌పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో శుక్రవారం చల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. డిఎస్‌పి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారి ఎవరు లంచం డిమాండ్ చేసినా '1064' నెంబర్‌కు వెంటనే సమాచారం అందించాలని , బాధితుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. చల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎసిబికి పట్టుబడ్డాడని తెలుసుకున్న గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

# మొదటి ప్రమాద హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)


ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి మరో సారి వరద తాకిడి పెరిగింది. గోదావరిపై ఉన్న ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఎగువ నుండి ప్రాజెక్టుల్లో వరద నీరు చేరుకోవడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రాలో పెద్ద ఎత్తున వర్షాలు పడుతుండటంతో పాటు గోదావరి పరివాహకజిల్లాల్లో వర్షపు నీరు ముంచెత్తడంతో ఆ నీరంతా గోదావరిలో వచ్చి కలుస్తోంది. మరోప్రక్క ప్రాణహిత, ఇంద్రావతి నదులు సైతం పొంగి పొర్లుతూ నదిలో కలుస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పడుతున్న వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలోని చర్ల మండలంలో గల తాలిపేరు ప్రాజెక్టులోకి భారీ వర్షపునీరువచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువనున్న గోదావరి నదిలోనికి విడుదల చేస్తున్నారు. తద్వారా క్రమంగా భద్రాచలం వద్ద వరద తాకిడి పెరుగుతోంది. ఈ వరద క్రమేపీ పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఈనెల 21వ తేది మూడవ ప్రమదాహెచ్చరిక చేరువలో51.09 అడుగుల వరద ప్రవహించినంది. అక్కడి నుండి క్రమంగా తగ్గతూ వచ్చింది. 22వ తేదిన 48 అడుగులకు ప్రవహించడంతో అధికారులు 2వ ప్రమాద హెచ్చరిక కొనసాగించారు. అదే రోజు సాయంత్రం వరకు 43 అడుగుల దిగువకు చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికతో పాటు మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరించారు. అక్కడ్నుండి క్రమేపీ తగ్గుతూ వచ్చిన గోదావరి నది గత గడిచిన మూడు రోజుల నుండి పడుతున్నవర్షాల కారణంగా మరోసారి పెరుగుతోంది. 29వ తేది సాయంత్రం 42 అడుగుల చేరుకుని రాత్రి కడపటి వార్తలు అందే వరకు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43 అడుగుల దాటి ప్రవహిస్తుండటంతో అధికారులు తొలి ప్రమాద హెచ్చరికను వారం రోజుల్లో మరో సారి ఎగురవేశారు. ఎగువన వరద ప్రవాహం పెద్ద ఎత్తున ఉడటంతో గోదావరికి మరిత వరద పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి తీరంలో గజీతగాళ్లతో పాటు డిడిఆర్‌ఎఫ్ బృంధాలు, నాటు పడవలు సిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో నదీ తీరంలో చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



శాసన సభా సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు బిఆర్‌ఎస్‌ఎల్‌పికి అవకాశం కల్పించాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కె.పి.వివేకానంద, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎంఎల్‌సి శేరిసుభాష్ రెడ్డి, బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయ కార్యదర్శి ఎం.రమేష్ కుమార్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు.

# రేపు ప్రొ.ఎస్వీకి గిడుగు జాతీయ జీవన సాఫల్య పురస్కారం



ప్రజాపక్షం/హైదరాబాద్: 'సుప్రసిద్ధ కవి, విమర్శకులు, పరిశోధకులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణకు తొలి తెలుగు భాషా శాస్త్రవేత్త, వ్యావహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ఆదివారం రవీంద్ర భారతిలో ప్రదానం చేయనున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ప్రతియేటా ప్రతిభావంతులైన కవులకు, సాహితీవేత్తలకు అందజేసే గిడుగు జాతీయ జీవన సాఫల్య పురస్కారానికి ఈయేడాది ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ఎంపిక చేసినట్లు గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ అధ్యక్షులు బిక్కి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌వి అన్న సంక్షిప్త నామంతో ప్రఖ్యాతులైన ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ 30 గ్రంథాలను రచించారు. మరో 34 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులుగా, ఆర్ట్స్ విభాగం డీన్‌గా, ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులుగా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ ఎస్వీ తెలుగు విశ్వవిద్యాలయం పదవ ఉపకులపతిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. వారి హయాంలోనే బాచుపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో బాలుర వసతిగృహం నిర్మించబడిరది. 'హలో విద్యార్థీ – చలో క్లాస్‌రూం' అంటూ ఆయన ఇచ్చిన నినాదం బహుళ ప్రజాదరణ పొందింది. గతంలో ఒక పర్యాయం కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న ఎస్వీ ప్రస్తుతం రెండవ పర్యాయం ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. సరిగమలు, జీవజ్వాల, యుద్ధం జరుగుతూనే ఉంది, జీవితం ఒక ఉద్యమం, ఉద్యమం ఉద్యమమే వంటి కవితా సంపుటులను తెలుగులో ఉద్యమ గీతాలు, దృక్పథాలు, సత్యానుశీలన మొదలైన ప్రామాణిక పరిశోధన గ్రంథాలను రచించిన ఎస్వీ; దళితవాద వివాదాలు, స్త్రీవాద వివాదాలు; గ్లోబలైజేషన్ కథలు, ప్రపంచీకరణ ప్రతిధ్వని వంటి ఉత్తమ గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. అనేక మంది ప్రముఖుల జీవిత చరిత్రలను గ్రంథస్తం చేశారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం, ముఖ్దూం జాతీయ పురస్కారం, శ్రీశ్రీ స్వర్ణ పతకం, తుమ్మల పురస్కారం మొదలైన 30కి పైగా సాహితీ సత్కారాలు, పురస్కారాలు పొందిన ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ సాహిత్య, సాంస్కృతిక, పరిశోధన, పరిపాలనారంగాలకు చేస్తున్న విశిష్టమైన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని బిక్కి కృష్ణ తెలిపారు.

## విజిలెన్స్ డిజిగా విక్రమ్‌సింగ్ మాన్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ విజిలెన్స్ కొత్త డిజిగా విక్రమ్‌సింగ్ మాన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విజిలెన్స్ డిజిగా విధులు నిర్వహిస్తున్న కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఈ క్రమంలోనే విక్రమ్‌సింగ్ మాన్‌ను నియమించారు.

# పైరవీకారుల అడ్డాలు

(మొదటి పేజీ తరువాయి)

సామాన్యుల పరిస్థితి అయోమయమైంది. రాజకీయ నేతలు తమ గోడు పట్టించుకోక, అధికారులు స్పందించక ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పైరవీకారులకు అడ్డాలుగా మారుతున్నాయి. పోలీస్ స్టేషన్లు కూడా ఇందుకు భిన్నంగా లేవు. సక్రమమో అక్రమమో కానీ పైరవీకారుల అవతారమెత్తిన రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరుగుతున్నాయన్నది వాస్తవం. ఏదైనా ఒక కారణం చేత పని చేయకుంటే వెంటనే పైస్థాయి నాయకుల నుంచి ఫోన్లు చేయించడం ఆనవాయితీగా మారింది. ఈ ఫోన్లకు స్పందించే అధికారులు రెండు రకాలుగా ఉన్నారు. ముందుగా అక్రమాన్ని సక్రమం చేసే క్రమంలో ఒక్కసారి ఎంఎల్‌ఏ లేదా పెద్ద నాయకునితో ఫోన్ చేయించండి ఆ ఫోన్ కాల్‌ను ఆసరాగా చేసుకుని పని చేస్తానంటూ పైరవీకారులతో ఒప్పందాలు కుదుర్చుకునే అధికారుల సంఖ్య ఇప్పుడు పెరుగుతుంది. ప్రతి పనికి ఏదో ఒక రేటు మాట్లాడుకోవడం అంతా సజావుగా జరిగిన తర్వాత పుచ్చుకోవడం అధికారులకు ఇబ్బంది లేకుండా పోతుంది. అవసరానికి తమ వద్దకు వచ్చే వారి పనుల వివరాలను తెలుసుకోవడం ఈ పనికి ఇంత ఖర్చు అవుతుందని చెప్పడం ఆ తర్వాత అధికారులతో మాట్లాడటం డిల్ ఓకే ప్రోసిడ్ అంటూ కోడ్ భాష మాట్లాడటం పరిపాటిగా మారింది. ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ము నీకు కొంత నాకు కొంత అని పంచేసుకుంటున్నారు. ఇందులో కొన్ని కార్యాలయాలను కొంత మంది అధికారులను మినహాయించాల్సి వచ్చినా వారి సంఖ్య బహు స్వల్పం. మంత్రుల కంటే ఉన్నతాధికారుల కంటే ఈ పైరవీకారులు చెప్పిన పని వెనువెంటనే అవుతుందంటే అతిశయోక్తి కాదు. ఇసుక ట్రాక్టర్లు, భూముల రిజిస్ట్రేషన్, ధృవీకరణ పత్రాలు, పోలీస్ స్టేషన్‌లో చిల్లర పంచాయతీలు ఈ పైరవీకారుల కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. ఈ పైరవీకారులకు రాజకీయ ముద్ర అన్నింటికి మించి అధికార ముద్ర ఉండడంతో వీరికి ఎదురు లేకుండాపోయింది. ఏ అనుమతినైనా ఇట్టే చేస్తామంటూ చిటికెలేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సామాన్యుడికి, పలుకుబడి లేని వారికి పనులు కాకపోవడంతో చివరకు పైరవీకారులనే ఆశ్రయిస్తున్నారు. ఇటీవల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కంప్యూటర్ సెంటర్లే కీలక పాత్ర పోషిస్తున్నాయి. భూములైనా, ప్లాట్లు అయినా ఒప్పందమంతా కంప్యూటర్ సెంటర్లలోనే జరిగిపోతుంది. సాయంత్రానికి అధికారులకు చేరిపోతున్నాయి. ఇటీవల కాలంలో ఏసిబి దాడులు ఉధృతంగా జరుగుతుండడంతో లంచాలకు అలవాటుపడిన అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గడిచిన ఏడాదిగా ఈ పైరవీకారుల జోరు మరింత పెరిగింది. ఇందులో ఇందిరమ్మ ఇండ్లకు కూడా మినహాయింపు లేకుండా వసూళ్లు చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక కొందరైతే తామే ఎంఎల్‌ఎలుగా చెలామణి అవుతూ పనులు చక్కదిద్దుతున్నారు. మిగిలిన రాజకీయ పార్టీల విజ్ఞప్తులను అధికారుల దరి చేరనివ్వడం లేదు. తాము చెప్పిందే చేయాలి లేకుంటే బదిలీయే అన్న హెచ్చరికలు తరచూ వినవస్తున్నాయి. గత ప్రభుత్వంలో కొందరు ఇదే రీతిగా వ్యవహరించి తాము ఉన్న పార్టీని ఆ పార్టీ నేతలను భ్రష్టు పట్టించారు. ఇప్పుడు అదే కథ పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ఖమ్మం జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి ఇటువంటి పైరవీకారులపై కొరడా ఝుళిపించడమే గాక తనతో తిరగవద్దని తన కార్యాలయానికి రావద్దని హెచ్చరిక చేసినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. అయినా ప్రజాప్రతినిధుల ముసుగులో కుటుంబ సభ్యులు పైరవీలు కొనసాగుతున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయం సదరు ప్రజాప్రతినిధి దృష్టికి ఇంకా వెళ్లలేదని తెలుస్తుంది. కొందరు అధికారులు ఆ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యునికే భూ పరిష్కార బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తుంది. మిగిలిన నియోజకవర్గాల్లో మాత్రం పైరవీల జోరు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల విషయంలో పైరవీకారుల జోరును తగ్గించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com